
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 227

మంగళవారం 7-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పుట్టిన బిడ్డ సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలని తల్లితో పాటు ఆ కుటుంబం కూడా తపిస్తుంటుంది. అయితే, ఈ విషయంలో సరైన అవగాహన ఉండటం లేదనేది వైద్యుల మాట.

ఎందుకంటే, ఇప్పటికీ భారతదేశంలో నవజాత శిశు మరణాల రేటు ఆందోళనకరంగానే ఉంది. యూరప్‌లో 1990ల మొదట్లో శిశు మరణాల రేటును తగ్గించడానికి చర్యలు తీసుకోవడంలో, అవగాహన కల్పించేందుకు నవంబర్ 7ను శిశు రక్షణ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించాయి. ఆ తర్వాత అమెరికా, మిగతా దేశాలు కూడా ఈరోజు శిశు రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. నవజాత శిశువులలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, శిశు మరణాల రేటును తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలు తీసుకోవడం తప్పనిసరి.

శిశువు రక్షణ అందరి బాధ్యత

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి



ప్రెగ్నెన్సీ అని తెలియగానే కాబోయే తల్లితోపాటు, ఆ కుటుంబం కూడా జాగ్రత్త పడాలి. మన దగ్గర రక్తహీనత సమస్య, పోషకాహార లేమి ఎక్కువ. దీనివల్ల బేబీ గ్రోత్ మందగిస్తుంది. గర్భిణుల్లో హైపో థైరాయిడ్ సమస్య ఎక్కువ చూస్తున్నాం. ఐరన్ లోపం, రసాయనాల ఆహారం తీసుకోవడం వల్ల ఇలా జరుగుతుంటుంది. తల్లి ఆరోగ్యం సరిగాలేకపోతే లోపల బేబీ శరీర, మానసిక ఎదుగుదల పైన ప్రభావం చూపుతుంది. బీపీ, షుగర్.. వంటి సమస్యలు ఉన్నప్పుడు వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునేవారు ముందునుంచే వైద్యులు చెప్పిన టైమ్‌కి వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. తల్లి మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలి. అందుకు, సైకలాజికల్ కౌన్సెలింగ్ కూడా తీసుకోవడం ముఖ్యం. వైద్యులు చెప్పిన సూచనలు పాటించాల్సి ఉంటుంది. లేకపోతే కుటుంబం అంతా భవిష్యత్తులో రాబోయే సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ శిరీషా రెడ్డి, గైనకాలజిస్ట్, తార్నాక, హైదరాబాద్

ప్రమాదాలను ముందే పసిగట్టాలి



నెలలు నిండకుండా పుట్టడం, బరువు తక్కువుండి పుట్టడం, ఇన్ఫెక్షన్స్, పోషకాహార లోపం వల్ల శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఏడాదిలోపు పిల్లలను నవజాత శిశువులు అంటారు. ఈ సమయంలో సులువుగా ఇన్ఫెక్షన్స్ సోకుతుంటాయి. అందుకే, వీరిని చాలా జాగ్రత్తగా చూసుకోవడం అవసరం. ఏడాదిలోపు వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించగలిగితే ఆ తర్వాత వచ్చే సమస్యలను సులువుగా అధిగమించవచ్చు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే పట్టడం అవసరం, ఆరోగ్యం కూడా. ఆ తర్వాత వారికి ఇచ్చే పోషకాహారం చాలా ముఖ్యం. దీంతోపాటు వ్యాక్సినేషన్ చేయించడం ముఖ్యం. ఎందుకంటే, నిమోనియా, డయేరియా వల్ల మరణాలు ఎక్కువ. అందుకే, ప్రభుత్వం కూడా డయేరియా, న్యూమోనియా.. వ్యాక్సినేషన్ జాబితాలో చేర్చింది. పిల్లల వైద్యనిపుణుల పర్యవేక్షణ చాలా అవసరం. కొన్ని గ్రామీణ ప్రాంతాల వారికి ఈ సౌకర్యం అందుబాటులో లేకపోవచ్చు. కానీ, రెగ్యులర్ హెల్త్ చెకప్ అనేది ముఖ్యం అని తెలుసుకోవాలి. ఇక నవజాత శిశువులకు దెబ్బలు తగిలే అవకాశం కూడా ఉంది. మంచంపై నుంచి కింద పడటం వంటివి. చిన్న దెబ్బలు కూడా పెద్దవి కావచ్చు. మదర్ పోస్ట్ ప్యాటర్న్ డిప్రెషన్‌లో ఉన్నప్పుడు బిడ్డను చూసుకునేవారుండరు. ఇలాంటప్పుడు కూడా శిశువు సంరక్షణ ప్రమాదంలో పడుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కుటుంబం జాగ్రత్త వహించాలి.

– ప్రియాంకరెడ్డి, పిడియాట్రిషియన్, మాదాపూర్, హైదరాబాద్

ఒకరి ద్వారా మరొకరికి సూచనలు



మేం గర్భిణులపై ఎక్కువ ఫోకస్ పెడుతుంటాం. ఎందుకంటే, వారి ఆరోగ్యం బాగుంటేనే పుట్టబోయే బిడ్డ బాగుంటుంది. ఆరోగ్యం, పౌష్టికాహారంతో పాటు ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్లేవరకు ఎలా చూసుకోవాలో ఆమెకే కాదు, ఇంటిల్లిపాదికీ కౌన్సెలింగ్ ఇస్తాం. ఎంత చెప్పినా వినిపించుకోని వారు కొందరుంటారు. అయినా వారిని వదలకుండా తల్లి అయిన వారితో కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. చార్ట్ ప్రకారం వాళ్లు తీసుకోవాల్సిన పోషకాహారం, మందులు కూడా అంగన్‌వాడీ నుంచి ఇస్తుంటాం. చంటిపిల్లల విషయంలో మేం తగు జాగ్రత్తలు చెప్పడంతో పాటు, ఏ సమయానికి వ్యాక్సిన్లు వేయించాలి, ఎలా చూసుకోవాలి అనే విషయాల పైన తల్లులకు ఒకరి ద్వారా మరొకరు సూచనలు చేసుకునేలా కౌన్సెలింగ్ చేస్తుంటాం. దీనివల్ల నవజాత శిశు మరణాల రేటు తగ్గడమే కాకుండా శిశువులు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తుంది.

– వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్, ఖాసింపేట, సూర్యాపేట జిల్లా

బ్యూటి టిప్స్



● బీట్ రూట్ తొక్కలు, కమలా తొక్కలను నీడలో ఆరబెట్టాలి. పెళపెళ విరిగేలా తొక్కలు ఎండిన తరువాత మెత్తగా పొడిచేయాలి. రెండు టేబుల్ స్పూన్ల ఈ పొడిలో రోజ్‌వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి రాసి ఐదు నిమిషాలపాటు మర్దన చేయాలి. తరువాత పదిహేను నిమిషాలు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండు మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం కాంతిమంతంగా మెరుస్తుంది. ఈప్యాక్‌తో వచ్చే గ్లో ఎక్కువ రోజులు ముఖాన్ని అందంగా ఉంచుతుంది.

సక్సెస్ స్టోరీ

వాడేసిన ప్లాస్టిక్‌తో వండర్స్

మనింట్లో చాలా ప్లాస్టిక్ కవర్స్ పోగవుతాయి. వాటిని చెత్తలో పడేస్తాము. అవి ఎప్పటికీ మట్టిలో కలవక అలాగే కాలుష్యాన్ని కలిగిస్తూ ఉంటాయి. కాని ఈ ప్లాస్టిక్ కవర్లనే రాజిబెన్ దారాలుగా చేసి బ్యాగులు అల్లుతుంది. బుట్టలు చేస్తుంది. పర్సులు చేస్తుంది. డోర్‌మ్యాట్లు సరేసరి. అందుకే ఆమెకు చాలా గుర్తింపు వచ్చింది. ఆమె వల్ల ఎందరికో ఉపాధి కలుగుతోంది. కొత్త ఆలోచన చేసిన వారే విజేతలు.



● రీసైకిల్ ప్లాస్టిక్ బ్యాగ్‌తో రాజీ బెన్

గుజరాత్ కచ్ ప్రాంతంలోని కోటె అనే చిన్న పల్లెలో ఏమీ చదువుకోని అమ్మాయి – రాజీ బెన్ పెరిగి పెద్దదయ్యి లండన్ వెళ్లి అక్కడ పెద్దవాళ్లతో తాను చేసిన కృషిని వివరించింది. ఆమె తన జీవితంలో ఇంత పెద్ద ప్రయాణం చేసి, గుర్తింపు పొందేలా చేసింది ఏమిటో తెలుసా?

వృథా ప్లాసిక్. వాడేసిన ప్లాస్టిక్

రోడ్ల మీద, ఇళ్ల డస్ట్‌బిన్‌లలో, చెత్త కుప్పల మీద అందరూ ప్లాస్టిక్ కవర్లను, రేపర్లను పారేస్తారు. వాటిని ఏం చేయాలో ఎవరికీ ఏమీ తోచదు. అవి తొందరగా మట్టిలో కలిసిపోవు. కాని రాజిబెన్ వాటిని ఉపయోగంలోకి తెచ్చింది. వాటిని సేకరించి, కట్ చేసి పీలికలుగా మార్చి, కలిపి నేసి అందమైన వస్తువులు తయారు చేసింది. బ్యాగులు, సంచులు, పర్సులు... వాటి మన్నిక కూడా ఎక్కువ.

ఎలా చేస్తారు?

వాడేసిన ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్‌ను సేకరించి సర్ఫ్ నీళ్లతో కడుగుతారు. ఆ తర్వాత వాటిలోని మలినాలు పోవడానికి వేడి నీళ్లలో నానబెడతారు. తర్వాత రెండు రోజులు ఎండలో ఆరబెడతారు. ప్లాస్టిక్ మందంగా ఉంటే అర ఇంచ్ వెడల్పు రిబ్బన్‌లుగా; పలుచగా ఉంటే ముప్పావు ఇంచ్ రిబ్బన్‌లుగా కట్ చేస్తారు. ఈ ముక్కలను నాణ్యమైన జిగురుతో అంటించి పొడవైన ఉండగా మారుస్తారు. అంటే మగ్గం మీద నేయడానికి దారం బదులు ఈ ప్లాస్టిక్ ఉండనే ఉపయోగిస్తారు. ఈ ప్లాస్టిక్ దారాలతో నేస్తే దళసరి వస్త్రం తయారవుతుంది. దానిని కట్ చేసుకుని రకరకాల వస్తువులుగా చేతి నైపుణ్యంతో తీర్చిదిద్దుతారు. హ్యాండ్ బ్యాగ్‌లు, కూరగాయల బ్యాగ్‌లు, ఫోన్ బాక్సులు, పర్సులు.. ఇవన్నీ చాలా అందంగా ఉంటాయి. మన్నికతో ఉంటాయి.

ఎలా వచ్చింది ఐడియా?

రాజీ బెన్ నేత కుటుంబంలో పుట్టింది. అయితే తండ్రికి నేత మీద విసుగుపుట్టి వ్యవసాయం చేసేవాడు. అదీగాక ఆడపిల్లలు మగ్గం మీద కూచోవడం నిషిద్ధం. కాని రాజీ బెన్‌కి మగ్గం మీద పని చేయాలని 12 ఏళ్ల వయసు నుంచే ఉండేది. అందుకని మేనమామ కొడుకు దగ్గర





● పాలిథీన్ కవర్లు శుద్ధి చేస్తూ...

రహస్యంగా మగ్గం పని నేర్చుకుంది. 14 ఏళ్లు వచ్చేసరికి మగ్గం పనిలో ఎక్స్‌పర్ట్‌గా మారింది. అయితే ఆమెకు పుట్టింటిలో కాని మెట్టినింటిలో గాని మగ్గం మీద కూచునే అవకాశమే రాలేదు. ఏడేళ్లు కాపురం చేశాక భర్త హఠాత్తుగా మరణించడంతో రాజీ బెన్ ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టాల్సి వచ్చింది ముగ్గురు పిల్లల కోసం. కచ్‌లో ఒక ఎన్.జి.ఓ ఉంటే అక్కడ మగ్గం పని ఖాళీ ఉందని తెలిస్తే వెళ్లి చేరింది. అందమైన వస్త్రాలు అల్లి వాటిని ఆకర్షణీయమైన వస్తువులుగా తీర్చిదిద్దే స్థానిక కళలో ఆమె ప్రావీణ్యం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఎన్.జి.ఓ వారు ఆమె చేసిన ఉత్పత్తులతో ఎగ్జిబిషన్ సేల్ నిర్వహించేవారు. 2012లో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఒక విదేశీ డిజైనర్ ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసి తయారు చేసిన బ్యాగ్‌ను చూపించి 'ఇలాంటిది తయారు చేయగలవా?' అని అడిగాడు. అది ఎలా తయారయ్యిందో అర్థమయ్యాక రాజీ బెన్‌కు నాలుగు రోజులు కూడా పట్టలేదు అలాంటి బ్యాగులు తయారు చేయడానికి. ఆ డిజైనర్ వాటిని చూసి సంతృప్తిగా కొనుక్కుని వెళ్లాడు. మరికొన్ని బ్యాగులు జనం క్షణాల్లో ఎగరేసుకుపోయారు. అప్పటి నుంచి వేస్ట్ ప్లాస్టిక్ నుంచి రాజీ బెన్ హస్తకళా ఉత్పత్తులను తయారు చేస్తోంది.

స్వచ్ఛ్ సుజల్ శక్తి సమ్మాన్

రాజీ బెన్ ఖ్యాతి ఎంత దూరం వెళ్లిందంటే అమృత మహోత్సవం సందర్భంగా 'స్వచ్ఛ్ సుజల్ శక్తి సమ్మాన్' పురస్కారం ఆమెకు ప్రకటించారు. అలాగే యూరప్ దేశాల నుంచి ఆమె ఉత్పత్తులకు ఆర్డర్లు వస్తున్నాయి. 'ప్లాస్టిక్ పీడ విరగడ అవ్వాలంటే దానిని ఎన్ని విధాలుగా రీసైకిల్ చేయవచ్చో అన్ని విధాలుగా చేయాలి. రాజీ బెన్ కొత్త తరాన్ని తనతో కలుపుకుంటే ఆమె ఉత్పత్తులు చాలా దూరం వెళ్లడమే కాక పర్యావరణానికి మేలు కూడా జరుగుతుంది' అని విదేశీ ఎంట్రప్రెన్యూర్లు అంటున్నారు. రాజీ బెన్ ప్రస్తుతం 90 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. 2018 నుంచి సొంత సంస్థ పెట్టుకోవడంతో దాని టర్నోవర్ ఇప్పుడు సంవత్సరానికి 10 లక్షలు దాటిపోయింది.

ఆమె గెలుపు గాథ మరింత విస్తరించాలని కావాలని కోరుకుందాం.

● ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కుంకుమ పువ్వు సాగు చేస్తున్న ఉద్యోగిని శైలజారెడ్డి
● ఇంట్లోని ఒక గదిలో 10 డిగ్రీల ఉష్ణోగ్రత, గాలిలో తేమ 80% ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు

సాగుబడి
విశాఖ కార్తె: నవంబర్ 7 నుంచి

ఇంటిపంటగా కుంకుమ పువ్వు!

కశ్మీర్‌లోని చల్లని ప్రదేశాల్లోనే సహజంగా ఆరుబయట పొలాల్లో కుంకుమ పువ్వు పండుతుంది. అయితే, కృత్రిమ శీతల వాతావరణం సృష్టించిన గదుల్లో కూడా ఈ పంటను పండిస్తున్నారు. నీలిరంగులో ఉండే పూలకు మధ్యలో ఈ ఎర్రటి దారాల్లాంటి కేసరాలు ఉంటాయి. వాటిని సేకరించి జాగ్రత్తగా నీడన ఎండబెట్టి భద్రపరిచి వాడుకోవచ్చు లేదా విక్రయించవచ్చు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉద్యోగం చేస్తున్న కె. శైలజారెడ్డి తన ఇంట్లోనే ఒక గదిలో కుంకుమ పువ్వును ఇంటిపంటగా పండిస్తున్నారు.

అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యం కుంకుమ పువ్వు. రోగనిరోధక శక్తిని, ఆరోగ్యాన్ని అందించే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. గర్భవతులు కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగుతుంటారు. స్వీట్లు, ఖీర్, బిర్యానీ, ఫ్రూట్ సలాడ్లలో దీన్ని వాడుతుంటారు. శ్రీఅన్నమయ్య జిల్లా మదనపల్లిలో శ్రీనిధి అనే యువతి కుంకుమ పువ్వు సాగు చేస్తున్న వీడియోలు యూట్యూబ్‌లో చూసి స్ఫూర్తి పొందిన శైలజారెడ్డి తన ఇంట్లోనే కుంకుమ పువ్వు సాగు చేపట్టారు. ఇండియా మార్ట్ ద్వారా కుంకుమ పువ్వు విత్తనాలను కశ్మీర్ నుంచి తెప్పించారు. ప్రస్తుతం అక్కడ రైతులకు, విత్తనాలను సేకరించి అమ్మేవారికి మధ్య వివాదం రావడంతో ప్రభుత్వ అనుమతితోనే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని శైలజారెడ్డి తెలిపారు.

రూ. 4 లక్షల పెట్టుబడి

శైలజారెడ్డి తన మూడు బెడ్ రూమ్‌లతో కూడిన ఇంట్లోనే.. 12× 12 అడుగుల విస్తీర్ణం ఉన్న ఒక గదిలో ఇనుప ర్యాక్‌లలో ఫైబర్ టబ్‌లు, కృత్రిమ వెల్తురు సదుపాయాలను సమకూర్చి కుంకుమ పువ్వు పండిస్తున్నారు. విత్తనాలకు, ఈ ఏర్పాట్లకు రూ. 4 లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు. చల్లని వాతావరణం కుంకుమ పువ్వు సాగుకు అనువైనది. మనం గదిలో కృత్రిమ శీతల వాతావరణాన్ని కల్పించి నిశ్చింతగా సాగు చేయవచ్చని శైలజారెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గదిలో రాత్రిపూట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్షియస్ ఉండాలి. గాలిలో తేమ శాతం 80% ఉండాలి. ఇందుకోసం గదిలో చిల్లింగ్ యంత్రాన్ని, హ్యుమిడిఫయర్‌ను ఏర్పాటు చేశారు. కృత్రిమ కాంతితో కూడిన తగుమాత్రపు వేడి కోసం గదిలో 20 వరకూ గ్రోలైట్లు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ లైట్లు వెలిగిస్తే సరిపోతుంది. పూత దశలో తప్ప ఇతర కాలాల్లో గది పగటి ఉష్ణోగ్రత 16–17 డిగ్రీల వరకు ఉండొచ్చు.

ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కుంకుమ పువ్వును సాగు చేస్తున్న శైలజారెడ్డి ఇటీవలే తొలి పంట తీశారు. ఇప్పటి వరకూ 1441 పువ్వులు పూస్తే అందులో నుంచి 10 గ్రాముల కుంకుమ పువ్వు కేసరాల దిగుబడి వచ్చింది. గ్రాము రూ. ఏడు వందల చొప్పున ఆరు గ్రాములను అమ్మారు. మిగిలిన కుంకుమ పువ్వును తనతోపాటు పనిచేసే వారికి కొంచెం కొంచెం బహూకరించాలని నిర్ణయించుకున్నట్లు శైలజారెడ్డి చెప్పారు. తాను గతంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కొనుగోలు చేసిన కుంకుమపువ్వును ఇప్పుడు తాను పండించిన కుంకుమ పువ్వుతో పోల్చి పరిశీలించినప్పుడు, అది కల్తీది అని స్పష్టంగా అర్థమైందన్నారు.



● కుంకుమ పూల సాగు గదిలో శైలజారెడ్డి



● గ్రోలైట్ల వెలుగులో కుంకుమ పూల సాగు

ఇంటి పంట



● వాడకానికి సిద్ధమైన కుంకుమ పువ్వు

ఎయిరోపోనిక్స్..?

కుంకుమ పువ్వు విత్తన దుంపలను ట్రేలలో పోసిన మట్టి మిశ్రమం (మట్టి 50%, ఇసుక 40%, వర్మీ కంపోస్టు పది మట్టి%)లో నాటుకొని పెంచుకోవచ్చు. మట్టి లేకుండా ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కూడా సాగు చేయొచ్చు. అంటే.. విత్తన దుంపలను ట్రేలో పక్క పక్కనే పెడితే సరిపోతుంది. మట్టిలో గాని, నీటిలో గాని వాటిని పెట్టాల్సిన పని లేదు. గాలిలో తేమ 80%తో పాటు చల్లని వాతావరణం ఉంటుంది కాబట్టి ఆ తేమతోనే మొక్క పెరిగి, 30–45 రోజుల్లో పూత వస్తుంది. వేరే పోషణ ఏమీ అవసరం లేదు. 7 గ్రాముల కన్నా ఎక్కువ బరువు ఉన్న విత్తన దుంపలు వాడితేనే ఆ సీజన్‌లో పూలు వస్తాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఏరోపోనిక్స్ పద్ధతిలో పెంచే దుంపలను కూడా పూత కాలం పూర్తయిన తర్వాత మట్టి మిశ్రమంలో విధిగా నాటుకోవాల్సిందే. నవంబర్– డిసెంబర్‌లో మట్టి మిశ్రమంలో నాటుకోవాలని శైలజారెడ్డి వివరించారు. వారం/పది రోజులకోసారి నీటిని కొంచెం పిచికారీ చేస్తే సరిపోతుంది. నానో యూరియా లేదా ఎన్‌పికెను నెలకోసారి పిచికారీ చేస్తే చాలు. ప్రతి దుంపకు అనుబంధంగా మూడు, నాలుగు దుంపలు పుట్టుకొస్తాయి. ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు దుంపలు నిద్రావస్థలో ఉంటాయి. ఆ దశలో వాటికి ఆహారం, కాంతి, చల్లని వాతావరణం, గాలిలో 80% తేమ అవసరం లేదు. కుంకుమ పువ్వు దుంపలను జూలైలో మట్టిలో నుంచి తీసి 7 గ్రాములు అంతకన్నా ఎక్కువ బరువు ఉన్న పిల్ల దుంపలను వేరు చేసి, తిరిగి మట్టి మిశ్రమంలో నాటుకొని కుంకుమ పువ్వు సాగు చేయవచ్చు. లేదా విత్తన దుంపలను ట్రేలలో పెట్టుకొని ఏరోపోనిక్స్ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు. అప్పటి నుంచి మళ్లీ నిద్రావస్థ వరకు నిరంతరాయంగా 8 నెలలు శీతల వాతావరణం ఉండేలా చూసుకుంటూ సాగు చేయాల్సి ఉంటుందని శైలజారెడ్డి వివరించారు.

– దాళా రమేష్ బాబు, సాక్షి, బ్యూరో ఇన్‌చార్జ్, గుంటూరు

మొదటి ఏడాదే పెట్టుబడి!

ఇంట్లోనే ఒక గదిలో కుంకుమ పువ్వు సాగు చేయడానికి తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి మొదటి సంవత్సరమే పెట్టుబడి అవసరమవుతుంది. రెండో సంవత్సరం నుంచి విత్తన ఖర్చు ఉండదు. నాలుగైదు సంవత్సరాల్లో పెట్టుబడి తిరిగి రావడంతో పాటు ఆదాయం కూడా వస్తుంది. పెద్ద మొత్తంలో సాగు చేస్తే ఉపయోగం ఉంటుంది. కుంకుమ పువ్వు సాగును ఇంటిపంటగా ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. నాణ్యమైన కుంకుమ పువ్వును మనమే పండించుకోవచ్చు. ఈ అనుభవాలను ఇతరులకు పంచాలని 'శాన్వి శాఫ్రన్ ఫార్మ్స్' పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేశాను.

– కె. శైలజారెడ్డి, కుంకుమ పువ్వు సాగుదారు, తాడేపల్లి, గుంటూరు జిల్లా.
మొబైల్: 94912 33492.
(సా. 7 గం. తర్వాత ఫోన్ చేయొచ్చు)
www.youtube.com/@ShanviSaffronFarms

ఒకేసారి 3 పంటలు..!



● డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న ట్రాక్టర్

బహుళ పంటలను ఒకేసారి విత్తుకునేందుకు అన్ని విధాలుగా రైతుకు ఉపయోగకరమైన వినూత్న పరికరం (డ్రమ్‌సీడర్)ను రూపొందించిన పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన గ్రామీణ ఆవిష్కర్త దమరసింగి బాబూరావుకు భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. తొలుత ఇనుముతో తయారు చేసిన ఈ పరికరంపై పేటెంట్‌కు 2015లోనే ఆయన దరఖాస్తు చేయగా, ఇటీవలే పేటెంట్ సర్టిఫికెట్ అందింది. తదనంతరం మరింత తేలిగ్గా ఉండాలన్న లక్ష్యంతో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తక్కువ బరువుతో ఉండేలా, ఎక్కువ కాలం మన్నిక ఉండేలా బాబూరావు దీన్ని మెరుగుపరిచారు. 2 ఎం.ఎం. సైజు నుంచి 16 ఎం.ఎం. సైజు వరకు ఎంత సైజు ఉన్న ఏ పంట విత్తనాలనైనా స్వయంగా రైతే స్వల్ప మార్పులు చేసుకోవటానికి, వరుసల మధ్య దూరాన్ని కూడా అనుకూలంగా సులువుగా మార్చుకోవటానికి ఈ డ్రమ్‌సీడర్ అనువుగా ఉంది. పత్తి, పెసలు, కందులు వంటి మూడు పంటలను ఒకేసారి విత్తుకోవడానికి ఈ ఆధునిక డ్రమ్‌సీడర్ ఉపయోగపడుతుండటం విశేషం. అన్ని రకాల చిరుధాన్యాలు, నువ్వులు, వేరుశనగ, బఠాణి, గోధుమ, వరి, పెసర, మినుము, పుల్లశనగ, పెద్ద బఠాణి, పెద్ద వేరుశనగలను సైతం దీనితో విత్తుకోవచ్చు. దీనికి ఏడు సీడ్ బాక్సులు అమర్చారు.



● బాబూరావు







రైతులే మార్పులు చేసుకోవచ్చు

2.5 అడుగులు (30 అంగుళాల) ఎత్తున ఇరువైపులా చక్రాలను అమర్చటం, 6 అంగుళాల వెడల్పు గల చక్రాలను అమర్చటంతో దీన్ని ఉపయోగించటం సులువు. పెద్ద చక్రాలను ఏర్పాటు చేయటం, పంటను బట్టి విత్తనం సైజును బట్టి, వరుసల మధ్య దూరాన్ని బట్టి మార్పులు చేసుకోవడానికి చక్రాలను ఇప్పి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా రెండు స్క్రూలు ఇప్పితే చాలు అవసరమైన మార్పులు మెకానిక్ అవసరం లేకుండా రైతే స్వయంగా చేసుకోవచ్చని, అందుకే ఈ డ్రమ్‌సీడర్ తక్కువ కాలంలోనే రైతుల ఆదరణ పొందిందని బాబూరావు 'సాక్షి'తో చెప్పారు.

నాలుగు వేరియంట్లు

ఎకనామిక్ మల్టీపర్పస్ అగ్రికల్చర్ ఇంప్లిమెంట్ అని పిలుస్తున్నారు. ఇందులో నాలుగు వేరియంట్లను బాబూరావు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. పొలంలో యంత్రాలు అవసరం లేకుండా ఇద్దరు మనుషులు సులువుగా లాగుతూ విత్తనాలు వేసుకునే విధంగా, జోడెడ్లకు కట్టి లాక్కెళ్లేలా, ట్రాక్టర్‌కు వెనుక బిగించే విధంగా, 6.5 హెచ్‌పి హోండా ఇంజన్‌తో అనుసంధానం చేసి ఒక మనిషి నడిపే విధంగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో డ్రమ్‌సీడర్లను ఆయన రూపొందించారు. వేరియంట్‌ను బట్టి దాని ధర, బరువు ఆధారపడి ఉంటుంది. మనుషులు లక్కెళ్లే దాని బరువు 25 కిలోలు ఉంటుంది. ట్రాక్టర్‌కు అనుసంధానం చేసేది 80 కిలోల బరువు ఉంటుంది. 'ఆంగ్రూ' పోషణ్ ఇంక్యుబేషన్ సెంటర్ బాబూరావుకు రూ. 4 లక్షల గ్రాంటు ఇవ్వటం విశేషం. పల్లెసృజన తోడ్పాటుతో రాష్ట్రపతి భవన్‌లోని ఇన్నోవేషన్ ఫెస్టివల్‌తో పాటు అనేక మేళాల్లో బాబూరావు (94409 40025) ఈ డ్రమ్‌సీడర్‌ను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

ప్రకృతి సేద్యంపై ఎన్ఐపిహెచ్ఎం సర్టిఫికెట్ కోర్సు

రా వ స్వా ప్ర సం
NIPHM

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయం చేపట్టదలచిన/ చేపట్టిన కనీసం ఇంటర్ చదివిన యువతకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖకు అనుబంధ సంస్థ, హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) సర్టిఫికెట్ కోర్సు నిర్వహించనుంది. 'ప్రకృతి/సేంద్రియ వ్యవసాయంలో మొక్కల ఆరోగ్య యాజమాన్యం' పేరుతో వచ్చే డిసెంబర్ నుంచి 3 నెలల సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇస్తారు. కోర్సు కాలపరిమితి డిసెంబర్ 6 నుంచి 2014 మార్చి 13 వరకు. యువతీ యువకులకు శిక్షణ ఇవ్వటం ద్వారా గ్రామస్థాయిలో మాస్టర్ ట్రైనర్లను తయారు చేయటం ఈ సర్టిఫికెట్ కోర్సు లక్ష్యం. తరగతి గదిలో పాఠాలతో పాటు పొలంలో పని చేస్తూ నేర్చుకునే పద్ధతులు కూడా ఈ కోర్సులో భాగం చేశారు. ఇంటర్ పూర్తి చేసిన లేదా వ్యవసాయ పాలిటెక్నిక్ పూర్తి చేసిన 18 ఏళ్లు నిండిన గ్రామీణ యువతకు ఈ కోర్సు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇస్తారు. కోర్సు ఫీజు రూ. 7,500. ఎన్ఐపిహెచ్ఎంలో ఉండి శిక్షణ పొందే రోజుల్లో ఉచిత వసతి కల్పిస్తారు. భోజన ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుంది. కోర్సు డైరెక్టర్‌గా డా. ఓ.పి. శర్మ వ్యవహరిస్తున్నారు. ఇతర వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ డా. కె. దామోదరాచారి (95426 38020)ని సంప్రదించవచ్చు. నవంబర్ 20లోగా ఫీజు చెల్లించి, దరఖాస్తులు పంపాలి.

డిసెంబర్ 22 నుంచి ఏపీ పుష్ప ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి నాలుగో పుష్ప ప్రదర్శన, అమ్మకం కార్యక్రమాన్ని డిసెంబర్ 22 నుంచి 27 వరకు జరగనుంది. విజయవాడలోని (పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు) సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజి గ్రౌండ్‌లో జరుగుతుంది. వివరాలకు.. 93935 77018.



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 227

మంగళవారం 7-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గట్టెక్కిన బంగ్లాదేశ్

6 పరాజయాల తర్వాత మరో విజయం.. శ్రీలంకపై 3 వికెట్ల తేడాతో గెలుపు - IVలో



మార్కెట్ ముందడుగు

సెన్సెక్స్ 595 పాయింట్లు ప్లస్.. 19,400 పాయింట్ల పైకి నిఫ్టీ - 11లో



నేడు ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ

ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా 20 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది.

వివరాలు 10లో ▸



ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానం

వాయు కాలుష్యం కట్టడికి ఈనెల 13 నుంచి 20 వరకు సరి-బేసి విధానాన్ని అమలు చేయనున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది.

వివరాలు 6లో ▸



సీఐసీ చీఫ్ కమిషనర్‌గా హీరాలాల్

కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్‌గా హీరాలాల్ సమారియా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

వివరాలు 6లో ▸



నేపాల్‌లో మరోసారి భూకంపం

పశ్చిమ నేపాల్‌లోని జజర్‌కోట్ పరిసర ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 5.8 తీవ్రతతో భూకంపం సంభవించింది.

వివరాలు 6లో ▸

నిరంతరం 'ఆరోగ్య సురక్ష'

జనవరి నుంచి ప్రతినెలా మండలంలో నాలుగు శిబిరాల నిర్వహణ

ఆరు నెలల్లో ప్రతి మండలం.. ప్రతి గ్రామంలో క్యాంపులు

తద్వారా సంతృప్త స్థాయిలో ప్రజలకు వైద్యసేవలు: సీఎం జగన్

- ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ఇప్పటికే 98 శాతం శిబిరాల నిర్వహణ పూర్తయింది
- వీటిల్లో గుర్తించిన వివిధ ఆరోగ్య సమస్యల బాధితులకు చేయూతనివ్వాలి
- రిఫరల్ ఆస్పత్రులకు వెళ్లేందుకు వీలుగా వీరికి రూ.500 ప్రయాణ ఖర్చుల కింద ఇవ్వాలి
- చికిత్సానంతరం ఇంటికి వచ్చాక వారికి తోడుగా ఉంటూ ఆరోగ్య స్థితిపై వాకబు చేస్తుండాలి
- మందులు ఎంత ఖరీదైనా సరే వెనకడుగు వేయకుండా మనం అందించాలి.. ప్రివెంటివ్ కేర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కీలకం

9 లో

- డిసెంబర్ 1 నుంచి ఆరోగ్యశ్రీపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టండి
- మంచి ఫీచర్లతో ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని ఇదివరకే ఆదేశాలిచ్చాను
- అదేరోజు నుంచి ఆరోగ్యశ్రీ కార్డులూ ఇవ్వాలి
- దిశ యాప్‌లాగ ప్రతీ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ ఉండాలి
- ప్రతి జిల్లాలో స్పెషలిస్టు, ఎంబీబీఎస్ డాక్టర్లు, ఇతర సిబ్బంది కొరత లేకుండా కలెక్టర్లు చూసుకోవాలి
- జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షలో కలెక్టర్లు, వైద్యశాఖ అధికారులకు సీఎం దిశానిర్దేశం



9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

ప్రతి మండలంలో ప్రతిరోజూ ఒక సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించాలి: సీఎం వైఎస్ జగన్

5 లో

గాజువాకలో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



సామాజిక న్యాయానికి ప్రతీక

'సామాజిక న్యాయానికి ప్రతీక సీఎం వైఎస్ జగన్. ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా సుపరిపాలన అందిస్తున్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరిగి...వారు ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి. ఆ దిశగా సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని రంగాల్లోనూ అగ్రగణ్యులుగా నిలబెడుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుంది' అని గాజువాక సామాజిక సాధికార సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు.

చేతల్లో చూపిన ఏకైక ముఖ్యమంత్రి

'రాష్ట్రంలోని పేదవర్గాలను సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలు, సంస్కరణలు చేపడుతూ వారి గుండె చప్పుడయ్యారు. సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన ఏకైక సీఎం వైఎస్ జగన్. రాష్ట్రంలో ఎలాంటి సిఫార్సులు, లంచాలు లేకుండానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తున్నారు' అని మార్కాపురం సభలో మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు.

2 లో

ఈ సంక్షేమం ఆగకూడదు

'వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమం అందుతోంది. అట్టడుగు వర్గాల సామాజిక సాధికారత సాధ్యమైంది. ఈ సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరముంది. జగన్ వచ్చాకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు' అని కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు.

ఫ్యాక్ట్‌చెక్

రోడ్డున పడ్డది రామోజీ పరువే..

- మరోసారి అక్కసు వెళ్లగక్కిన రాజగురువు
- తెలంగాణకు కితాబు.. ఏపీ రహదారులపై విషం
- వాస్తవానికి తెలంగాణ పరిధిలోనే అధ్వానంగా రోడ్లు
- అయినా ఏపీలో రోడ్లు బాలేదంటూ 'ఈనాడు' కథనం
- రోడ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వేగంగా రోడ్ల నిర్మాణం

- వివరాలు 8లో

పశుబీమా పక్కాగానే..

- నిజాలకు ముసుగేసి రామోజీ క్షుద్ర రాతలు.. గతంలో 50:50% నిష్పత్తి చొప్పున అమలుచేసేవారు
- టీడీపీ హయాంలో 1.20 లక్షల పశువులకే బీమా
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తొలుత పశు నష్ట పరిహారం పథకం అమలు
- 77 వేల మంది రైతులకు రూ.176.68 కోట్ల పరిహారం
- మరింత మందికి లబ్ధిచేకూర్చేలా వైఎస్సార్ పశు బీమా పథకం

- వివరాలు 8లో

భద్రత ముఖ్యం.. తొందరెందుకు.!

- విద్యుత్ వాహనాలపై ప్రభుత్వం ఆచితూచి అడుగు
- బ్యాటరీలు తగలబడిపోకుండా భద్రత ప్రమాణాల్లో కేంద్రం సవరణలు.. భద్రతతో కూడిన బ్యాటరీల తయారీకి కంపెనీలకు సమయం అవసరం
- ఈవీల తయారీ సంస్థలతో నెడ్‌క్యాప్ ఒప్పందం.. ఉద్యోగుల సౌలభ్యం కొరకు వెబ్ పోర్టల్
- అయినా ప్రభుత్వంపై 'ఈనాడు' బురద జల్లే ప్రయత్నం

- వివరాలు 8లో

ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన బస్సు

విజయవాడ బస్టాండ్‌లో తీవ్ర ప్రమాదం



విజయవాడ బస్టాండ్‌లో ప్రయాణికుల పైకి దూసుకెళ్లిన బస్సు

- 6 నెలల బాలుడి సహా ముగ్గురి మృతి
- మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలు
- ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన సీఎం వైఎస్ జగన్
- మృతుల కుటుంబాలకు మొత్తం రూ. 15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ఆర్టీసీ ఎండీ

సాక్షి, అమరావతి/బస్టాండ్/కృష్ణలంక/సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని వెనక్కి వెళ్లాల్సిన బస్సు ఒక్కసారిగా ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఆరు నెలల చిన్నారి సహా ముగ్గురు మృత్యుఒడికి చేరుకున్నారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటన తెలిసి వెంటనే స్పందించిన సీఎం వైఎస్ జగన్.. బాధితులకు సత్వరం సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని

మిగతా 9వ పేజీలో ▶



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనాల శిథిలాల్లో తమ బంధువులను వెతుకుతున్న పాలస్తీనియన్లు

ఇజ్రాయెల్ గుప్పిట్లో ఉత్తర గాజా

- రెండు ముక్కలుగా గాజా స్ట్రిప్.. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు భారీ దాడులు
- మిగిలిన ప్రాంతాలతో తెగిపోయిన సంబంధాలు
- గాజా సిటీ దిశగా ఇజ్రాయెల్ సైన్యం అడుగులు
- 10,000 దాటిన మృతుల సంఖ్య

6 లో

ఉద్యోగులకు తీపి కబురు



దీపావళి సెలవు ఆదివారం రాగా.. దానిని సోమవారానికి మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి.

5లో

రాయలసీమ, కోస్తాలో వర్షాలు



ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమలో ఓ మోస్తరు వర్షాలు, దక్షిణ కోస్తాలో జల్లులు పడుతున్నాయి. ఈ నెల 15వ వరకు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

7లో

'ఫైబర్‌నెట్' కేసులో ఆస్తులు అటాచ్‌కు అనుమతివ్వండి



టీడీపీ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ స్కామ్ నిందితులకు చెందిన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ వేసింది.

3లో



కరువు మండలాల్లో అదనపు 'ఉపాధి'

- రాష్ట్ర ప్రభుత్వం చర్యలు.. ఒక్కో కుటుంబానికి అదనంగా మరో 50 పనిదినాల పాటు పనుల కల్పన
- 102 కరువు మండలాల్లో గరిష్టంగా 150 పని దినాలు
- గరిష్టంగా ఒక్కో కుటుంబానికి రూ.13,660 వరకు అదనపు లబ్ధి
- కనీసం 2.42 లక్షల కుటుంబాలకు మేలు

3 లో

ఇదండీ సంగతి



తుది జాబితా కోసం చూస్తున్నాడట!

ఈ సంక్షేమం ఆగకూడదు

- వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేస్తేనే సంక్షేమం కొనసాగుతుంది
- జగన్ వచ్చాకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆత్మగౌరవం
- వయో పరిమితి 60 ఏళ్లకు తగ్గించి అవ్వాతాతలకు పెన్షన్ ఇస్తున్న మనసున్న సీఎం జగన్
- అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,760 ఇస్తున్నారు
- కాకినాడ సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు


కాకినాడ సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జన సందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాతే రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమం అందుతోందని, అట్టడుగు వర్గాల సామాజిక సాధికారత సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఎన్నుకోవాలని తెలిపారు. కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కురసాల కన్న బాబు అధ్యక్షతన జరిగిన సామాజిక సాధికార సభలో ఆయన ప్రసంగించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మగౌరవంతో బతకగలుగుతున్నారని మంత్రి తెలిపారు. వయో పరిమితిని 65 నుంచి 60 సంవత్సరాలకు తగ్గించి, అవ్వాతాతలకు పెన్షన్ ఇస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,760 ఇస్తానని చెప్పి, ఇప్పటికే మూడు విడతలు అందించారని, జనవరిలో నాలుగో విడత కూడా ఇవ్వనున్నారని తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు రుణ మాఫీ చేస్తానని చంద్రబాబు రైతులను, డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మోసం చేశారన్నారు. అదే అక్కచెల్లెమ్మలకు 2019 ఏప్రిల్ వరకూ ఉన్న బకాయిలు చెల్లిస్తామన్న జగన్ దానిని అమలు చేసి చూపించారన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండదండలు అందిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తొలిసారిగా గౌరవాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. జగన్ సీఎం అయ్యాక బీసీ ఉప కులాలన్నింటినీ గుర్తించి, 57 కార్పొరేషన్లకు తొలిసారి చైర్మన్లను నియమించి, వారికి సరైన గుర్తింపు, గౌరవం కల్పించారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి ఉప ముఖ్యమంత్రి పదవులు, మంత్రి వర్గంలో, ఇతర నామినేటెడ్ పదవులన్నింటిలో పెద్ద పీట వేసిన సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. ఇన్నాళ్లు మాటలకే పరిమితమైన సామాజిక సాధికారతను సీఎం జగన్ చేతల్లో చూపించారని అన్నారు. చంద్రబాబు మంత్రివర్గంలో ఎస్సీ, మైనార్టీలకు స్థానమే కల్పించలేదన్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా చంద్రబాబుకు ఆయన కులమే కనిపిస్తుందని, సీఎం జగన్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కనిపిస్తారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు బడుగు, బలహీన వర్గాలే ప్రాధాన్యత అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. రాజ్యసభకు తొమ్మిది మందికి అవకాశం వస్తే అందులో మత్స్యకార వర్గం నుంచి తనకు, శెట్టిబలిజల నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్, యాదవ నుంచి బీద మస్తాన్‌రావు, కురుబ నుంచి ఆర్. కృష్ణయ్యలకు ప్రాతినిధ్యం కల్పించి రాజకీయంగా అగ్రస్థానంలో కూర్చోబెట్టారన్నారు. అవే పదవులను కోట్లకు అమ్ముకున్న నైజం చంద్రబాబుదని చెప్పారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు లభించిన గౌరవం 2024 తర్వాత ఆగిపోకూడదంటే సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. ఎవరైనా పార్టీ పెడితే సీఎం కావాలనుకుంటారని, కానీ పక్కవారు సీఎం కావాలని కోరుకునే నాయకులు మనకు అవసరమా అంటూ పవన్ కళ్యాణ్ తీరును ఎద్దేవా చేశారు. బలిసిన వారికి, బడుగులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో బడుగుల పక్షాన నిలిచిన జగన్‌కు మద్దతుగా నిలిచి మరోసారి సీఎంను చేయాలని కోరారు. సామాజిక సాధికారతకు అర్థం చెప్పేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎల్లోమీడియాకు ఎంత చిన్నచూపో..

బలహీనవర్గాలంటే ఎల్లో మీడియాకు చాలా చిన్న చూపు అనేందుకు ఇదో నిదర్శనం. ఎన్నో ఏళ్లుగా వివక్షకు గురైన ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ వర్గాలు సామాజిక సాధికార యాత్ర చేస్తుంటే.. అది బాగా జరగలేదని చెప్పడానికి, చూపించడానికి ఎల్లో మీడియా ఆపసోపాలు పడుతోంది. యాత్రలో భాగంగా సభలు జరుగుతుంటే అవి జరగడానికి ముందు ఖాళీ కుర్చీల ఫొటోలు తీయడం, సభ పూర్తయ్యాక జనం వెళ్లిపోయిన తర్వాత ఫొటోలు తీయడం.. వాటికి సభ వెలవెల.. విలవిల అంటూ క్యాప్షన్లు పెట్టి కథనాలు రాయడం.. ఇదంతా ఓ పథకం ప్రకారం చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే ఎల్లో మీడియాకు నిమ్న కులాలన్నా, వెనుకబడిన వర్గాలన్నా ఎంత చిన్నచూపో అర్థం చేసుకోవచ్చు. ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అంటూ కించపరిచేలా వ్యాఖ్యానించిన చంద్రబాబుకు వత్తాసు పలికే ఎల్లోమీడియా ఇలా వ్యవహరించడం కొత్తకాదు. అణగారిన వర్గాలు మునుపెన్నడూ లేని రీతిలో సాధికారత సాధించినందుకు సంబరాలు చేసుకుంటూ యాత్రలు చేస్తుంటే సమర్థించి సహకరించాల్సిన తరుణంలో ఎల్లో మీడియా తన అక్కసునంతా బయటపెట్టుకుంటోంది.. ఈ యాత్రలకు జనం నీరాజనాలు పడుతుండడం వాటికి పుండుమీద కారంలా మారింది. బలహీనవర్గాల ఉద్యమాన్ని ఎల్లోమీడియా సమర్థించకపోగా విషంగక్కుతుండడం శోచనీయమని జనం వ్యాఖ్యానిస్తున్నారు.

ఊరూరా సామాజిక సాధికారత

గాజువాక, కాకినాడ రూరల్, మార్కాపురంలలో గ్రాండ్ సక్సెస్

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం /సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు, పథకాలతో ఆవిష్కృతమైన సామాజిక సాధికారత వీధివీధిలో కనిపిస్తోంది. 53 నెలలుగా సీఎం జగన్ చేస్తున్న మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రలకు ప్రజలు బహ్మారథంపడుతున్న తీరే ఇందుకు నిదర్శనం. యాత్ర తొమ్మిదో రోజు సోమవారం విశాఖ జిల్లా గాజువాక, కాకినాడ జిల్లా కాకినాడ రూరల్, ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గాల్లో జరిగింది. మూడు నియోజకవర్గాల్లోనూ బస్సు యాత్రకు ప్రజలు అడగడుగునా ఘనస్వాగతం పలికారు. బహిరంగ సభలకు జనం పోటెత్తారు. సామాజిక న్యాయ నిర్మాత సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. మళ్లీ జగనే రావాలి జగనే కావాలి అంటూ నినదించారు. సామాజిక సాధికార యాత్ర పదో రోజు మంగళవారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస, పల్నాడు జిల్లా వినుకొండ, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో జరుగుతుంది.


విశాఖ జిల్లా గాజువాక సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



గాజువాక సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

- జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తలెత్తుకుని బతుకుతున్నారు
- సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పరు
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేశారు
- దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సుపరిపాలన అందిస్తున్నారు
- గాజువాక సామాజిక సాధికార సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

సామాజిక న్యాయానికి ప్రతీక సీఎం జగన్

సాక్షి, విశాఖపట్నం: సామాజిక న్యాయానికి ప్రతీక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. రాష్ట్రంలో ఈరోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తలెత్తుకొని గౌరవంగా బతుకుతున్నారంటే సీఎం వైఎస్ జగన్, ఆయన పథకాలే కారణమని తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా సోమవారం గాజువాక నియోజకవర్గం పాత గాజువాక కూడలిలో జరిగిన బహిరంగ సభలో మంత్రి ధర్మాన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట తప్పరని, ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడంతో పాటు, చెప్పని అభివృద్ధి కార్యక్రమాలు అనేకం చేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేయని విధంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గతంలో మనమందించే పథకాలను అవహేళన చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఇంతకన్నా ఎక్కువగా పథకాలు ఇస్తా అంటున్నాడని, ఇవి పేదలకు అందించే పథకాలని ఇప్పుడు తెలిసాయా అని ప్రశ్నించారు. చంద్రబాబు వంటి వారి మాటలు నమ్మకూడదని చెప్పారు. ఓ రోడ్డు వేస్తేనో, బిల్డింగ్ కట్టేస్తేనో అభివృద్ధి కాదని, పేద వాడి జీవన ప్రమాణాలను పెంచి, వారు ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి జరిగినట్లని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల అభివృద్ధికే అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

సీఎం జగన్ పాలనలో బడుగుల అభ్యున్నతి

రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలు నభూతో నభవిష్యతి అని చెప్పారు. ఈ వర్గాలను అన్ని రంగాల్లోనే అగ్రగణ్యులుగా నిలబెడుతున్న ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. గతంలో బీసీ, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకే సమావేశం పెట్టుకునే ధైర్యం కూడా ఉండేది కాదని, వైఎస్ జగన్ ప్రభుత్వంలో తలెత్తుకొని ధైర్యంగా సభలు పెట్టుకోగలుగుతున్నామని అన్నారు. చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు ఇవ్వకపోయినా ఆయన వద్ద ఈ వర్గాల నాయకులు ఎందుకు బానిసత్వం చేస్తున్నారో చెప్పాలన్నారు. ఎస్సీగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని అవమానించిన చంద్రబాబుపై అట్రాసిటీ కేసు పెట్టాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ముందుగా లేఖ రాసింది సీఎం జగన్ అని గుర్తించుకోవాలన్నారు. పవన్‌కళ్యాణ్ జన సైనికుల ఆత్మగౌరవాన్ని తెలంగాణలో ఓ పార్టీకి, రాష్ట్రంలో మరో పార్టీకి అమ్మేస్తున్నాడని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌ను 2024లోనూ ముఖ్యమంత్రిని చేసుకోవాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు.

ఎన్నికలకు ముందు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు నమ్మకుండా ఎలా ఉంటారని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలను భుజానికెత్తుకున్న జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్, లోకేశ్, పురందేశ్వరి రాష్ట్రానికి పట్టిన శనిగా అభివర్ణించారు. ఒకప్పుడు చంద్రబాబును ఛీకొట్టిన పురందేశ్వరి ఇప్పుడు ఆయన కళ్లల్లో ఆనందం చూడటానికి ప్రయత్నిస్తోందన్నారు. ఆమె బీజేపీ కండువా వేసుకుని టీడీపీ కార్యకర్తలా పని చేస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన 600పైగా హామీల్లో ఒకటీ నెరవేర్చలేదని, ఆయన ముస్లింల ద్రోహి అని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలోనే ముస్లిం మైనారిటీలకు సువర్ణ పాలన అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. విశాఖ మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ బీసీ మహిళకు గ్రేటర్ విశాఖ మేయర్ పదవి కట్టబెట్టారని, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మహిళలకు కూడా కీలక పదవులు ఇచ్చి ముఖ్యమంత్రి జగన్ సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారని చెప్పారు.

వైఎస్ జగన్‌ను 30 ఏళ్ల పాటు సీఎంను చేసుకుందాం

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగి రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో పడిపోయిన గాజువాక హౌస్ కమిటీ సమస్యను సీఎం జగన్ త్వరితగతిన పరిష్కరించారని చెప్పారు. సీఎం జగన్‌ను 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిని చేసుకుంటే మన భవిష్యత్ తరాల భవిత బాగుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీలు వంశీ కృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, సమన్వయకర్త కె.కె రాజు, మాజీ మంత్రి బాలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.

చేతల్లో చూపిన ఏకైక ముఖ్యమంత్రి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు గౌరవం కల్పించిన నేత వైఎస్ జగన్
- ఇప్పుడు సిఫార్సులు, లంచాలు లేకుండానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి
- నాణ్యమైన విద్య, కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారు
- చంద్రబాబు దళిత, బీసీల వ్యతిరేకి
- మార్కాపురం సామాజిక సాధికార యాత్రలో మంత్రి మేరుగు నాగార్జున


ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదవర్గాలను సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు పలు సంక్షేమ పథకాలు, సంస్కరణలు చేపడుతూ వారి గుండె చప్పుడయ్యారని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. సీఎం జగన్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విధానాలను అనుసరిస్తూ పేదల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అధ్యక్షతన మార్కాపురం పట్టణంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో మంత్రి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు సమాజంలో గౌరవం కల్పించిన నేత వైఎస్ జగన్ అని చెప్పారు. ఈ వర్గాలకు సర్పంచ్ నుంచి డిప్యూటీ సీఎం వరకూ పదవులు ఇవ్వడంతోపాటు ఆ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన దేశంలో ఏకైక సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. చంద్రబాబు దళిత, బీసీల వ్యతిరేకి అని చెప్పారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా ? హైకోర్టు జడ్జిలుగా బీసీలు వద్దంటూ మాట్లాడిన వ్యక్తి అని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకున్నారని అన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సామాజిక న్యాయాన్ని నెలకొల్పారని తెలిపారు. ఎటువంటి సిఫార్సులు, లంచాలు లేకుండానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మంచి స్కూళ్లు, నాణ్యమైన విద్య, ఆరోగ్య శ్రీలో కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జగన్‌ను గెలిపించాలని కోరారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రి పదవులు సహా అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యతనిస్తూ ఆ వర్గాలు సాధికారత సాధించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. సామాజిక న్యాయం పేరు చెప్పి ఈ వర్గాలను చంద్రబాబు మోసం చేస్తే.., వైఎస్ జగన్ వారిని గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. మార్కాపురానికి మెడికల్ కాలేజీ ఓ వరమని అన్నారు. డిసెంబరు నాటికి వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు.

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన అశేష జన వాహిని మొత్తం జగనన్న సైనికులని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా ప్రతి ఇంట్లో జగన్ ఫొటో ఉందన్నారు. పేదల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తూ, వారికి అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన, పుస్తకాలు, బూట్లు, బ్యాగులు ఇస్తున్నారన్నారు. ముస్లింలపై రాజద్రోహం కేసు పెట్టిన చంద్రబాబును ప్రజలు నమ్మరని అన్నారు.

నేడు పేద వర్గాల్లో ఇంటికో ఇంజినీర్, డాక్టర్ ఉన్నారంటే ఆ ఘనత దివంగత సీఎం వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌దేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పార్థసారథి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ తండ్రిని మించి పేదలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం లేదని, సీఎం జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమాన న్యాయం కల్పించారని తెలిపారు. సీఎం జగన్ 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఎస్సీలకు కరెంటు సౌకర్యం కల్పించారని చెప్పారు.

రూ.1700 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి

వెలిగొండ ప్రాజెక్టుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే దానిని పూర్తిచేసే బాధ్యత ఆయన కుమారుడు వైఎస్ జగన్ తీసుకున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రూ.1,700 కోట్లు మంజూరు చేశారన్నారు. పొదిలి పెద్దచెరువు, మార్కాపురానికి సాగర్ నీటి పైపులైన్ల కోసం, చెన్నకేశవస్వామి నాలుగు గోపురాలకు రూ.3 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చయ్య, లిడ్‌క్యాప్ చైర్మన్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పదో తరగతి పరీక్షలు కచ్చితంగా నిర్వహిస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను తప్పకుండా నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి స్పష్టం చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉండవంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. నూతన జాతీయ విద్యా విధానంలోనూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించాలని స్పష్టంగా ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనూ కచ్చితంగా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కులగణనతో హేతుబద్ధంగా అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో కులగణన చేపట్టి.. వచ్చే నివేదిక ఆధారంగా మరింత హేతుబద్ధంగా వారి అభివృద్ధికి దోహదపడేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయ సాయిరెడ్డి చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కా పురంలోని సామ్యూల్‌జార్జి ఫార్మసీ కళాశాలలో సోమవారం మేధావులు, వైద్యులు, టీచర్లు, లాయర్లతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మనిషికీ కనీస అవసరాలైన ఆహారం, ఇల్లు, విద్య, వైద్యం వంటివి అందిస్తూ సీఎం జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో ఏ ముఖ్యమంత్రీ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సతీష్, ఉపాధ్యాయుడు ఎస్ శ్రీనివాసులు ప్రసంగించారు.

భూముల పరిరక్షణకు మార్గదర్శకాలు రూపొందించండి

లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు (సెంట్రల్): ప్రభుత్వ భూములు, నీటి వనరులు, నీటి ప్రవాహ భూముల సంరక్షణకు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్‌కు లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 54, 57లోని వంక పోరంబోకు భూములకు 2020లో అప్పటి తహసీల్దార్ రామచంద్రరావు అప్పురాజు ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఈ ఘటనపై తహసీల్దార్‌ను సస్పెండ్ చేశారు. అయితే ఆ భూముల్లో పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుంటుండడంతో సమీపంలోని పొలాల్లోకి వంక మళ్లీ పంటకు నష్టం చేసేది. ఈ క్రమంలో అమకతాడుకు చెందిన మహేశ్వరరెడ్డి లోకాయుక్తను ఆశ్రయించడంతో లోకాయుక్త పత్తికొండ ఆర్డీవోతో విచారణ చేయించింది. వంక పోరంబోకు భూముల్లో ప్రైవేట్ వ్యక్తులు పట్టాలు పొందినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలో మరోనెల లోపు ప్రైవేట్ వ్యక్తుల పేర్లను తొలగించారో లేదో నివేదిక సమర్పించాలని కృష్ణగిరి తహసీల్దార్‌ను లోకాయుక్త ఆదేశించింది.

ఫైబర్‌నెట్‌ నిందితుల ఆస్తుల అటాచ్‌కు అనుమతివ్వండి

విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్



సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా నిందితులకు చెందిన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. ఏపీ, తెలంగాణలో ఉన్న మొత్తం ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతివ్వాలని ఆ పిటిషన్‌లో కోరింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన రూ.330 కోట్ల ఫైబర్‌నెట్ మొదటి దశ ప్రాజెక్ట్ కాంట్రాక్టును అప్పటి సీఎం చంద్రబాబు నిబంధనలకు విరుద్ధంగా తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కేటాయించారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐడీ ఏ-1గా వేమూరి హరికృష్ణ, ఏ-11గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్, ఏ-25గా చంద్రబాబును పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో టెరాసాఫ్ట్ కంపెనీతో పాటు ఈ కేసులోని నిందితులకు ఏపీ, తెలంగాణలో ఉన్న ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను రాష్ట్ర హోం శాఖ ఆమోదిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాటి అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు అనుమతి వచ్చిన తర్వాత ఆ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ చర్యలు చేపట్టనుంది.

ఫైబర్‌నెట్ కేసులో అటాచ్‌కు నిర్ణయించిన ఆస్తులు..

- నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చ.అడుగుల ఇంటి స్థలం, ఆయన డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లో ఉన్న ఓ ఫ్లాట్.
- మరో నిందితుడు టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్‌లు, యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్, ఆయన భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి.

జగన్‌ను హత్య చేయాలన్న ఉద్దేశంతోనే దాడి

- దాచిపెట్టుకునేందుకు వీలుగా ఉంటుందనే ఆ కత్తిని ఎంచుకున్నారు
- ప్రాణాంతక గాయం చేసేందుకు ఆ కత్తి సరిపోతుంది
- హైకోర్టుకు నివేదించిన జాతీయ దర్యాప్తు సంస్థ
- విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నానికి పాల్పడిన జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ ఇవ్వొద్దని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హైకోర్టుకు నివేదించింది. హత్య చేయాలన్న ఉద్దేశంతోనే నిందితుడు పదునైన కత్తితో జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేసినట్టు సాక్షులు తమ వాంగ్మూలాల్లో తెలిపారని ఎన్ఐఏ వివరించింది. హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని శ్రీనివాసరావు చాలా జాగ్రత్తగా ఎంచుకున్నాడని, దాచిపెట్టేందుకు అనువుగా ఉండేలా ఆ కత్తిని ఎంచుకున్నారని తెలిపింది. ప్రాణాంతక గాయం చేసేందుకు ఆ కత్తి సరిపోతుందని కోర్టుకు వివరించింది. ఈ కేసులో శ్రీనివాసరావు 9 సార్లు బెయిల్ పిటిషన్లు వేశారని, వాటన్నింటినీ న్యాయస్థానాలు కొట్టేశాయని తెలిపింది. జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి ప్రాథమిక ఆధారాలు ఉండటంతో న్యాయస్థానాలు అతని బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చాయంది. హత్యాయత్నం కేసులో విశాఖ ఎన్ఐఏ కోర్టు ఇప్పటికే ట్రయల్ మొదలుపెట్టిందని, కేసు కీలక దశలో ఉన్న నేపథ్యంలో శ్రీనివాసరావుకు బెయిల్ మంజూరు చేయవద్దని అభ్యర్థించింది. ఒకవేళ బెయిల్ మంజూరు చేస్తే విచారణకు ఆటంకం కలుగుతుందని తెలిపింది. అంతేకాక శ్రీనివాసరావు పారిపోతాడని, అతన్ని తిరిగి పట్టుకోవడం కష్టసాధ్యమవుతుందని తెలిపింది. అందువల్ల అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని విన్నవించింది. జగన్‌పై హత్యాయత్నం చేసిన శ్రీనివాసరావు తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశించింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎన్ఐఏ ఇన్‌స్పెక్టర్, ఈ కేసు దర్యాప్తు అధికారి బీవీ శశిరేఖ కౌంటర్ దాఖలు చేశారు. ఇదే సమయంలో శ్రీనివాసరావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తరఫు సీనియర్ న్యాయవాది త్రిదీప్ పైస్ స్పందిస్తూ, ఎన్ఐఏ కౌంటర్ తమకు అందిందని, దానిని పరిశీలించి తగిన విధంగా స్పందించేందుకు కొంత గడువు కావాలని కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

కరువు మండలాల్లో అదనపు 'ఉపాధి'

రాష్ట్ర ప్రభుత్వం చర్యలు.. ఒక్కో కుటుంబానికి అదనంగా మరో 50 పనిదినాలు



సాక్షి, అమరావతి: కరువు మండలాల్లో కూలీల కుటుంబాలకు అదనపు పనులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో కుటుంబానికి అదనంగా 50 పనిదినాల పాటు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించనుంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 103 కరువు మండలాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో పూర్తిగా నగర ప్రాంతంలో ఉండే కర్నూలు మినహాయించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మిగిలిన 102 మండలాల్లో అదనపు పనులు కల్పిస్తారు. ఈ మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు కావాలని కోరే ఒక్కో కుటుంబం ఏడాదికి గరిష్టంగా 150 పనిదినాల పాటు పనులు పొందే వీలుంటుంది. దీంతో 2.42 లక్షల కుటుంబాలకు మేలు చేకూరుతుంది. ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రూ.13,660 వరకు అదనపు లబ్ధి కలుగుతుంది. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సోమవారం కేంద్రానికి లేఖ రాశారు.

కరువు మండలాల్లో అదనపు పని దినాలు.. సాధారణంగా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి వంద పనిదినాల కల్పనకు అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో మాత్రం ఈ ఏడాది ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 150 పనిదినాల పాటు పనులు కల్పిస్తారు. 102 మండలాల పరిధిలో 5.68 లక్షల కుటుంబాలకు చెందిన దాదాపు 10 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకుంటుంటారు. 5.68 లక్షల కుటుంబాల్లో దాదాపు లక్ష కుటుంబాలు ఇప్పటికే వంద పనిదినాల గరిష్ట లక్ష్యాన్ని పూర్తి చేసుకుని ఉండడం లేదా గరిష్ట లక్ష్యానికి అతి దగ్గరగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ కుటుంబాలతోపాటు దాదాపు మరో లక్షన్నర కుటుంబాలు వచ్చే ఐదు నెలల్లో అదనపు పనులు కోరేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 102 మండలాల పరిధిలో కనీసం 2,42,282 కూలీల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

న్యాయవాదిగా మీ ప్రమాణాలేమిటి?

- ఏపీ సీఎం సీజేఐకు రాసిన లేఖను బహిర్గతం చేయడంపై పిల్ వేసిన న్యాయవాదికి సుప్రీం ప్రశ్నలు
- సీఎం అయితే లెటర్‌హెడ్ మీద అభిప్రాయాలు చెప్పకూడదా అంటూ నిలదీత

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీజేఐకు రాసిన లేఖను మీడియా ముందుకు బహిర్గతం చేయడం సరికాదంటూ పిటిషన్ దాఖలు చేసిన సునీల్ కుమార్‌ను సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు ప్రశ్నించింది. న్యాయవాదిగా మీ ప్రమాణాలేమిటని నిలదీసింది. ఎన్ని పిల్స్ వేశారో, ఎన్ని కేసులు వాదించారో, ఆదాయ వివరాలేమిటో చెప్పాలని సునీల్ కుమార్‌ను ఆదేశించింది. సునీల్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం సోమవారం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బ్రహ్మ ప్రకాశ్ వర్సెస్ యూపీ కేసు ప్రస్తావిస్తుండగా.. ఆ కేసు గురించి తమకు తెలుసునని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో పిటిషన్ ఉపసంహరణ గురించి చెప్పామని, ఏం చేశారని ప్రశ్నించింది. ఈ విషయాన్ని పిటిషనర్‌కు తెలిపామని, ఉపసంహరణకు సుముఖత చూపలేదని న్యాయవాది తెలిపారు. 'ముఖ్యమంత్రి అయితే లెటర్‌హెడ్ మీద అభిప్రాయాలు చెప్పకూడదా? దీనిపై ఏమైనా నిషేధం ఉందా' అని జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు, శాసన సభల్లో న్యాయమూర్తులపై చర్చ జరగరాదని పిటిషనర్ తరఫు న్యాయవాది అన్నారు. ఇది పార్లమెంటు కాదు కదా.. ఈ ప్రశ్న ఇక్కడెందుకు వస్తుందని ధర్మాసనం ప్రశ్నించింది. సీఎం లేఖ రాయడం వ్యతిరేకం కాదని, పబ్లిక్‌గా రివీల్ చేయడానికి వ్యతిరేకమని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. దీనివల్ల ప్రజల్లో న్యాయవ్యవస్థ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ దశలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకొని పిటిషనర్ న్యాయవాది అంటున్నారు.. అసలు అతని ప్రమాణాలేమిటి? ఎన్ని పిల్స్ వేశారు? ఎన్ని కేసులు వాదించారు? ఆదాయ వివరాలు ఏమిటో చెప్పాలని సునీల్‌కుమార్ న్యాయవాదికి సూచించారు. తదుపరి విచారణను ధర్మాసనం జనవరికి వాయిదా వేసింది.

మిల్లెట్స్ పొరలను తొలగించేందుకు మెషిన్

నరసాపురం యువకుడి నూతన ఆవిష్కరణ



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జాన్ విలియమ్ కేరీ

నరసాపురం: గతంలో మెదడులోని నరాల్లో అసంబద్ధంగా కలిగే చలనాలను గుర్తించే ఎలక్ట్రానిక్ పరికరాలను కనుగొని అంతర్జాతీయ అవార్డు పొందిన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పట్టణానికి చెందిన మేడిది జాన్ విలియమ్ కేరీ తాజాగా మరో ఘనత సాధించాడు. చిరు ధాన్యాలపై ఉండే ఏడు పొరలను తొలగించే పరికరాన్ని కనుగొని మరోసారి అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఢిల్లీలో ఫుడ్ వరల్డ్ ఇండియా సదస్సు జరిగింది. సదస్సులో జీ-20 దేశాలకు చెందిన 200 మంది పాల్గొని ఆహార ధాన్యాలకు సంబంధించి నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఇందులో స్టార్టప్ విన్నర్‌గా జాన్ విలియమ్ కేరీ నిలిచాడు. దీంతో 5వ తేదీన ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



శత్రువు లాగా ఉండకపోవడమే అత్యుత్తమ ప్రతీకారం.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 7 నవంబర్ 2023

శరణార్థులపై పాక్ పంజా

నిన్నటి వరకూ ఎత్తుకుని ముద్దాడినవారు హఠాత్తుగా విసిరికొడితే...? ఇప్పుడు పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న అఫ్గానిస్తాన్ శరణార్థులు ఇలాంటి దుఃస్థితిలోనే పడ్డారు. ఇజ్రాయెల్ గడ్డపై హమాస్ దాడుల పర్యవసానంగా దాదాపు నెలరోజుల నుంచి గాజా స్ట్రిప్‌లో మారణహోమం సాగుతోంది. నిరాయుధ పౌరులు వేలాదిమంది పిట్టల్లా నేలరాలుతున్నారు. ఈ పరిణామాలపై అరబ్బు ప్రపంచం భగ్గుమంటోంది. కానీ ఈమూల ప్రాణాలు అరచేతపట్టుకుని వచ్చిన శరణార్థులను బలవంతంగా వెనక్కి పంపించటానికి పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. వారిని నరకకూపంలోకి నెట్టడం అన్యాయమని అనేకులు నచ్చజెబుతున్నా, తీవ్ర పర్యవసానాలుంటాయని తాలిబన్‌లు బెదిరిస్తున్నా పాక్ పాలకులు లక్ష్యపెట్టడం లేదు. చట్టవిరుద్ధంగా వుంటున్న 17 లక్షలమంది శరణార్థుల్లో సోమవారం నాటికి లక్షా 70 వేలమందిని పంపించామని పాక్ ప్రకటించింది. శరణార్థుల సమస్య పూర్తిగా పాకిస్తాన్ స్వయంకృతం. నిన్నటివరకూ తన మిత్రులైన తాలిబన్‌లతో వైరం తెచ్చుకుని, పెరుగుతున్న నేరాలకూ, అధోగతిలో వున్న దేశ ఆర్థికవ్యవస్థకూ అఫ్గాన్ శరణార్థులను కారణంగా చూపి వదుల్చుకోవాలని చూడటం పాకిస్తాన్ సైన్యం కపటనీతికి అద్దం పడుతుంది. 80వ దశకంలో అఫ్గాన్‌పై సోవియెట్ యూనియన్ సైన్యం దురాక్రమణకు దిగినప్పుడు అమెరికా అండతో అఫ్గాన్‌కు అండగా నిలిచినట్టు నటించింది పాకిస్తానే. ఆ వంకన వచ్చిపడిన నిధులు అన్నివిధాలా అక్కరకొచ్చాయి. సోవియెట్ దళాలు నిష్క్రమించాక తాలిబన్‌ల ఏలుబడి మొదలైనప్పుడు వారితో చెట్టపట్టాలేసుకుని వారి అరాచకాలకు అండదండలందించింది, వారిని ఉసిగొల్పి మన దేశాన్ని చికాకుపరిచింది కూడా పాకిస్తానే. 2001లో తమ దేశంపై ఉగ్రదాడి జరిగాక అమెరికా ఆగ్రహించి అఫ్గాన్‌పై దండయాత్రకు దిగింది. తాలిబన్‌లను తొలగించి తమ అనుకూలురను ప్రతిష్ఠించింది. అనంతరకాలంలో పరిమిత ప్రాంతాల్లోనైనా అంతో ఇంతో సాధారణ పరిస్థితులుండేవి. మహిళలు చదువుకోవటానికి, వృత్తి ఉద్యోగాలు చేసుకోవటానికి వీలుండేది. మన దేశం, మరికొన్ని దేశాలు అఫ్గాన్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాయి. ఇదంతా పాకిస్తాన్‌కు కంటగింపైంది. అఫ్గాన్‌లో తమ హవా సాగటం లేదన్న దుగ్ధతో పాకిస్తాన్ అక్కడ ఏదోవిధంగా పాలకులను చికాకుపరిచేది. చివరకు అమెరికాలో ట్రంప్ హయాం వచ్చాక చడీచప్పుడూ లేకుండా తాలిబన్‌ల తరఫున ఆయనతో రాయబారాలు జరిపి, వారు పూర్తిగా మారిపోయారని నమ్మబలికింది. ఆ తర్వాతే అమెరికా మంచి తాలిబన్‌లు, చెడ్డ తాలిబన్‌లు అంటూ వర్గీకరించి అఫ్గాన్ నుంచి నిష్క్రమించేందుకు దారులు వెదుక్కొంది. ఈ క్రమం అంతటా పాకిస్తాన్ ఆడిన ప్రమాదకర క్రీడ అడుగడుగునా కనబడుతూనే వుంది. తీరా రెండేళ్లక్రితం తాలిబన్‌ల పాలన మొదలయ్యాక ఇద్దరికీ చెడింది. పాక్ సైన్యం చేతుల్లో కీలుబొమ్మలు కావటానికి తాలిబన్‌లు ససేమిరా అనటం, తమ సహజ వనరులను పాక్ పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి అంగీకరించకపోవటం సైన్యానికి ఆగ్రహం కలిగించింది. శరణార్థులను వెనక్కు పంపటంలోని ఆంతర్యం అదే.

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం పాకిస్తాన్‌లోని అఫ్గాన్ శరణార్థుల సంఖ్య 13 లక్షలు. మరో 8 లక్షల 80 వేలమంది చట్టబద్ధంగా అక్కడుంటున్నారు. వీరిలో 2021లో మళ్లీ తాలిబన్‌లు అధికారం చేజిక్కించుకున్నాక ప్రాణభయంతో వచ్చినవారు దాదాపు 6 లక్షలమంది. వీరుగాక 1980 ప్రాంతంలో సోవియెట్ దురాక్రమణ సమయంలో వచ్చిన 3 లక్షలమంది శరణార్థులున్నారు. కానీ పాక్ సైన్యం లెక్కలు వేరేలా వున్నాయి. 17 లక్షలమంది శరణార్థులు అక్రమంగా వుంటున్నారని అది చెబుతోంది. ఎవరి లెక్కలు ఏమైనా శరణార్థుల్లో అనేకులు దశాబ్దాలుగా ఉపాధి వెదుక్కొని ఇస్లామాబాద్ మొదలుకొని కరాచీ వరకూ అనేక నగరాల్లో స్థిరపడి అక్కడే తమకంటూ గూడు ఏర్పర్చుకున్నారు. ఆ సమాజంలో భాగమయ్యారు. వారి పిల్లలు చదువుకుంటున్నారు. ఉపాధి వెదుక్కున్నారు. కొందరు ఆస్తులు కూడబెట్టుకున్నారు. కానీ హఠాత్తుగా పాకిస్తాన్ సైన్యం పోలీసులు, సైన్యం విరుచుకుపడి వారి అధికారిక పత్రాలు స్వాధీనం చేసుకుని పొమ్మంటే ఏమై పోవాలి? తనకు అనుకూలంగా వున్నప్పుడు సమస్యను చక్కగా వినియోగించుకుని, తాలిబన్‌లతో తకరారు తలెత్తాక ఇన్ని లక్షలమందిని కట్టుబట్టలతో గెంటేయాలని చూడటం ఏం న్యాయం? ఇప్పుడు దేశవ్యాప్తంగావున్న అఫ్గాన్ శరణార్థులను సరిహద్దుల్లోని తోర్ఖాం ప్రాంతానికి తరలించి నరకాన్ని తలపించే గుడారాల్లో కుక్కుతోంది. కొందరిని బలూచిస్తాన్ వైపున్న చమన్‌వైపు తరలిస్తోంది. ఒకపక్క అమానవీయంగా ఇన్ని లక్షలమందిని నరక కూపంలోకి నెడుతూ స్వచ్ఛందంగా పోతున్నారని సైన్యం తప్పుడు ప్రచారం చేస్తోంది. 1950 ప్రాంతం తర్వాత దేశంనుంచి ఇంత పెద్దయెత్తున జనం తరలిపోవటం ఇదే ప్రథమమని పాకిస్తాన్ మీడియా చెబుతోంది.

ఉగ్రవాదం విషయంలో పాక్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరే దేశంలో ఆత్మాహుతి దాడులు, ఇతర నేరాలు పెరగటానికి కారణం. తాము మద్దతుగా నిలిచిన తాలిబాన్‌లే అడ్డం తిరగటంతో సైన్యానికి దిక్కుతోచటం లేదు. దానికితోడు దేశంలో పౌర ప్రభుత్వంతో పొసగటం లేదు. ఇమ్రాన్‌ను ప్రధాని పదవి నుంచి దించినా అంతా అనుకున్నట్టు జరగలేదు. త్వరలో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. దేశం దివాలా తీసింది. ఈ పరిస్థితుల్లో సకల క్లేశాలకూ శరణార్థులను బాధ్యులుగా చూపి, బలిపశువుల్ని చేయటం దుర్మార్గం. అంతర్జాతీయ చట్టాలను గౌరవించి శరణార్థుల విషయంలో కనీస మానవీయత ప్రదర్శించటం అవసరమని పాక్ సైన్యమూ, పాలకులూ గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.దశమి పూర్తి (24గంటలు), నక్షత్రం: మఖ సా.4.43 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.1.35 నుండి 3.21 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.20 నుడి 9.06 వరకు తదుపరి రా.10.27 నుండి 11.19 వరకు, అమృతఘడియలు: ప.2.05 నుండి 3.52 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సామాజిక సాధికారతకు బాట

రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించడానికి సరిగ్గా ఆరేళ్ల క్రితం తొలి అడుగు పడింది. ప్రజల కష్టాలు తెలుసుకుని... కన్నీళ్లు తుడిచి... నేనున్నా అంటూ భరోసా ఇచ్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్ప యాత్ర పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టి ఆరేళ్లు పూర్తయ్యాయి. దేశ రాజకీయాల్లోనే ఈ పాదయాత్ర ఓ సంచలనం. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలతో రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జనం విజయం అందించిన తర్వాత, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పాలనలో పెద్దపీట వేసింది. సామాజిక న్యాయమంటే నినాదం కాదు విధానమని సీఎం వైఎస్ జగన్ చాటి చెబుతున్నారు.

మళ్లీ రాజన్న రాజ్యాన్ని తేవాలన్న సంకల్పంతో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద 2017 నవంబర్ 6న వేసిన తొలి అడుగు కోట్లాది హృదయాలను స్పృశిస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 2019 జనవరి 9న ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 134 శాసనసభ నియోజక వర్గాలు, 231 మండలాలు, 2,516 గ్రామాల మీదుగా 341 రోజులపాటు 3,648 కిలోమీటర్ల మేర ప్రజా సంకల్ప పాదయాత్ర సాగింది. ఈ యాత్రలో 124 చోట్ల సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాల్లో వైఎస్ జగన్ ప్రసంగించారు. పాదయాత్ర ఆద్యంతం జననేతను నిరుపేద మహిళలు, చేయూతకు నోచుకోని వృద్ధులు, ఉపాధి లేని యువత, రైతులు, రైతు కూలీలు సహా కలుసుకోని వర్గం అంటూ లేదు. కావాలి జగన్ ... రావాలి జగన్ అంటూ నినదిస్తూ అన్ని వర్గాల ప్రజలు పూలబాట పరచి అపూర్వ స్వాగతం పలికారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు విని, వాటిని పరిష్కరించి... జీవితాల్లో వెలుగులు నింపుతానని జగన్ భరోసా ఇచ్చారు.



ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు

రెండే రెండు పేజీల మేనిఫెస్టో

పాదయాత్రలో కోట్లాది మందితో మమేకమైనప్పుడు వారు తన దృష్టికి తెచ్చిన, తాను గుర్తించిన సమస్యల పరిష్కారమే అజెండాగా కేవలం రెండే రెండు పేజీలతో 2019 ఎన్నికల మేనిఫెస్టోను జగన్ విడుదల చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో 50 శాతం ఓట్లు, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో గెలిపించడం ద్వారా వైఎస్సార్‌సీపీకి చారిత్రక విజయాన్ని ప్రజలు అందించారు. జగన్ ముఖ్యమంత్రిగా 2019 మే 30న ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే మేనిఫెస్టో అమలుకు శ్రీకారం చుట్టడం ద్వారా సామాజిక విప్లవానికి నాంది పలికారు. సామాజిక న్యాయం నినాదం కాదు అమలు చేయాల్సిన విధానామని అధికారం చేపట్టిన రోజే చాటిచెప్పారు.

సీఎం వైఎస్ జగన్ 2019 జూన్ 8న 25 మందితో ఏర్పాటుచేసిన తొలి మంత్రివర్గం ద్వారా సామాజిక న్యాయాన్ని ఎలా చేయాలో దేశానికి చాటిచెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 14 మందికి (56 శాతం) మంత్రి వర్గంలో స్థానం కల్పించారు. ఐదుగురు డిప్యూటీ సీఎంలను నియమిస్తే, అందులో నలుగురు (80 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. 2022 ఏప్రిల్ 11న పునర్వ్యవస్థీకరణ ద్వారా ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో మరో అడుగు ముందుకేసి ఆ వర్గాల వారికి ఏకంగా 17 మందికి(70 శాతం) స్థానం కల్పించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ, శాసనమండలి ఛైర్మన్‌గా తొలిసారిగా ఎస్సీ, వైస్ ఛైర్‌పర్సన్ గా తొలి సారిగా మైనార్టీ మహిళను నియమించారు. దేశ చరిత్రలో తొలిసారిగా హోం శాఖ మంత్రిగా ఎస్సీ మహిళను నియమించారు. వైఎస్సార్‌సీపీకి ఎనిమిది రాజ్యసభ స్థానాలు దక్కితే అందులో నాలుగు ఆ వర్గాలకే ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవుల్లో 68 శాతం(29 మంది) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికే అవకాశం ఇచ్చారు. స్థానిక సంస్థల్లోనూ అదే ప్రాధాన్యం ఇచ్చారు. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా రాజకీయ సాధికారతకు బాటలు వేశారు. సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన మాయవతి వంటి వారు కూడా ఈ స్థాయిలో ఆ వర్గాలకు పరిపాలనలో భాగస్వామ్యం ఇచ్చిన దాఖలాలు లేవు.

సామాజిక న్యాయాన్ని దేశానికి చాటిన నేత

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్... ఇప్పటికి 99 శాతం అమలు చేశారు. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో నవ రత్నాల్లోని సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి రూ. 2.40 లక్షల కోట్లను డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) ద్వారా జమా చేశారు. ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే చేరాయి. దీని ద్వారా ఆ వర్గాల ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కి, ఆర్థిక సాధికారత సాధించడానికి బాటలు వేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. సుమారు 30 లక్షల మందికిపైగా ఇంటి స్థలాలను ఇచ్చి, పక్కా గృహాలను నిర్మిస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా కార్పొరేట్ స్కూళ్ల స్థాయికి అభివృద్ధి చేసి... ఇంగ్లీషు మీడియం బోధనను ప్రవేశపెట్టి... అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ ఆ వర్గాలు విద్యా సాధికారత సాధించడానికి బాటలు వేశారు. ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా ఊతమిచ్చి, పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు మార్గం సుగమం చేశారు. దేశానికి స్వతంత్రం వచ్చిననాటి నుంచి ఇప్పటి దాకా రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే, అందులో గత 53 నెలల్లో భర్తీ చేసినవే 2.07 లక్షలు.

సామాజిక సాధికారత సాధించడానికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు అగ్రవర్ణ పేదల్లోనూ నానాటికీ ఆదరణ పెరుగుతోంది. రాష్ట్రంలో 2019 ఎన్నికల తర్వాత జరిగిన గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, పురపాలక, నగరపాలక వంటి స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు తిరుపతి లోక్‌సభ... బద్వేలు, ఆత్మకూరు శాసన సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు రికార్డు మెజారిటీతో విజయం సాధించడమే అందుకు నిదర్శనం. గత 53 నెలలుగా జగన్ చేసిన మేలును వివరించడానికి అక్టోబర్ 26 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రారంభించిన సామాజిక సాధికార యాత్రకు అన్ని వర్గాల పేదలు బ్రహ్మరథం పడుతూ, 2024 ఎన్నికల్లోనూ సామాజిక న్యాయ నిర్మాత జగనే కావాలి జగనే రావాలి అంటూ ఒక్కటై నినదిస్తున్నారు.

– రామగోపాల్ ఆలమూరు
'సాక్షి' స్పెషల్ కరెస్పాండెంట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సూచన



ఇన్‌హేలర్లు వాడే పేషెంట్లు, వాటిని వాడిన తర్వాత నోటిని శుభ్రం చేసుకోవడం మరిచిపోవద్దు. అది 'ఓరల్ థ్రష్' (నోట్లో వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్) రాకుండా నిరోధించగలదు.

– జోయీతా, ఫిజీషియన్

రాజకీయాలను మార్చేది...



పాకిస్తాన్ నుంచి ఎంత దారుణంగా అఫ్గాన్ శరణార్థులు బయటికి నెట్టబడుతున్నారు అన్నది... పాక్-అఫ్గాన్ సంబంధాలకు మాత్రమే నిర్ణయాత్మక క్షణం కాదు. మొత్తంగా డ్యూరాండ్ రేఖకు అటూ ఇటూ ఉన్న పష్తూన్ రాజకీయాలకు కూడా.

– తిలక్ దేవేశర్, పాక్ అంశాల రచయిత

అవునా?



జో బైడెన్ కంటే డోనాల్డ్ ట్రంప్ మరింత మానసికంగా చురుకైనవాడనీ, ప్రపంచానికి శాంతి సుస్థిరతలను తేగలడనీ అమెరికన్లు భావిస్తున్నట్టు 'న్యూయార్క్ టైమ్స్', 'సీబీఎస్ న్యూస్' నిర్వహించిన పోల్స్ సూచిస్తున్నాయి. చెప్పాలంటే... నాకైతే ఏం చెప్పాలో అర్థం కావట్లేదు.

– మెహిదీ హసన్, టీవీ షో హోస్ట్

ఇంటిని నిరసిస్తారు



ఆంగ్ల ప్రపంచంలోని విశ్వవిద్యాలయాల ప్రధాన లక్ష్యాల్లో ఒకటి ఏమిటంటే, తర్వాతి తరపు తోలుబొమ్మల్ని తీర్చిదిద్దడం. తమ సొంత సంస్కృతిని నీచంగా చూసేలా, తమ సొంత మనుషుల్ని విలువలేనివారిగా జమకట్టేలా ఈ తోలుబొమ్మలకు శిక్షణ ఇస్తారు. దీనిద్వారా భవిష్యత్ పాలకుల నుంచి జీవితకాల ప్రాపకం సంపాదిస్తారు.

– సూర్య కానేగావ్‌కర్, కాలమిస్ట్

సంపూర్ణ విజయం



భారత మహిళల హాకీ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌ను 4–0 స్కోరుతో ఓడించి ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. మనం ఆడిన ఏడింటిలో అన్ని మ్యాచులనూ మన అమ్మాయిలు గెలిచి టూర్నమెంటు మొత్తంలో తమ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. గొప్ప యుగారంభానికి సిద్ధం.

– రాహుల్ రవీంద్రన్, నటుడు


ముందే వెలుగులు



తైవాన్ నుంచి ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు. దీపావళి వేడుకలు గొప్పగా మొదలయ్యాయి. తైవాన్‌లో దీపావళి టపాకాయాలను కాలుస్తుంటే చూడటం ఉద్వేగభరితంగా అనిపించింది. (ఇండియా తైపేయి అసోసియేషన్ నవంబర్ 5న వేడుకలు జరిపింది.)

– సనా హష్మీ, ఫెలో

అవి రానట్టేనా?



ప్రపంచ ఆకలి సూచీలో ఇండియా 125 దేశాల్లో 111వ స్థానంలో ఉంది (అక్టోబర్ 13, 2023). ఇండియా ఆ ర్యాంకును తిరస్కరించింది. ఇప్పుడు ప్రధానేమో 'ఆకలితో జనాలు నిద్ర పోకూడదని' పీఎంజీకేఏవై(ప్రధాన్ మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన)ని మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) తర్వాత ఇదా పరిస్థితి?

– కపిల్ సిబాల్, రాజ్యసభ సభ్యుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

ఎన్నికల బాండ్లు

ఎన్నికల బాండ్ల విధానంలో తప్పొప్పులపై ఐదుగురు సుప్రీం న్యాయమూర్తుల బెంచ్ వాదనలు వింటోంది. ఐదేళ్ల క్రితం మొదలైన ఈ విధానం అనతి కాలంలోనే ఎన్నికల ఫండింగ్‌లో కీలకంగా మారింది. పార్టీలకు వచ్చే నిధుల్లో అరవై శాతం ఇదే మార్గాన వస్తుండడం విశేషం. అనుకున్నట్టు గానే వచ్చే నిధుల్లో 56 శాతం అధికార పార్టీకే దక్కుతున్నాయి. ఈ విధానంలో ఎవరైనా సంస్థలు, వ్యక్తులు తమ పేర్లు వెల్లడించకుండా స్టేట్ బ్యాంక్‌లో డబ్బు చెల్లించి బాండ్లు కొని వాటిని తమకు నచ్చిన పార్టీకి డొనేట్ చెయ్యొచ్చు. ఆ పార్టీ వాటిని డబ్బుగా మార్చి ఎన్నికలకైనా, ఇతర సంబంధిత అవసరాలకైనా వాడుకోవచ్చు. ఇంతకు ముందు అలా డబ్బు రూపంలో అయితే డొనేట్ చెయ్యడానికి ఆ సంస్థ లాభాల్లో 7.5 శాతం మించకుండా ఉండాలన్న నియమం ఉండేది. ఈ విధానంలో అలాంటిదేమీ లేదు. పైగా నష్టాలొచ్చినా చెయ్యొచ్చు. విదేశీ సంస్థలైనా చెయ్యొచ్చు. ఎవరు వాటిని సమకూర్చారో బయటకు చెప్పనక్కర లేదు. కాబట్టి ఈ విధానం వల్ల ప్రజాస్వామ్య పద్ధతిలో కీలకమైన ఎన్నికలు పారదర్శకత లేకుండా తయారవుతున్నాయని ఒక వాదన. ఒక రకంగా అది నిజమే.

ఒక పార్టీ ఎవరి ద్వారా నిధుల్ని పొందుతుందో తెలిస్తే ఆ పార్టీ ప్రాధాన్యతలపై ప్రజలకు అవగాహన ఉంటుంది. ఒకరికి ఒకరు సహకరించుకోవడం బహిర్గతమై కొంత అదుపు ఉంటుంది. తప్పుడు మార్గాల్లో వస్తున్న నిధులు.. అంటే కుదేలైన సంస్థలు ఇచ్చే నిధులు బయటపడి అంతరార్థాలు అర్థమవుతాయి. అభ్యర్థి నేర చరిత్ర తెలిస్తే ఎలాంటి లాభమో, పార్టీ సేకరించిన నిధుల మూలాలు తెలుసుకున్నా అలాంటి లాభమే ఉంటుంది. ఏదైనా పార్టీలు సేకరించే నిధులపై కూడా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఉన్నట్టుగానే సీలింగ్ ఉండాలి. లేదా వచ్చిన ఎన్నికల విరాళాల్ని గుర్తింపు పొందిన అన్ని పార్టీలకు సమానంగా పంచే తటస్థ వ్యవస్థ ఉండాలి. న్యాయస్థానం ఈ విషయంపై ఏమి తీర్పు చెప్పనున్నదో చూడాలి.

– డా॥ డి.వి.జి. శంకర రావు, పార్వతీపురం మాజీ ఎంపీ

యువత చొరవ చూపాలి...

అభిప్రాయం



డా॥ నూకల విజయలక్ష్మి

భారతదేశానికి గొప్ప సంపద యువత. అధిక యువశక్తి ఉన్న దేశమైనా భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉండిపోయింది. అందుకు కారణం యువతను పూర్తిగా ఉపయోగించుకోలేక పోవడమే. యువశక్తిని ఉపయోగించుకోకపోవడం వల్ల నిరుద్యోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. అంతేకాదు, అనుత్పాదక, అసాంఘిక కార్యకలాపాల్లోకి యువత జారుకుంటున్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం, టెర్రరిజం వైపు ఆకర్షితులు అవ్వడం, మొబైల్ ఫోన్, సోషల్ మీడియాకు బానిసలుగా మారడం వంటి వాటినీ చూడవచ్చు. కెరీర్‌ను నిర్మించుకొనేందుకు కావలసిన సలహా సంప్రదింపులూ, మార్గదర్శకత్వం, ఆర్థిక వెన్నుదన్నులకు సంబంధించిన సమాచారం అందించే వ్యవస్థ అందరికీ అందుబాటులో ఉంటే పరిస్థితి మరో విధంగా ఉంటుంది.

స్వయం ఉపాధికి సంబంధించిన అనేక ప్రభుత్వ పథకాల గురించిన సమాచారం యువతను చేరడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు అనే తేడా లేకుండా ఇరు రంగాలలోని అవకాశాలను యువత ఒడిసి పట్టుకోవాలి. అనేక స్వచ్ఛంద సేవాసంస్థలూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇటువంటి సంస్థల్లోని అవకాశాలనూ వినియోగించుకోవాలి. ఉదాహరణకు 'టీచ్ ఫర్ ఇండియా' అనే స్వచ్ఛంద సేవా సంస్థ పిల్లలకు బోధించడంలో ఆసక్తి ఉన్న యువతకు రెండు సంవత్సరాల ఫెలోషిప్‌ను అందిస్తోంది. కళాశాల గ్రాడ్యుయేట్లు, పని చేసే నిపుణులను... తక్కువ ఆదాయ పాఠశాలల్లో రెండు సంవత్సరాల పాటు పూర్తి సమయం ఉపాధ్యాయులుగా సేవ చేయడానికి ఇది నియ మిస్తుంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికయ్యి రెండేళ్లు పని చేసిన తర్వాత ఇంకా పై చదువులు చదువు



కోవాలనుకుంటే వారికి విదేశాలలో కానీ, మన దేశంలో కానీ మంచి పేరున్న విశ్వవిద్యాలయాలలో ప్రాధాన్యం లభిస్తుంది. ఈ అనుభవంతో యువత ఒక మంచి భవిష్యత్తును ఏర్పరచుకునే అవకాశం ఏర్పడుతుంది.

భారత ప్రభుత్వం నేటి యువతరానికి 'స్కిల్ డెవలప్మెంట్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాల'ను ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా విజ్ఞాన, ఆర్థిక, పారిశ్రామిక, సేవా రంగాలలో యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం కల్పిస్తోంది. దానిని యువత ఉపయోగించుకుంటే వారి జీవితానికి తగిన భరోసా ఏర్పడుతుంది.

జాగృతి సేవా సంస్థాన్ అనే ఎన్జీఓ 'జాగృతి యాత్ర' ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన వేలాదిమంది యువత ఈ 8,000 కిలోమీటర్ల రైలు ప్రయాణంలో 14 రోజుల పాటు పాల్గొని తమ జీవితాలను మార్చుకొన్నారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం.

'సిటిజన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్' (సీఏజీ) విద్యా, వృత్తిపరమైన ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోంది. ఈ సంస్థ ద్వారా డిజిటల్, ఆన్ గ్రౌండ్ రాజకీయ ప్రచారాన్నీ రూపొందించి, ప్రచారం చేయడానికీ యువతరాన్ని ఉపయోగించుకొంటున్నారు. ఇక్కడ పనిచేసిన అనుభవంతో గవర్నమెంట్‌కు సంబంధించిన వివిధ రకాల ప్రాజెక్టులలో పనిచేయడానికి అవకాశం లభించవచ్చు.


ఇటువంటి సంస్థలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ఇలా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్న విద్యా, ఉపాధి అవకాశాల సమాచారం అందించగలిగితే యువతకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పుడు సమాచారమే కీలకమైన అంశమనేది మరువరాదు.

వ్యాసకర్త తెలుగు అధ్యాపకురాలు
vepa.vijayalakshmi@gmail.com

అన్నీ కావాలంటే...

'విద్యార్థీ చేత్ త్యజేత్ నిద్రాం, అర్థార్థీ చేత్ త్యజేత్ సుఖమ్' అని ఒక లోకోక్తి. విద్య కావాలని కోరుకొనేవాడు నిద్రనూ, ధనం సంపాదించాలని కోరుకొనేవాడు సుఖాన్నీ వదులుకోవాలనేది దీని భావం. ఇది లోకానుభవం కూడా. విద్యార్జన మీద ఆసక్తి కలవాళ్లు రాత్రులు చాలా పొద్దు పొయ్యేదాకా చదువుతూ ఉంటారు. అలాగే ధనం సంపాదించాలని కోరుకొనేవాడు ఇతర విషయాలన్నీ పక్కనపెట్టి, అనుక్షణం ధనార్జన మీదే దృష్టి ఉంచాలి.

వీళ్ళు ఎందుకింత కష్టపడతారు, ఎందుకిలా నిద్రనూ, సుఖాలనూ త్యాగం చేస్తారు అంటే సమాధానం ఒకటే. లౌకికమైన లబ్ధిని దేన్ని పొందాలన్నా, దాని కోసం మరొక దాన్ని వదులుకోవాల్సిందే. ఇల్లూ వాకిలీ, పిల్లా పాపా కావాలనుకొంటే, ఏ బాధ్యతలూ బరువులూ బాదరబందీలూ లేని స్వేచ్ఛా జీవితం వదులుకోక తప్పదు. వస్తువేదయినా కావాలంటే, దానికోసం కష్టించి సంపాదించుకొన్న ధనం ధార పోయాలి. అతిగా తినాలనుకొంటే, ఆరోగ్యాన్ని వదులుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే, జిహ్వా చాపల్యాన్ని వదులుకోవాలి. పేరు, ప్రసిద్ధి సంపాదిస్తే, అనామకులకుండే మామూలు సౌఖ్యాలు అనుభవించేందుకు ఉండదు. అసామాన్యుడు కావాలంటే, సామాన్యతలో ఉండే ఎన్నో సదుపాయాలు కోల్పోక తప్పదు.



జ్యోతిర్మయం

మరి, అన్నీ కావాలనుకొన్నవాడు ఏం చేసేట్టు? జ్ఞానులు ఇందుకు కనుక్కొన్న మార్గం ఒక్కటే అనే వారు ఈ మధ్యనే పరమపదించిన దిగంబర జైనముని తరుణ సాగరులు. ఒకటి కావాలంటే మరొకటి వదిలేయక తప్పదు కనక అన్నీ కావాలంటే అన్నీ వదిలేయడమే! ప్రాపంచిక విషయాలలో ఆసక్తి (సంగం) ఎంతగా త్యజిస్తే, అంత సంపూర్ణమైన ఆనందం లభిస్తుంది. సంగత్యాగి అనుభవించే ఆనందం సార్వభౌముడికి కూడా ఉండదు. కనుక అసలయిన ఆనందం కోరే వాడికి సర్వసంగ త్యాగం చేయగలిగిన గురువులే ఎక్కువ ఉపయోగకరమయిన ఆదర్శం. అన్నీ ఉన్నా అనుక్షణం అసంతృప్తితో, ఆందోళనలతో కాలం దొర్లించే సమ్రాట్టులు కారు. ఫలానాది కావాలనే తీవ్ర తపన లేకుండా కర్తవ్యాలు చేసుకొంటూ జీవితం నడిపేవాడికి, ఒకటి పొందలేదన్న చింత ఉండదు, మరొకటి వదులుకోవలసి వచ్చిందన్న వంతా ఉండదు!

– ఎం. మారుతి శాస్త్రి

కృష్ణా జలాలపై 29న విచారిస్తాం

సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి తెలంగాణ 90 టీఎంసీల కృష్ణాజలాలను వినియోగించుకోవడం సరికాదంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 29న విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం తొలుత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. విచారించే పరిధి లేదని తెలిపింది. దీంతో ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం వాయిదా కోరినట్లు ఏపీ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ న్యాయవాదులు వచ్చారుగా అని ధర్మాసనం ప్రశ్నించగా.. తాము కేవియట్ దాఖలు చేశామని తెలంగాణ న్యాయవాది తెలిపారు. ఇదే అంశంపై ఇతర కేసుల గురించి ధర్మాసనం ఆరా తీయగా.. మరో కేసు ఈ నెల 29న ఉందని న్యాయవాదులు తెలిపారు. దీంతో ఈ పిటిషన్‌ను ఆ కేసుతో జత చేస్తున్నామని, 29న విచారిస్తామని ధర్మాసనం చెప్పింది.

టీడీపీ పాత్ర మేం తీసుకున్నాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పుట్టపర్తి టౌన్: ప్రతిపక్ష పాత్ర పోషించడంలో తెలుగుదేశం పార్టీ విఫలమైందని, అందువల్ల తాము ఆ బాధ్యత తీసుకున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలోని జానకి రామయ్య కళ్యాణ మండపంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు శేఖర్ అధ్యక్షతన బీజేపీ పోలింగ్ కేంద్రాలు, శక్తి కేంద్ర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం జిల్లాల పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తమ పార్టీకి జనసేన పార్టీతో పొత్తు ఉంటుందని, టీడీపీతో పొత్తు వ్యవహారం మాత్రం అధిష్టాన పెద్దలు చూసుకుంటారని చెప్పారు. కాగా, కార్యక్రమంలో సత్యసాయి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి, దళిత యువమోర్చా అధ్యక్షురాలు రమాపావని గొడవపడ్డారు. నాయకులు కలగజేసుకుని సర్దిచెప్పారు.

9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

ప్రతి మండలంలో ప్రతిరోజూ ఒక సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించాలి

ఈ ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని ప్రజలకు చెప్పాలి

- గ్రామాల వారీగా ఎంత నగదు బదిలీ చేశాం.. తద్వారా ఎంతమందికి ఏ మేరకు లబ్ధి జరిగిందన్న దానిపై ప్రతి ఒక్కరికీ వివరాలు అందించాలి
- గ్రామాల్లో ఆర్బీకే సెంటర్లు, సచివాలయాలు ఏర్పాటు..
- స్కూళ్లు, ఆస్పత్రుల్లో అప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పులను నాడు–నేడు రూపంలో వివరించాలి
- ఇలా గతానికి భిన్నంగా మెరుగుపడిన పరిస్థితుల తీరును తెలియజేయాలి
- ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా బోర్డులు పెట్టాలి
- ఏయే పథకం ద్వారా ఎంతమంది లబ్ధిపొందారో అందులో ప్రదర్శించాలి
- కలెక్టర్లతో సమీక్షలో సీఎం జగన్



సమీక్ష సమావేశంలో కలెక్టర్లకు సూచనలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభించబోతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచి గురించి ప్రజలందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి, ప్రతి గ్రామానికి ఏం మేలు జరిగిందన్నది ప్రతి ఒక్కరికీ తెలియాలి. గ్రామాల వారీగా ఎంత ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) చేశాం.. తద్వారా ఎంతమందికి ఏ మేరకు లబ్ధి జరిగింది అన్నదానిపై ప్రతి ఒక్కరికీ వివరాలు అందించాలి. అలాగే..

- గ్రామాల వారీగా ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధిపొందారో, ఎంత మంచి జరిగిందో వారికి చెప్పాలి.
- డీబీటీ ద్వారా, నాన్ డీబీటీ ద్వారా ఏయే పథకాలలో ఎంత మేలు పొందుతున్నారో వివరించాలి.
- మన ప్రభుత్వంలో ఏయే పథకాలు అమలవుతున్నాయో కూడా చెప్పాలి.
- ఒకవేళ ఎవరికైనా ఏదైనా సంక్షేమ పథకం అందకపోతే వారికి అందించేలా చర్యలు తీసుకోవాలి.
- అదే విధంగా.. గ్రామంలోని పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా వచ్చిన మార్పులు.. ఇంగ్లిష్ మీడియం, పాఠశాలల్లో ఆరో తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఎనిమిదో తరగతిలో ట్యాబుల పంపిణీ వరకూ మారుతున్న విద్యా వ్యవస్థ గురించి చెప్పాలి.
- వైద్య రంగంలో విలేజ్ క్లినిక్స్‌తో సహా గ్రామంలో వచ్చిన మార్పు గురించి తెలియజేయాలి.
- ఆర్బీకేల వంటి వ్యవస్థతో పాటు, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు.. ప్రతి ఎకరాకు ఈ–క్రాప్ చేపడుతున్న విషయం, ఏ రకంగా పారదర్శకత పాటిస్తున్నామో కూడా చెప్పాలి.
- ఇక సోషల్ ఆడిట్ ద్వారా నాణ్యంగా అందుతున్న పౌర సేవలు, దిశ యాప్, తదితర అంశాలన్నింటిపైనా ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలి.

ఆధారాలతో జరిగిన మంచిని చూపించాలి..

మరోవైపు.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు, పథకాలను అమలుచేస్తున్నాం. ఈ క్రమంలో.. ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు గురించి ప్రజలకు చెప్పాలి. ఆర్థిక ప్రగతిలో గతంలో ఎలా ఉండేవాళ్లం? ఇప్పుడెలా ఉన్నాం? అన్న అంశాలనూ వివరించాలి. డీబీటీ, నాన్ డీబీటీ, గ్రామంలో లబ్ధిదారుల గురించి పూర్తి అవగాహన కల్పించాలి. ఈ వివరాలతో కూడిన డేటాతో సహా, జరిగిన మంచిని ఆధారాలతో చూపించాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. పథకాలను ఏ రకంగా వాడుకోవాలన్న దానిపైనా వారికి అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో బోర్డులు కూడా పెట్టాలి. ఏయే పథకం ద్వారా ఎంతమంది లబ్ధిపొందారో వాటిల్లో ప్రదర్శించాలి. డీబీటీ ఎంత? నాన్ డీబీటీ ఎంతో అందులో పొందుపరచాలి. నాడు–నేడు ద్వారా చేసిన ఖర్చెంత? గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ కోసం ఎంత ఖర్చుచేశామో చెప్పాలి. అలాగే, గడపగడపకూ మన ప్రభుత్వం (జీజీఎంపీ) ద్వారా గుర్తించిన ప్రాధాన్యతా కార్యక్రమాల కోసం చేసిన ఖర్చును వివరించాలి.

ప్రతి మండలంలో రోజుకు ఒక సచివాలయంలో..

ప్రతి మండలంలో ప్రతిరోజూ ఒక సచివాలయంలో ఈ కార్యక్రమం చేపట్టాలి. పట్టణాల్లోనూ ఒక సచివాలయంలో నిర్వహించాలి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ ఈఈ, పట్టణ ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్ నోడల్ ఆఫీసర్‌గా ఉంటారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అందరూ ఇందులో పాల్గొంటారు. తొమ్మిదో తేదీ నుంచి కార్యక్రమం మొదలవుతుంది. ఆ తర్వాత తగిన సమయం తీసుకుని వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని అభిమానించే వారు ఎవరైనా జరిగిన మంచి ఏమిటన్నది ప్రతి ఇంటికీ వివరిస్తారు. గతానికి భిన్నంగా పరిస్థితులెలా మెరుగుపడ్డాయి, ఎంత మంచి జరిగిందన్న దానిని ప్రతి ఇంటికీ తీసుకెళ్తారు.

ఉద్యోగులకు తీపి కబురు

- 13న దీపావళి సెలవుగా ప్రకటించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీచేసిన సాధారణ పరిపాలన శాఖ
- శని, ఆది, సోమవారాలు సెలవు

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీపావళి సెలవు ఆదివారం రాగా.. దానిని సోమవారానికి మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారం సెలవులు కాగా.. దీపావళి పండుగ సెలవును కూడా తొలుత ఆదివారమే అని ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా దీపావళి సెలవును ఈ నెల 13వ తేదీ సోమవారం ఇవ్వాలని నిర్ణయించింది. దీపావళి పర్వదినం (తిథి ద్వయం)ను పురస్కరించుకుని 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సాధారణ సెలవుగా ప్రకటించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెండో శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు వచ్చాయి. కాగా.. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 3.64 శాతం డీఏను విడుదల చేయడంతోపాటు రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ శాఖల్లో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ జారీ చేయడం తెలిసిందే. ఉద్యోగులకు వారి బేసిక్ పేలో 22.75 శాతం నుంచి 26.39 శాతానికి పెంచిన కరువు భత్యాన్ని 2022 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొస్తూ ఉత్తర్వులిచ్చిన విషయం విదితమే. తాజాగా దీపావళి సెలవును సోమవారానికి మార్చడంతో ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి.

జాతీయస్థాయిలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖకు ఫస్ట్ అవార్డు



అవార్డ్ అందుకుంటున్న డాక్టర్ ప్రశాంత్

సాక్షి, అమరావతి: పొగాకు వినియోగం కారణంగా వచ్చే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేసేందుకు సమర్థవంతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖకు జాతీయస్థాయిలో ఫస్ట్ అవార్డు లభించింది. వరల్డ్ నో టొబాకో డే–2023 సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ దేశ వ్యాప్తంగా వరల్డ్ నో టొబాకో ఫోర్ట్ నైట్ కార్యక్రమాన్ని ఈ ఏడాది మే 31 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకూ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రమాణాలను నిర్దేశించి వాటికి అనుగుణంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే మొదటి స్థానం లభించగా, తమిళనాడు, కర్ణాటకలు తదుపరి స్థానాల్లో నిలిచాయి. ఓరల్ హెల్త్, పొగాకు నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ ఢిల్లీలో సోమవారం ఢిల్లీ వైద్య శాఖ కార్యదర్శి దీపక్ కుమార్, కేంద్ర ఆరోగ్య శాఖ అడిషనల్ డీడీజీ చరణ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పురందేశ్వరిది క్రిమినల్ మైండ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



ఒంగోలు : కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతున్న పురందేశ్వరి.. దేశ వ్యాప్తంగా కోట్ల సంఖ్యలో పేరుకుపోయిన కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా సంస్కరణలు తెచ్చే ప్రయత్నం చేయాలని, అలా కాకుండా బెయిల్ రద్దు చేయాలని కోరడం వెనుక ఆమె క్రిమినల్ మైండ్‌ను అర్థం చేసుకోవచ్చని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలులో సోమవారం ఆయన మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. కేసుల సత్వర పరిష్కారానికి సంస్కరణలు తెచ్చే బాధ్యతను ఆమె తీసుకోవాలని, అది ఆమె చేతుల్లోనే ఉందని, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ చేతుల్లోనే ఉందన్నారు. బెయిల్ రద్దు చేయమనడంలో ఎంత మాత్రం అర్థం లేదన్నారు. అలాగే రాష్ట్రం సంక్షేమంలో, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతోందని తెలిపారు. నకిలీ స్టాంపుల కుంభకోణం గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ కుంభకోణానికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని, విచారణ జరపాలని మొట్టమొదటిగా డిమాండ్ చేసింది తమ పార్టీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డేనన్నారు. కేసులో సూత్రధారులు, పాత్రధారులు పలువురు అరెస్ట్ అయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ, జనసేన పొత్తుపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ రాష్ట్రంలో నైతిక విలువల్లేని పొత్తులు నడుస్తున్నాయని.. తెలంగాణలో ఒక రకంగా, ఆంధ్రాలో మరో రకంగా రాజకీయ పొత్తులు ఎవరికీ అర్థం కాని రీతిలో ఉన్నాయన్నారు.

క్లుప్తంగా...

పంజాబ్ 'ఆప్' ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రా అరెస్టు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే, దీనిపై ఈడీ అధికారులు స్పందించలేదు. ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రా పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నకిలీ పత్రాలతో బ్యాంకుల నుంచి రూ.40 కోట్ల మేర రుణాలు తీసుకొని, తిరిగి చెల్లించకుండా మోసగించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారానికి సంబంధించి సీబీఐ గత ఏడాది మే నెలలో ఎమ్మెల్యే నివాసాల్లో సోదాలు నిర్వహించింది. బ్యాంకుల నుంచి రుణాల వ్యవహారంలో మనీ లాండరింగ్ సైతం జరిగినట్లు ఈడీ గుర్తించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఎమ్మెల్యే నివాసాల్లో సోదాలు జరిపింది. రూ.32 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రాను ఈడీ అధికారులు అరెస్టు చేసినట్లు సమాచారం.

ఉక్రెయిన్‌లో రష్యా క్షిపణి దాడి

19 మంది ఉక్రెయిన్ జవాన్లు మృతి

కీవ్: ఉక్రెయిన్‌లో సైనిక అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుండగా రష్యా సైన్యం క్షిపణిని ప్రయోగించింది. ఈ ఘటనలో 19 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించారు. ఉక్రెయిన్‌లోని జపోరిజాజియాలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. రష్యా క్షిపణి దాడిలో 19 మంది తమ జవాన్లు మరణించినట్లు ఉక్రెయిన్ సోమవారం ధ్రువీకరించింది. వీరంతా 128వ మౌంటెయిన్–అసాల్ట్ బ్రిగేడ్‌కు చెందినవారు. రష్యా క్షిపణి దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్రంగా ఖండించారు.

అమెరికాలో బాలలపైకి దుండగుడి కాల్పులు

సిన్సినాటి: అమెరికాలోని సిన్సినాటిలో ఓ సాయుధ దుండగుడు జరిపిన తుపాకీ కాల్పుల్లో 11 ఏళ్ల బాలుడు, ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు బాలలు గాయపడ్డారు. కారులో వచ్చిన దుండగుడు యథేచ్ఛగా 22 రౌండ్లు కాల్చినట్లు పోలీసు అధికారి టెర్రీ తెలిపారు. ఆ వెంటనే దుండగుడు ఘటనా స్థలి నుంచి మాయమ య్యాడన్నా రు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయిందన్నారు. బుల్లె ట్లు తగిలి 53 ఏళ్ల మహిళ, 11 ఏళ్ల బాలుడు ఘట నాస్థలిలోనే ప్రాణాలు కోల్పోగా, 12, 13, 15 ఏళ్ల ముగ్గురు బాలురు, 15 ఏళ్ల బాలిక గాయపడ్డారని తెలిపారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆమె వివరించారు.

నేపాల్‌లో మరోసారి భూకంపం

కఠ్మాండు/న్యూఢిల్లీ: నేపాల్ ప్రజలను మరోసారి భూకంపం భయపెట్టింది. శుక్రవారం భూకంపం సంభవించిన పశ్చిమ నేపాల్‌లోని జజర్‌కోట్ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 4.31 గంటల సమయంలో భూమి కంపించింది. ఆ తర్వాత 4.40 సమయంలో 4.5 తీవ్రతతో మళ్లీ ప్రకంపనలు నమోదయ్యాయి. తాజా భూకంప కేంద్రం జజర్‌కోట్ జిల్లాలోని రమిదండాలో ఉందని, దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాజధాని కఠ్మాండులోనూ భూప్రకంపనలు చోటుచేసుకు న్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. తాజా భూకంపంతో వాటిల్లిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో గత శుక్రవారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 157కు చేరుకుంది.

క్లాస్ రూంలోకొచ్చి విద్యార్థినిని కరిచిన వీధి కుక్క

పాలక్కాడ్: వీధి కుక్క ఒకటి తరగతిలోకి ప్రవేశించి ఆరో తరగతి విద్యార్థినిని కరిచి గాయపరిచింది. ఈ ఘటన కేరళలోని పాలక్కాడ్ జిల్లా మన్నార్‌క్కాడ్‌లో చోటుచేసు కుంది. ఆ విద్యార్థిని ఉదయం 10.30 గంటల సమయంలో క్లాస్ రూంలోకి ప్రవేశించింది. ఆ వెనుకే వచ్చిన కుక్క ఆమెను కరిచింది. అప్పుడే వచ్చిన టీచర్, తోటి విద్యార్థుల కేకలతో పారిపోయింది. ఊళ్లో పిచ్చి కుక్క సంచరిస్తోందనే వార్తలతో తన కుమార్తెను కారులో తీసుకువచ్చి స్వయంగా దిగబెట్టి వెళ్లానని ఆమె తండ్రి మీడియాకు చెప్పారు. తమ ఇల్లు దగ్గర్లోనే ఉందని, ఆమె రోజూ నడిచే స్కూలుకు వస్తుందని అన్నారు. సకాలంలో క్లాస్ టీచర్ రావడంతో తన కుమార్తెకు పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పారు. అదే కుక్క బారిన మరికొందరు కూడా పడ్డారన్నారు.

మాజీ డ్రైవరే హంతకుడు

బనశంకరి: బెంగళూరు నగరంలో సంచలనం సృష్టించిన గనులు, భూవిజ్ఞాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేఎస్ ప్రతిమ (40) హత్య కేసులో నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. చామరాజనగర జిల్లా మహదేశ్వరబెట్టలో దాగిన అతన్ని బెంగళూరు సుబ్రమణ్యపుర పోలీసులు గాలించి నిర్బంధించారు. ఉద్యోగం నుంచి తీసేశారనే ద్వేషంతో ఆమె మాజీ కారుడ్రైవరు కిరణ్ ఈ హత్యకు పాల్పడినట్లు నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద సోమవారం తెలిపారు. కిరణ్ (32) స్వస్థలం బెంగళూరు కోణనకుంటె. కొన్ని సంవత్సరాలుగా ప్రతిమ ఆఫీస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల కిందట ఒక యాక్సిడెంట్ చేయడంతో పాటు అక్రమ గనులపై దాడుల సమాచారం ముందుగానే గనుల యజమానులకు లీక్ చేసేవాడు. దీంతో ప్రతిమ అతడిని 10 రోజుల కిందటే ఉద్యోగం నుంచి తీసేయించారు.

ఇజ్రాయెల్ గుప్పిట్లో గాజా

రెండు ముక్కలుగా గాజా స్ట్రిప్

- అర్ధరాత్రి నుంచి ఉదయం దాకా దాడులు
- మిగిలిన ప్రాంతాలతో తెగిపోయిన ఉత్తర గాజా సంబంధాలు
- గాజా సిటీ దిశగా ఇజ్రాయెల్ సైన్యం
- 10,000 దాటిన మృతుల సంఖ్య



ఖాన్ యూనిస్‌లోని భవన శిథిలాల్లో బాధితుల కోసం అన్వేషిస్తున్న ఓ పాలస్తీనా వాసి ఉద్వేగం



గాజా స్ట్రిప్ సరిహద్దుల వెంట దూసుకెళ్తున్న ఇజ్రాయెల్ రాకెట్లు



ఖాన్ యూనిస్‌లో శిథిలాల నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు



రఫాలో శిథిలాల మధ్య చిన్నారులు

గాజా స్ట్రిప్: హమాస్ మిలిటెంట్ల భరతం పట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర గాజాను పూర్తిగా చుట్టుముట్టింది. గాజా స్ట్రిప్‌లోని ఇతర ప్రాంతాలతో ఉత్తర గాజాకు సంబంధాలు తెగిపోయాయి. ఉత్తర గాజా మొత్తం దిగ్బంధంలో చిక్కుకుంది. గాజా స్ట్రిప్‌ను రెండు ముక్కలుగా విభజించామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఉత్తర గాజా ఇప్పుడు తమగుప్పిట్లో ఉందని పేర్కొంది. యుద్ధంలో ఇది చాలా ముఖ్యమైన దశ అని, ఇకపై కీలక దాడులు చేయబోతున్నామని తెలియజేసింది. గాజా సిటీలోకి అడుగుపెట్టడానికి ఇజ్రాయెల్ సేనలు ముందుకు కదులుతున్నాయి. సైన్యం ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉత్తర గాజాపై నిప్పుల వాన కురిపించింది. వైమానిక దాడులు ఉధృతం చేసింది. 450 లక్ష్యాలను ఛేదించామని, మిలిటెంట్ల స్థావరాలను, సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సీనియర్ మిలిటెంట్ జమాల్ మూసా హతమయ్యాడని వివరించింది. హమాస్ కాంపౌండ్ ఒకటి తమ అధీనంలోకి వచ్చిందని పేర్కొంది. మిలిటెంట్లకు సమీపంలోనే ఉన్నామని, అతిత్వరలో వారిపై మూకుమ్మడి దాడి ప్రారంభిస్తామని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ వెల్లడించారు. హమాస్‌కు గాజా సిటీ ప్రధానమైన స్థావరం. మిలిటెంట్లు ఇక్కడ పటిష్టమైన సొరంగాల వ్యవస్థను నిర్మించుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆయుధ నిల్వలను సిద్ధం చేసుకున్నారు. గాజా సిటీ వీధుల్లో ఇజ్రాయెల్ సైనికులతో ముఖాముఖి తలపడేందుకు వారు సిద్ధమవుతున్నట్లు స్థానిక మీడియా తెలియజేసింది.

ఒక్క రాత్రి 200 మంది బలి!

గాజాపై ఆదివారం రాత్రి నుంచి ఉదయం వరకూ ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో దాదాపు 200 మంది మరణించారని గాజా సిటీలోని అల్–షిఫా హాస్పిటల్ డైరెక్టర్ చెప్పారు. పెద్ద సంఖ్యలో మృతదేహాలు తమ ఆసుపత్రికి చేరుకున్నాయని తెలిపారు. చాలామంది క్షతగాత్రులు చికిత్స కోసం చేరారని వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

కాల్పుల విరమణకు ససేమిరా

గాజాపై దాడులకు విరామం ఇవ్వాలని, పాలస్తీనియన్లకు మరింత మానవతా సాయం అందేలా చర్యలు తీసుకోవాలంటూ మిత్రదేశం అమెరికా చేసిన సూచనను ఇజ్రాయెల్ లెక్కచేయడం లేదు. కాల్పుల విరమణ పాటించాలంటూ జోర్డాన్, ఈజిప్టు తదితర అరబ్ దేశాలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. హమాస్ చెరలో ఉన్న 240 మంది బందీలను విడుదల చేసే వరకూ గాజాపై దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. గాజాలో సంక్షోభం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తుండడంతో అరబ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. జోర్డాన్ సైనిక రవాణా విమానం సోమవారం ఉత్తర గాజాల్లో క్షతగాత్రులకు, రోగులకు అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలను జార విడిచింది. మరోవైపు ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో ఘర్షణలు ఆగడం లేదు. ఇరాన్ అండదండలున్న హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై దాడులు సాగిస్తూనే ఉన్నారు. ఈ దాడులను ఇజ్రాయెల్ సైన్యం తిప్పికొడుతోంది. ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ దాడుల్లో దక్షిణ లెబనాన్‌లో నలుగురు పౌరులు మరణించారు.

10,022 మంది పాలస్తీనియన్లు మృతి

ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలై నెల రోజులవుతోంది. ప్రాణనష్టం నానాటికీ పెరిగిపోతోంది. గాజాలో మృతుల సంఖ్య 10 వేలు దాటింది. ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడుల్లో ఇప్పటివరకు 10,022 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. మృతుల్లో 4,100 మంది చిన్నారులు, 2,600 మంది మహిళలు ఉన్నారని తెలియజేసింది. వైమానిక దాడుల్లోనే ఎక్కువ మంది చనిపోయినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ భూభాగం వైపు హమాస్ మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్లలో 500కుపైగా రాకెట్లు గాజాలోనే కూలిపోయాయని, వాటివల్ల పెద్ద సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. డేర్ అల్–బాలహ్ పట్టణంలో సోమవారం ఉదయం ఓ ఆసుపత్రి సమీపంలోనే 66 మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు.

ముగిసిన ఆంటోనీ బ్లింకెన్ పర్యటన

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మధ్యప్రాచ్యంలో పర్యటన ముగించుకొని స్వదేశానికి పయనమయ్యారు. ఆయన సోమవారం తుర్కియే రాజధాని అంకారాలో ఆ దేశ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌తో సమావేశమయ్యారు. అమెరికాకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడారు. గాజాలో సంక్షోభాన్ని నివారించే ప్రక్రియ పురోగతిలో ఉందని చెప్పారు. గాజాపై దాడులకు విరామం ఇవ్వాలని ఇజ్రాయెల్‌కు మరోసారి సూచించారు. ఇజ్రాయెల్–హమాస్ సంఘర్షణకు తెరదించడం, బందీలను విడిపించడంతోపాటు గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేలా చర్యలు తీసుకొనే లక్ష్యంతో మధ్య ప్రాచ్యం చేరుకున్న బ్లింకెన్ పాక్షికంగానే విజయం సాధించారు.

మధ్యప్రాచ్యం చేరుకున్న అమెరికా జలాంతర్గామి

ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణ మరింత ఉధృతంగా మారుతున్న నేపథ్యంలో అమెరికా తన గైడెడ్ మిస్సైల్ జలాంతర్గామిని మధ్యప్రాచ్యానికి పంపించింది. ఓహియో క్లాస్ సబ్‌మెరైన్ తనకు కేటాయించిన ప్రాంతంలో అడుగుపెట్టిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈజిప్టు రాజధాని కైరోకు ఈశాన్య దిక్కున సూయెజ్ కెనాల్‌లో జలాంతర్గామి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. తమ గైడెడ్ మిస్సైల్ జలాంతర్గాముల ఎక్కడ మకాం వేశాయన్నది అమెరికా సైన్యం ఇలా బహిరంగంగా ప్రకటించడం అత్యంత అరుదు. తమ మిత్రదేశమైన ఇజ్రాయెల్ జోలికి ఎవరూ రావొద్దన్న హెచ్చరికలు జారీ చేయడానికే అమెరికా తన జలాంతర్గామిని మధ్యప్రాచ్యానికి తరలించినట్లు తెలుస్తోంది.

మంత్రులూ... అవేం మాటలు?

తమిళ మంత్రుల తీరుపై మద్రాస్ హైకోర్టు • 'సనాతన ధర్మ నిర్మూలన' వ్యాఖ్యలపై ఆగ్రహం

చెన్నై: అధికారంలో ఉన్నవారిలో సమాజంలో చీలిక తెచ్చే వ్యాఖ్యలు చేసే ధోరణి ప్రబలుతోందంటూ మద్రాస్ హైకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంపై చూపే ప్రతికూల ప్రభావం తాలూకు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికింది. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సెప్టెంబర్‌లో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడం తెలిసిందే. 'సనాతన ధర్మ నిర్మూలన' పేరిట జరిగిన ఆ సభలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు అందులో పాల్గొన్న అధికార డీఎంకేకు చెందిన పలువురు ఇతర మంత్రులు కూడా మద్దతు పలికారు. ఈ ధోరణిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి ప్రతికూల వ్యాఖ్యలకు దిగే బదులు డ్రగ్స్, అవినీతి, అంటరానితనం తదితర పెడ ధోరణుల నిర్మూలనపై దృష్టి పెడితే మంచిదని వారికి సూచించింది. సదరు మంత్రులపై ఇంకా చర్యలెందుకు తీసుకోలేదంటూ పోలీసులకు తలంటింది. మంత్రుల వ్యాఖ్యలకు పోటీగా ద్రవిడ సిద్ధాంత నిర్మూలన సదస్సుకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్రన్ కొట్టేశారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''సనాతన ధర్మ నిర్మూలన సభను ఉదాహరిస్తూ, అందుకు పోటీగా సభ పెట్టుకునేందుకు పిటిషనర్ అనుమతి కోరుతున్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మంత్రులు తదితరులపై అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితే వచ్చేది కాదు కదా! పిటిషనర్ విజ్ఞప్తికి అంగీకరించడమంటే సమాజంలో మరింత చీలిక తేవడమే కాదా?'' అని ప్రశ్నించారు. మంత్రుల తీరుపైనా ఈ సందర్భంగా న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడతామంటూ చేసిన ప్రమాణాలకు విరుద్ధంగా అధికారంలో ఉన్న కొందరు ప్రవర్తిస్తున్న తీరుతో ప్రజలు ఇప్పటికే విసిగిపోయి ఉన్నారు. ఇలాంటి సమావేశాలకు అనుమతినిచ్చి వారికి శాంతిని మరింత కరువు చేయమంటారా?'' అన్నారు.

నా వ్యాఖ్యలకు కట్టుబడ్డా: ఉదయనిధి

చెన్నై: సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్టు తమిళనాడు యువజన సంక్షేమ మంత్రి, సీఎం స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ పునరుద్ఘాటించారు. ఈ అంశంపై న్యాయ వివాదం తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధమన్నారు. 'సనాతన ధర్మం కరోనా, మలేరియా, డెంగీ వంటిది. అది సామాజిక న్యాయానికి వ్యతిరేకం. దాన్ని నిర్మూలించాలి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్త దుమారానికి దారితీయడం తెలిసిందే. అణగారిన, పీడిత వర్గాల తరఫున తనలా మాట్లాడానని ఆయన సోమవారం చెప్పుకొచ్చారు. అంబేడ్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ వంటి గొప్ప నేతలు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు.



సోమవారం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో ఆదిగురు శంకరాచార్య 'సమాధి స్థల్'ను దర్శించుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

న్యూఢిల్లీ: ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందనున్నారు. సీజేఐ జస్టిస్ డీ వై చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్రానికి ఈ మేరకు సిఫార్సు చేసింది. ఈ జాబితాలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా ఉన్నారు. ప్రతిభ, సామర్థ్యం, నిజాయితీ, విశ్వసనీయత, నేపథ్యం తదితరాలను జాగ్రత్తగా మదింపు చేసిన అనంతరం సుప్రీం న్యాయమూర్తులుగా వారి పేర్లను సిఫార్సు చేసినట్లు కొలీజియం తెలిపింది. వారి నియామకాలకు కేంద్రం ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు పెరుగుతుంది. న్యాయమూర్తులపై పెరుగుతున్న విపరీతమైన పనిభారం దృష్ట్యా సుప్రీంకోర్టులో ఎప్పుడూ ఒక్క ఖాళీ కూడా ఉండకుండా చూడాల్సిన అవసరం ఉందని కొలీజియం అభిప్రాయపడింది.

ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానం

న్యూఢిల్లీ: ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టులా మారిన కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో మళ్లీ సరి–బేసి విధానాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకూ సరి–బేసి విధానం అమలు చేయనున్నట్లు ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం ప్రకటించారు. నవంబర్ 20 తర్వాత ఈ విధానాన్ని పొడిగించే అంశంపై అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వాయు నాణ్యత తగ్గిపోవడం, కాలుష్యం వల్ల చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే 8వ తరగతి వరకూ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే పది, పన్నెండో తరగతి విద్యార్థులకు మినహాయింపు ఉంటుందన్నారు.

గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- బిల్లులకు ఆమోదం తెలపడంలో జాప్యం వద్దు
- సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన



న్యూఢిల్లీ: రాష్ట్రాల గవర్నర్లు ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులు కాదని, వారు ఆ విషయాన్ని మర్చిపోవద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదం పొందిన బిల్లులకు ఉద్దేశపూర్వకంగా అంగీకారం తెలపకపోవడం, విపరీతమైన జాప్యం చేయడం తగదని సూచించింది. గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ బిల్లులకు అంగీకారం తెలియకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆక్షేపిస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్రాల అసెంబ్లీల్లో ఆమోదించిన బిల్లులు అంశంపై సుప్రీంకోర్టు వరకు రాకముందే గవర్నర్లు ఆయా బిల్లులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. గవర్నర్లు అలా వ్యవహరిస్తే పెండింగ్ బిల్లుల వ్యవహారం పరిష్కారం అవుతుందని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టుకు చేరేదాకా వేచి చూడొద్దని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టుకు చేరినప్పుడు మాత్రమే బిల్లులపై చర్యలు తీసుకొనే ధోరణికి ముగింపు పలకాలని వెల్లడించింది. పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ఎన్ని బిల్లులపై చర్యలు తీసుకున్నారో తమకు వివరాలు అందజేయాలని, ఈ నెల 10వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. అప్పటిదాకా తదుపరి విచారణను వాయిదా వేసింది. పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి, గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే అంగీకారం తెలపడం లేదని ప్రభుత్వం ఆరోపిస్తోంది.

2024 అధ్యక్ష ఎన్నికల బరిలో పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్(71) 2030 వరకు పదవిలో కొనసాగేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆమేరకు వచ్చే ఏడాది మార్చిలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి బరిలోకి దిగాలనుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఎన్నడూలేని విధంగా అత్యంత ప్రమాదకరమైన కాలంలో రష్యాను నడిపించాలని ఆయన భావిస్తున్నట్లు అక్కడి మీడియా అంటోంది. దీనిపై తుది నిర్ణయమైపోయిందని, ఇందుకు తగ్గట్లుగా పుతిన్ మద్దతుదారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా సమాచారం. త్వరలోనే దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. ఎన్నికల్లో ఆయనను ఢీకొట్టే ప్రత్యర్థులెవరూ లేరని పరిశీలకులు అంటున్నారు.

సీఐసీ చీఫ్ కమిషనర్‌గా హీరాలాల్ సమారియా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్) ప్రధాన కమిషనర్‌గా హీరాలాల్ సమారియా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్ము సమక్షంలో హీరాలాల్ ప్రమాణ స్వీకారం చేశారు. వైకే సిన్హా పదవీ కాలం అక్టోబర్ 3న ముగియడంతో.. సమాచార కమిషన్ నియామకాలను చేపట్టాలంటూ కేంద్రానికి ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాజస్తాన్‌కు చెందిన హీరాలాల్ సమారియాను సీఐసీ చీఫ్ కమిషనర్‌గా రెండేళ్ల కాలానికి గాను కేంద్రం నియమించింది. ఈ పదవిని దళిత వర్గానికి చెందిన అధికారి చేపట్టడం ఇదే మొదటిసారి. 1985వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హీరాలాల్ సమారియా గతంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పలు విభాగాల్లో కూడా ఆయన సేవలందించారు.

భార్యను 17సార్లు కత్తితో పొడిచి, కారుతో తొక్కించి..

కేరళ వాసికి జీవిత ఖైదు విధించిన అమెరికా కోర్టు

వాషింగ్టన్: భార్యను దారుణంగా చంపిన కేరళ వాసికి అమెరికా కోర్టు జీవిత ఖైదు విధించింది. కేరళకు చెందిన ఫిలిప్ మాథ్యూ, మెరిన్ జోయ్(26) అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్నారు. జోయ్ ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. విభేదాల కారణంగా భార్య తనను దూరం పెట్టేందుకు ప్రయత్నిస్తోందని మాథ్యూ అక్కసుతో ఉన్నాడు. 2020లో ఆమె కారును అడ్డగించి, కత్తితో 17సార్లు పొడిచాడు. ఆపై కారుతో ఆమెను తొక్కుకుంటూ తన ఆఫీసుకు వెళ్లిపోయాడు. అక్కడ తన స్నేహితులతో భార్యను కారుతో తొక్కుకుంటూ వచ్చిన విషయాన్ని తెలిపాడు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన మెరిన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. భర్త అమానుషత్వంపై అధికారులకు వాంగ్మూలమిచ్చింది. చికిత్స పొందుతూ ఆమె ఆస్పత్రిలోనే చనిపోయింది. దీంతో, పోలీసులు మాథ్యూను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా...

అప్పన్నను దర్శించుకున్న బీహార్ గవర్నర్



శిఖర దర్శనం చేసుకుంటున్న బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్

సింహాచలం (పెందుర్తి): శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో గవర్నర్ పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం చేశారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను గవర్నర్‌కు అందజేశారు.

పోర్టులో స్వతంత్ర పర్యవేక్షణ బృందం



పాఠక్, సుబేదార్‌లకు ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర స్వతంత్ర పర్యవేక్షణ బృందం (ఇండిపెండెంట్ ఎక్స్‌టర్నల్ మోనిటర్స్) బృందం విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని సోమవారం సందర్శించింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐఈఎంలు దేవేంద్రకుమార్ పాఠక్, వైస్ అడ్మిరల్ అశోక్ వి.సుబేదార్ పోర్టును పర్యవేక్షించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు ఐఈఎం బృంద సభ్యులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో పీపీపీ పద్ధతిలో చేపడుతున్న ప్రాజెక్టుల గురించి బృంద సభ్యులు ఆరా తీశారు. పోర్టు అభివృద్ధి, ఆధునీకీకరణ కోసం చేపడుతున్న ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పేలిన టపాసులు

- తప్పిన ప్రమాదం

తుని: విశాఖపట్నం నుంచి కడప వెళుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో స్వల్పంగా టపాసులు పేలాయి. ఆర్పీఎఫ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై టపాసులను బయటపడేయడంతో ప్రమాదం తప్పింది. విశాఖపట్నంలో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్ 4గంటలకు తుని రైల్వే స్టేషన్‌కు చేరింది. ఇక్కడి నుంచి బయలుదేరుతుండగా, ఎస్–3 బోగీలోని టాయిలెట్ వద్ద గుర్తుతెలియని ప్రయాణికుడు చిన్న సంచిలో ఉంచిన టపాసులు ఒక్కసారిగా పేలాయి. పక్కనే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ టపాసుల సంచిని కాలితో బయటకు తన్నేయడంతో ప్రమాదం తప్పింది. ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో రైలు తుని నుంచి బయలుదేరి వెళ్లింది. రైలు పట్టాలపై పడిన టపాసులను పోలీసులు సేకరించారు. ఒక్కసారిగా టపాసులు పేలడంతో ఆ బోగీలో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రైళ్లలో టపాసులు తరలించడంపై నిషేధం ఉన్నప్పటికీ గుర్తుతెలియని ప్రయాణికుడు వీటిని తీసుకువెళుతున్నట్లు రైల్వే పోలీసులు చెప్పారు.

దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు

- రాష్ట్రంలో ఆవర్తనం ప్రభావం
- ఈ నెల 15 వరకు ఉండే అవకాశం



సాక్షి, అమరావతి: ఆవర్తనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడుతుండగా దక్షిణ కోస్తా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడుతున్నాయి. లక్షద్వీప్ నుంచి బంగాళాఖాతం మీదుగా ఏపీ వరకు విస్తరించి ఉన్న ఒక ఆవర్తనం, తమిళనాడులో కొనసాగుతున్న మరో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. అరేబియా సముద్రంలో ఒకటి, రెండురోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో దాని ప్రభావం కూడా రాష్ట్రంపై ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల భారీవర్షాలు కురిశాయి. తూర్పుగోదావరి నుంచి సముద్రతీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు పలుప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. ఈ నెల 15 వరకు ఇలాగే వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. రాయలసీమలో ఈ నెల 22 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోను ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతుందని తెలిపింది. మంగళవారం ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల్లో భారీవర్షాలు పడతాయని పేర్కొంది.

10న నదుల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: నదుల అనుసంధానంపై కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ అధ్యక్షతన కేంద్రం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఈ నెల 10న సమావేశమవుతోంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ సమావేశంలో గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానంపై ప్రధానంగా చర్చించనుంది. ఈ అనుసంధానానికి ఆ నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లోని రాష్ట్రాల నుంచి ఏకాభిప్రాయం తేవడమే అజెండాగా ఈ సమావేశాన్ని నిర్వహించనుంది.

పారిశ్రామిక పార్కుల ఆధునీకీకరణకు శ్రీకారం

రూ. 586 కోట్లతో 43 పారిశ్రామిక పార్కుల్లో మౌలికవసతుల కల్పన

- ఇప్పటికే 15 పార్కుల ఆధునీకీకరణకు ఆమోదం
- ఎన్‌పీఏసీ వద్ద ఆమోదం కోసం ఏడు, డీపీఆర్ దశలో మరో 21 ప్రాజెక్టులు
- ఇప్పటికే రూ. 116 కోట్లతో మరో 14 ప్రాజెక్టుల ఆధునీకీకరణ పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల ఆధునీకీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని మౌలిక వసతులు ఒకే చోట లభించే విధంగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఏపీఐఐసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే రూ. 116 కోట్లతో 14 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి చేపట్టిన ఏపీఐఐసీ తాజాగా మరో 43 పారిశ్రామిక పార్కుల ఆధునీకీకరించడానికి రంగం సిద్ధం చేసింది. ఇందులో 32 పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులను పెంచనుండగా, 11 చోట్ల ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం సుమారు రూ. 586 కోట్లు వ్యయం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్లో ఇప్పటికే 15 ప్రాజెక్టులకు నేషనల్ ప్రాజెక్ట్ అప్రూవల్ కమిటీ (ఎన్‌పీఏసీ) ఆమోదం తెలిపిందని, మరో ఏడు ప్రతిపాదనలను పరిశీలన దశలో ఉన్నట్లు ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు. మరో 21 ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నామని త్వరలో వాటిని కూడా ఆమోదం కోసం ఎన్‌పీఏసీకి పంపనున్నట్లు తెలిపారు. మొత్తం రూ. 586 కోట్లలో కేంద్రం వాటా కింద రూ. 356 కోట్లు సమకూర్చనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 230 కోట్లు వ్యయం చేయనుంది. ఎన్‌పీఏసీ ఆమోదం తెలిపిన వాటిలో కాకినాడ జిల్లా పెద్దాపురం, తిరుపతి జిల్లా రేణిగుంట, కర్నూలు జిల్లా ఓర్వకల్లు, తిరుపతి జిల్లా గాజులమండ్యం, విశాఖ జిల్లా పెదగంట్యాడ, చిత్తూరు జిల్లా నాగమంగళం, వైఎస్సార్ జిల్లా గోపవరం, చిత్తూరు జిల్లా వెంకటాపురం, కర్నూలు జిల్లా బ్రాహ్మణపల్లె, ప్రకాశం జిల్లా చందలూరు, నంద్యాల జిల్లా జగదర్తి టెక్స్‌టైల్ పార్కు, తిరుపతి జిల్లా పగలి బ్లాక్–2, కృష్ణా జిల్లా వీరపనేనిగూడెం ఫేజ్–3, తూర్పుగోదావరి జిల్లా కాలవచర్ల, విశాఖ జిల్లా గాజువాక పారిశ్రామిక పార్కులు ఉన్నాయి. వీటికి సంబంధించిన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఏపీఐఐసీ అధికారులు వెల్లడించారు.



వేగంగా అభివృద్ధి పనులు

ఇప్పటికే రూ.116 కోట్లతో చేపట్టిన 14 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇప్పటికే రూ. 62 కోట్లతో 8 పారిశ్రామిక పార్కులు కొప్పర్తి, గండరాజుపల్లి, నెల్లూరు ఆటోనగర్, గాజువాక ఆటోనగర్, విజయవాడ ఆటోనగర్, ఆమదాలవలస, పెద్దాపురం, సింగరాయకొండల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ. 22 కోట్లతో అభివృద్ధి చేసిన మూడు ప్రాజెక్టులు హిందూపూర్ గ్రోత్ సెంటర్, మచిలీపట్నం జ్యూవెల్‌పార్కు, గుంటూరు ఆటోనగర్‌ల పనులు పూర్తయ్యి ఆరంభానికి సిద్ధంగా ఉన్నాయి. రూ. 31.44 కోట్లతో చేపట్టిన నెల్లిమర్ల పారిశ్రామిక పార్కు, తణుకు, అచ్యుతాపురం నాన్ సెజ్ ఏరియాలో ఎఫ్ఎఫ్‌సీలకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ మూడింటి పనులు ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

అవినీతి అనకొండ బాబు కోసం ఆరాటమేలా?

1,135వ రోజు దీక్షలో విపక్షాలపై బహుజన నేతల ధ్వజం



తాడికొండ: ఏపీలో విపక్ష పార్టీలు ప్రజా ప్రయోజనాలను గాలికొదిలి అవినీతి అనకొండ చంద్రబాబును రక్షించేందుకు ఆరాటపడడం విడ్డూరమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,135వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి.. పక్కా ఇళ్లను నిర్మిస్తుంటే సంతోషించాల్సింది పోయి బాబు ఇచ్చే ప్యాకేజీలు తీసుకుని కుక్కల్లా మొరుగుతున్న వీరందరికీ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. జెండాలు వేరైనా తమ అజెండా అవినీతికి కొమ్ముకాయడమే అనే రీతిలో పావలాక ళ్యాణ్, వామపక్ష పార్టీలు, మరిదిని రక్షించాలనే తాపత్రయంలో ఉన్న ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి బహుజనుల హక్కుల కోసం నోరెందుకు మెదపడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు బహుజనులకు చేసిన మేలు ఒక్కటైనా ఉందేమో చెప్పాలన్నారు. కుల రాజకీయాలు నడిపినందునే బాబును చిత్తుచిత్తుగా ఓడించామని చెప్పారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబు అనారోగ్య సమస్యల పేరుతో న్యాయస్థానాలను సైతం తప్పుదారి పట్టించి బయటకు రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కోర్టు నిబంధనలు ఉల్లంఘిస్తూ రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్న బాబు, సాక్ష్యాధారాలను సైతం మాయం చేసి.. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, కొలకలూరి లోకేష్, నూతక్కి జోషి పాల్గొన్నారు.

రైలు ప్రమాదంపై విచారణ పూర్తి

- వారం రోజులపాటు సాగిన విచారణ
- 150 మందిని విచారించిన దర్యాప్తు బృందం
- 15 రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశాలు



ఆలమండ సమీపంలో జరిగిన రైలు ప్రమాదం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లా కంటకాపల్లి–ఆలమండ లైన్‌లో జరిగిన రైలు ప్రమాదంపై సౌత్ సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ ఆధ్వర్యంలో చేపట్టిన విచారణ పూర్తయ్యింది. మరో 15 రోజుల అనంతరం అసలు దోషులెవరన్నది వెల్లడయ్యే అవకాశాలున్నాయి. అక్టోబర్ 29న రాత్రి 7 గంటలకు జరిగిన ప్రమాదంలో విశాఖ–పలాస ప్యాసింజర్‌లోని 12, 13, 14 నంబర్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. విశాఖ–రాయగడ పాసింజర్‌లో 1, 2 కోచ్‌లతో పాటు లోకోమోటివ్ ధ్వంసమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారి విశ్వజిత్ సాహూ రాయగడ పాసింజర్ లోకో పైలట్ వల్లే ప్రమాదం జరిగిందనీ.. రెడ్ సిగ్నల్ పట్టించుకోకుండా ముందుకు రావడం వల్లే పలాస పాసింజర్‌ను ఢీకొందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చెబుతున్నారు. అయితే.. జ్యుడీషియల్ అధికారాలు గల దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ ప్రంజీవ్ సక్సేనా నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు చేసింది. వాల్తేరు రైల్వే డివిజన్ కార్యాలయం నుంచే విచారణ చేపట్టారు.

150 మందిని విచారించిన దర్యాప్తు బృందం

వారం రోజుల పాటు టెక్నికల్ బృందం, స్టాఫ్, లోకో పైలట్స్, గార్డులు, గ్యాంగ్‌మెన్లు, క్షతగాత్రులు, ప్రత్యక్ష సాక్షులు.. ఇలా సుమారు 150 మందిని విచారించారు. ప్రమాదం జరిగినప్పుడు రైలు ఎంత వేగంలో వెళ్తోందనేది స్పీడ్ రికార్డర్‌తోపాటు ప్రమాద సమయంలో సిగ్నల్ పొజిషన్ ఏ విధంగా ఉంది, మొదట ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన సిగ్నల్ ఎప్పుడు నమోదైంది, రెండో రైలుకు సిగ్నల్ ఎప్పుడు ఇచ్చారు, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందా వంటి అంశాలన్నీ నిక్షిప్తమై ఉండే డేటా లాగర్‌ను సీజ్ చేశారు. వాటి వివరాల్ని కూడా దర్యాప్తు బృందం సేకరించింది. సేకరించిన వివరాలన్నింటినీ రెండు రోజుల పాటు డాక్యుమెంటేషన్ చేశారు. ప్రమాద ఘటనలపై మీడియాలో ప్రచురితమైన క్లిప్పింగ్స్‌ను కూడా సేకరించారు. మొత్తం నివేదికను రైల్వే మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖలకు దర్యాప్తు బృందం పంపించనుంది. ఆ నివేదికను పరిశీలించిన తర్వాత.. 15 రోజుల్లో ప్రమాద ఘటనపై అసలు నిజాలు వెల్లడించి.. దీనికి కారకులపై చర్యలకు రైల్వే బోర్డు ఉపక్రమిస్తుందని సమాచారం. కాగా.. ప్రమాదం జరిగిన లైన్‌లో మూడు రోజుల క్రితం నుంచే సిగ్నలింగ్ వ్యవస్థలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని చెబుతున్నారు. ఈ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు లోకో పైలట్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమనే ప్రచారం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నారాయణ కాలేజీ బస్సు బోల్తా

17 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు టౌన్/ఏలూరు రూరల్: విద్యార్థులతో వెళుతున్న నారాయణ కళాశాల బస్సు ఏలూరు జిల్లా చొదిమెళ్ల–వేగవరం గ్రామాల మధ్య బోల్తా పడింది. ఘటనలో 17 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. వారిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఏలూరులోని కళాశాల నుంచి విద్యార్థులతో బయలుదేరిన బస్సు సాయంత్రం 6.10 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ బస్సు నిత్యం ఏలూరు నుంచి చొదిమెళ్ల, వేగవరం, ఆశన్నగూడెం మీదుగా రంగాపురం చేరుకుంటుంది. బస్సు బోల్తా కొట్టిన సమయంలో ఎదురుగా ఇతర వాహనాలేవీ రాకపోవడం, పక్కన ఉన్న పంట కాలువలోకి బస్సు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న అధికారులు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు జీజీహెచ్‌కి తరలించారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. బస్సు స్టీరింగ్ పట్టేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థులు చెబుతున్నారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడపడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. యాజమాన్యం మాత్రం ప్రమాదం జరిగిన రెండు గంటలు తరువాత ఆస్పత్రికి వచ్చి తమకేమి తెలియదని చెప్పడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'నవరత్నాల'తో ప్రజల జీవితాల్లో అభివృద్ధి కాంతులు

- శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తి.. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు



మాట్లాడుతున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

సాక్షి,అమరావతి : ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వైఎస్ జగన్ నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర దోహదపడిందని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మారెడ్డి ప్రసంగించారు. ప్రజా సంకల్ప యాత్రలో దాదాపు రెండు కోట్ల మందిని వైఎస్ జగన్ కలిశారని, ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ.. మనందరి ప్రభుత్వం వచ్చాక సమస్యలన్నీ పరిష్కారమవుతాయని వారికి భరోసా ఇచ్చి.. అధికారంలోకొచ్చాక వాటన్నింటినీ నెరవేర్చారని చెప్పారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతోనే పార్టీ మేనిఫెస్టో రూపొందిందన్నారు. నవరత్నాలతో ప్రజల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపారని తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజల ఇంటి ముందుకే పాలనను తీసుకొచ్చారని చెప్పారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు కంటే తొలిసారి సీఎం అయిన వైఎస్ జగన్ ఎంతో దార్శనికత చూపుతూ రాష్ట్రానికి అద్భుతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచాక చంద్రబాబు మైనార్టీలను పట్టించుకోకపోతే.. సీఎం జగన్ నలుగురు మైనారిటీలకు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాలు గెలుచుకునేలా పనిచేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌తో పాటు ప్రజా సంకల్ప యాత్రలో పాల్గొన్న 9 మందిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' పాఠశాలలో ఊడి పడిన పెచ్చులు!

ఐదుగురు విద్యార్థులకు గాయాలు



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు



గాయపడిన విద్యార్థిని

హిందూపురం టౌన్: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సీలింగ్ పెచ్చులూడిపడి ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీ చైతన్య పాఠశాల పైఅంతస్తులోని 33వ గదిలో పదో తరగతి నిర్వహిస్తున్నారు. సోమవారం ఉన్నఫళంగా గది పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడ్డాయి. దీంతో నిఖిత, జనని, నవ్య, హాసిని, మధుప్రియ అనే ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఘటనపై ఎంఈవో–1 గంగప్ప విచారణ చేపట్టారు. పాఠశాల హెచ్ఎంకు నోటీసులు జారీ చేశారు.

వచ్చే ఏడాది 'వర్డ్ పవర్ చాంపియన్ షిప్'

ట్రోఫీని ఆవిష్కరించిన సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు



'వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: దేశంలోనే అతిపెద్ద ఆంగ్ల పోటీ 2023–24 వర్డ్ పవర్ చాంపియన్ షిప్‌ను వచ్చే ఏడాది మార్చిలో నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ ట్రోఫీని విజయవాడలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష, విభా, లీప్‌ఫర్ వర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను చేపడుతున్నట్టు చెప్పారు. విభా, లీప్ ఫర్ వర్డ్ ఇంగ్లిష్ లిట్రసీ కార్యక్రమాన్ని 2021–22 నుంచి పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో, 2022–23లో ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల్లో అమలు చేస్తున్నామన్నారు. తాజాగా రాష్ట్ర స్థాయి పోటీని ఏఎస్ఆర్, ఎన్టీఆర్ జిల్లాల్లోని విద్యార్థులకు 5 స్థాయిల్లో నిర్వహిస్తామన్నారు. ఇక్కడి విజేతలు ముంబైలో జరిగే అంతర్ రాష్ట్ర గ్రాండ్ ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ శ్రీనివాసులు రెడ్డి, శామో జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, శామో లెక్చరర్స్ అపర్ణ, శారద కుమారి, విభా ప్రోగ్రామ్ మేనేజర్ టి.వీరనారాయణ, లీప్ ఫర్ వర్డ్ ప్రతినిధులు చైతన్య చక్రవర్తి, చందన పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్లు అంకితభావంతో పని చేయాలి

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు అన్నారు. కేజీబీవీల్లో కొత్తగా నియామకమైన టీచర్లకు ఆరు రోజుల పాటు వృత్యంతర శిక్షణ విజయవాడలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా, సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుకరిస్తూ పాఠాలు బోధించాలన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించి వారిని సృజనాత్మక రచయితలుగా, కళాకారులుగా తీర్చిదిద్దాలని కోరారు. మొదటి విడతలో 11వ తేదీ వరకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ టీచర్లకు విజయవాడలోను.. బొటనీ, జువాలజీ, కెమిస్ట్రీ టీచర్లకు విశాఖపట్నంలోను శిక్షణ ఉంటుందన్నారు. 16వ తేదీ నుంచి 21వరకు రెండో విడతలో భాగంగా మ్యాథ్స్, ఫిజిక్స్ టీచర్లకు తిరుపతిలో, సోషల్ స్టడీస్, ఎకనామిక్స్, హిస్టరీ, సివిక్స్, కామర్స్, వ్యాయామ విద్య టీచర్లకు అనంతపురంలో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

19న తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19వ తేదీన పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. 18న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవమూర్తులను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఐదు గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం జరుపుతారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తర్వాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్ప స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

తిరుమలలో ఎడతెరిపి లేని వాన

తిరుమలలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సూర్యాపేట జిల్లా రామాపురం గ్రామం నుంచి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి వచ్చే రహదారి దుస్థితి తెలంగాణలో ఇది



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ నుంచి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా రామాపురం గ్రామానికి వెళుతున్న ఏపీలోని రోడ్డు ఇది



తెలంగాణలో రాజోలి వద్ద తుంగభద్ర నది కరకట్ట ప్రాంతంలో అధ్వానంగా ఉన్న రహదారి



కర్నూలు మండలం సుంకేసుల గ్రామం వద్ద తుంగభద్ర నదిపై ఉన్న కరకట్ట రోడ్డు

రోడ్డున పడ్డది రామోజీ పరువే..

సరిహద్దులో రోడ్లపై ఈనాడు వక్రరాతలు

వాస్తవానికి తెలంగాణ పరిధిలోనే అధ్వానంగా రోడ్లు

తెలంగాణలో


ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం జెట్టిపాలెం సమీపంలో తెలంగాణ రాష్ట్రం అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామం నుంచి టెయిల్‌ఫాండ్‌కు వెళ్లే మట్టి రోడ్డు ఇది


ఏపీకి సరిహద్దుగా ఉన్న తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి జయంతి వెళ్లే ప్రధాన రహదారి ఇది


ఏపీకి సరిహద్దుగా ఉన్న తెలంగాణలోని అలంపూర్ నియోజకవర్గంలో ధ్వంసమై ప్రమాదకరంగా మారిన అయిజ మండలం మేడికొండ గ్రామానికి వెళ్లే రోడ్డు

సాక్షి, అమరావతి: డబుల్ రోడ్డు కనిపిస్తే తెలంగాణ అని, సింగిల్ రోడ్డు వస్తే అది ఏపీ అని జనం అనుకుంటున్నట్లుగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఓ ఎన్నికల సభలో ఓ అడ్డగోలు ప్రసంగం చేస్తే దానిని పట్టుకుని ఎల్లో మీడియా రాజగురువు శివాలెత్తిపోయారు. తెలంగాణలో బాగున్న రోడ్లు, ఏపీలో బాలేని రోడ్లు కొన్ని ఏరుకొచ్చి అచ్చేసి చంకలుగుద్దుకున్నారు. ఏపీలో నిగనిగలాడేరోడ్లు ఆయన 'ఎల్లో' కామెర్ల కళ్లకు కనిపించవు. ఇక తెలంగాణలోని గుంతల రోడ్లు కనిపిస్తాయని ఎలా అనుకుంటాం. ఇక కేసీఆర్ అతిశయం.. తన అక్కసు రాతలు.. కలగలిపి రాష్ట్రంలో రోడ్లపై రామోజీరావు మరోసారి విషం చిమ్మారు. హ్రస్వదృష్టితో ఓ అవాస్తవ కథనాన్ని వండివార్చారు. 'రాష్ట్రం పరువు రోడ్డున పడేశారు' అంటూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు తన ఈనాడు పత్రిక ద్వారా ప్రయత్నించారు. టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరుద్ధరిస్తోందన్న వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా ఆ కథనంలో విస్మరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎప్పటిలాగే అక్కసు వెళ్లగక్కారు. రామోజీ వక్రబుద్ధిని రాష్ట్రంలోని రోడ్ల స్థితిగతులే బయటపెట్టాయి. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే రోడ్లు మెరుగ్గా ఉన్నాయన్నది స్పష్టమైంది. దాంతో ఈనాడు రామోజీరావు పరువే రోడ్డున పడింది.

చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం

క్రమం తప్పకుండా చేపట్టాల్సిన రోడ్ల మరమ్మతులు, నిర్వహణను గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. దాంతో 2019 నాటికి రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల పునరుద్ధరణ పనులను చేపట్టింది. వరుసగా రెండేళ్లు భారీ వర్షాలతో పాటు కోవిడ్ పరిస్థితులు తగ్గిన తరువాత యుద్ధ ప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసింది. దాంతో రాష్ట్రంలో రోడ్లు మెరుగయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నుంచి 2019 వరకూ ఆర్అండ్‌బీ రోడ్లపై రూ. 3,335.3 కోట్ల పనులు చేస్తే బిల్లులు మాత్రం రూ. 2,772.6 కోట్లు మాత్రమే చెల్లించారు. దాదాపు రూ. 562.7 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ. 471.15 కోట్ల పనులు చేస్తే బిల్లులు మాత్రం రూ. 387.78 కోట్లు విడుదల చేశారు. రూ. 86.37 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. అంటే 2014–19 మధ్య కోవిడ్ లాంటి పరిస్థితులు లేకపోయినా, భారీ వర్షాలు లేకపోయినా ఈరెండు శాఖల పరిధిలో రూ. 3,160.38 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు

వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్అండ్‌బీ పరిధిలో నూతన రహదారులు నిర్మాణం, రహదారుల వెడల్పు, సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చడానికి రూ.3,371 కోట్లు ఖర్చు చేశారు. వాటితోపాటు రహదారుల నిర్వహణ, మరమ్మతుల కోసం రూ. 5,342 కోట్లు వెచ్చించారు.

- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.236 కోట్లతో ఇప్పటివరకు 473.43 కి.మీ. మేర రహదారులు నిర్మించారు. ఇదే శాఖలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 273.53 కోట్లతో 231.50 కి.మీ. మేర గ్రావెల్ రోడ్లు వేశారు. దాంతో 433 హేబిటేషన్స్‌కు రహదారి సౌకర్యం కలిగింది. రూ. 99.06 కోట్ల వ్యయంతో మరో 306 హేబిటేషన్స్‌లో 129.70 కి.మీ. మేర మెటల్ రహదార్లు నిర్మించారు. 359 హేబిటేషన్స్‌లో రూ. 56.25 కోట్ల వ్యయంతో 255.70 కి.మీ. మేర బీటీ రహదార్లు వేశారు. 36 హేబిటేషన్స్‌లో రూ. 29.84 కోట్ల వ్యయంతో 38.56 కిలోమీటర్ల సిమెంట్ రహదార్లు నిర్మించారు.
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఏపీఆర్ఆర్‌పీ కింద రూ. 1,273.82 కోట్లతో 2,334 కి.మీలు., పీఎంజీఎస్‌వై పథకంలో రూ.1,877.49 కోట్లతో 2,971 కి.మీలు., నాబార్డు నిధులు రూ.224.38 కోట్లతో 425 కి.మీలు., జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 2,068 కోట్లతో 5,983 కి.మీ. మేర బీటీ, సీసీ రహదారులు నిర్మించారు.
- ఆర్అండ్‌బీ రోడ్ల పరిధిలో దాదాపుగా 11,500 కి.మీలు., పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పరిధిలో దాదాపు 1,394.34 కి.మీ. నిడివి ఉన్న రోడ్లకు.. మొత్తంగా 12,894 కి.మీ మేర రోడ్లకు మరమ్మతులు చేశారు.

ఫ్యాక్ట్ చెక్

తెలంగాణ వార్తలు రాసే ధైర్యం లేదా రామోజీ

తెలంగాణలో రోడ్ల దుస్థితిని ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదన్నది ఈనాడు రాతల్లో స్పష్టమవుతోంది. ఆ రాష్ట్రంలో బిల్లులు మంజూరు చేయలేదని కాంట్రాక్టర్లు ఇటీవల ధర్నాలు చేశారు. ఆ వార్త ప్రచురించేందుకు మాత్రం రామోజీరావుకు ధైర్యం సరిపోలేదు. అసలు తెలంగాణలో కాంట్రాక్టర్లు ధర్నా చేశారనే విషయాన్ని పట్టించుకోలేదు. అటువంటి రామోజీరావు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రోడ్లు నిర్మిస్తున్నా దుష్ప్రచారం చేస్తుండటం విడ్డూరంగా ఉంది.

ఇటు వాస్తవాలను చూడలేరా!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుండటంతో ఈనాడు పత్రిక ద్వారా రోజుకో రీతిలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే 'పచ్చ'గురువు రామోజీరావు పనిగా పెట్టుకున్నారు. అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఏపీ–తెలంగాణ సరిహద్దుల్లో రోడ్ల పరిస్థితిపై వాస్తవాలను వక్రీకరించారు. రామోజీరావు వాస్తవాలు విస్మరించినా.. ప్రజలు మాత్రం నిజాలను గుర్తిస్తూనే ఉన్నారు. ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కర్నూలు జిల్లాల్లో తెలంగాణ సరిహద్దుల వద్ద రోడ్లను పరిశీలిస్తే ఆ వాస్తవాలు తెలుస్తాయి. ఆంధ్రప్రదేశ్ పరిధిలో కొత్తగా నిర్మించిన రోడ్లు దర్శనమిస్తుండగా.. తెలంగాణ పరిధిలో రోడ్లు పూర్తిగా గుంతలతో నిండి ఉన్నాయనే వాస్తవం కళ్లకు కనపడుతుంది.



కర్నూలు జిల్లా సరిహద్దు తెలంగాణలోని పుల్లూరుకు వెళ్లే రోడ్డు



ఏపీ సరిహద్దులోని కర్నూలు-దేవమడ రహదారి

తెలంగాణలో


ఏపీ సరిహద్దులో నల్లగొండ జిల్లా పెద్దగూడెం-కొత్తూరు రహదారి దుస్థితి ఇది...


కర్నూలు-దేవమడ రోడ్డు నుంచి తెలంగాణలోని బైరాపురం గ్రామం మీదుగా అలంపూర్‌కు వెళ్లే రహదారి ఇది

పశుబీమా పక్కాగానే..

నిజాలకు ముసుగేసి రామోజీ క్షుద్ర రాతలు

గతంలో 50 : 50 శాతం నిష్పత్తి చొప్పున అమలుచేసేవారు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 1.20 లక్షల పశువులకే బీమా
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తొలుత పశు నష్టపరిహారం పథకం అమలు
- ఇందులో 77వేల మంది రైతులకు రూ.176.68 కోట్ల పరిహారం పంపిణీ
- మరింత మందికి లబ్ధిచేకూర్చే లక్ష్యంతో వైఎస్సార్ పశు బీమా పథకం అమల్లోకి..
- దారిద్ర్యరేఖకు దిగువనున్న వారితో పాటు ఎస్సీ, ఎస్టీల తరఫున ప్రీమియం మొత్తంలో 80శాతం ప్రభుత్వ రాయితీ
- ఈ పథకంలో ఇప్పటికే దాదాపు 1.73 లక్షల మంది పశుపోషకుల నమోదు
- ఇటీవలే 1,076 మందికి రూ.2.12 కోట్ల పరిహారం చెల్లింపు



ఒకరోజు భోజనం చేయకుండా లేదా నిద్రలేకుండా అయినా ఈనాడు రామోజీరావు ఉండగలరేమోగానీ సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై విషం కక్కకుండా మాత్రం ఉండలేరు. రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఆయన తాజాగా తన క్షుద్ర పత్రికలో పశుబీమాపై తన పైత్యాన్ని ప్రదర్శించారు. వైపరీత్యాలు, ప్రమాదాల్లో మూగ, సన్నజీవాలు మృత్యువాతపడినప్పుడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పశుపోషకులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశువుల బీమా పథకాన్ని అమలుచేస్తోంది. ఇది సమర్థవంతంగా అమలవుతుంటే వాస్తవాలకు ముసుగేసి 'పశుబీమా పడకేసింద'ంటూ ఆ రైతులను తప్పుదారి పట్టించేలా ఈనాడు రోత రాతలు రాస్తోంది.

-సాక్షి, అమరావతి

పశు బీమాకు ఢోకాలేదు..



రాష్ట్రంలో వైఎస్సార్ పశుబీమా పథకానికి ఢోకాలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ నిర్దేశిత గడువులోగా పరిహారం ఇస్తున్నాం. ఈ పథకం ఆపలేదు.. ఆగలేదు. దీనికి ప్రభుత్వం రూ.55 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తంలో లబ్ధిదారులు తమ వాటాగా రూ.15 కోట్లు చెల్లిస్తుండగా, కేంద్రం రూ.20కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు సర్దుబాటు చేస్తోంది. కేంద్రం చెల్లించాల్సిన వాటాకు సంబంధించి రూ.63.12 కోట్లు రావాల్సి ఉంది. అవి అందిన వెంటనే మరింత వేగంగా అమలుచేస్తాం.

– డాక్టర్ అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

బాబు హయాంలో బీమాకు మంగళం..

నిజానికి.. గతంలో కేంద్ర ప్రాయోజిత పథకం కింద పశువులు, సన్నజీవాల కోసం అమలుచేసిన బీమా పథకానికి నిర్దేశించిన ప్రీమియం మొత్తంలో 50 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉండగా, మిగిలిన 50 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించేవి. 2015 తర్వాత కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్ నిలిపివేయడంతో చంద్రబాబు హయాంలో ఈ బీమా పథకాన్ని పూర్తిగా అటకెక్కించేశారు. అప్పట్లో కేవలం 1.20 లక్షల పశువులకు మాత్రమే బీమాను వర్తింపజేశారు. వరదలు, తుపానులు వచ్చినప్పుడు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధల మేరకు అరకొరగా అతికొద్ది మందికి మాత్రమే పరిహారం ఇచ్చేవారు. మిగిలిన సమయాల్లో రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాలు, వడగాడ్పులు, పిడుగుపాటుకు, అడవి జంతువులు, విషప్రయోగాలు, పాముకాట్లు వంటి వాటివల్ల చనిపోయే జీవాలకు పైసా పరిహారం కూడా దక్కేది కాదు. కనీసం బీమా చేయించాలన్న ఆలోచన కూడా గత టీడీపీ ప్రభుత్వం చేయలేదు.

ఇప్పుడు పశుపోషకులకు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైపరీత్యాలు, ప్రమాదాల్లో చనిపోయిన మూగ, సన్నజీవాలవల్ల జీవనోపాధి కోల్పోయిన పశు పోషకులకు నష్టపరిహారం చెల్లించారు. వ్యక్తిగతంగా బీమా చేయించుకునే పశుపోషకులకు భరోసా కల్పించారు. ఇలా నాలుగేళ్లుగా ఈ పథకం కింద ఏకంగా 77వేల మంది పశుపోషకులకు వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం కింద నేరుగా వారి ఖాతాలకు రూ.176.68 కోట్లు జమచేశారు. మరింత మందికి లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతో 2022–23 నుంచి వైఎస్సార్ పశుబీమా పథకం తీసుకొచ్చారు. దీనికింద.. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారితో పాటు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన పశుపోషకులకు తమ జీవాలకు మూడేళ్ల కాలపరిమితికి నిర్దేశించిన ప్రీమియం మొత్తంలో 80 శాతం ప్రభుత్వ రాయితీగా భరిస్తోంది. లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఏటా రెన్యువల్ చేసుకునే ఇబ్బంది లేకుండా మూడేళ్లకు ఒకేసారి ప్రీమియం చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మూడేళ్లకు సాధారణ ప్రాంతాల్లో ప్రీమియం 11 శాతంగా నిర్ధారించగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 6.40 శాతానికే అందిస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత తక్కువ ప్రీమియంలేదు. పాడి రైతులు కావాలనుకుంటే తమ పశువులకు రూ.30వేల నుంచి రూ.1.20లక్షల వరకు బీమా చేయించుకోవచ్చు. ప్రభుత్వ రాయితీ మాత్రం రూ.30 వేలకే వర్తిస్తుంది. మిగిలిన ప్రీమియం మొత్తం చెల్లించుకుంటే సరిపోతుంది.

80శాతం రాయితీ వర్తింపు..

ఇక పశు పోషకులలో ఎక్కువ మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారే. వీరిలో ఎస్సీ, ఎస్టీలతో పాటు దారిద్ర్యరేఖకు దిగువనున్న బీసీలందరికీ 80శాతం రాయితీ వర్తిస్తుంది. ఇప్పటివరకు ఈ పథకంలో 1,72,815 మంది పశు పోషకులు నమోదు చేసుకున్నారు. వీరికోసం రూ.16.43 కోట్లను ప్రభుత్వం ప్రీమియం రూపంలో చెల్లించింది. వైపరీత్యాలు, ప్రమాదాల్లో పశువులను కోల్పోయిన 1,076 మంది పశుపోషకులకు రూ.2.12 కోట్ల బీమా పరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఇవేవీ కనిపించని రామోజీ రోజూ క్షుద్ర వార్తలను వండి తన పాఠకుల మీద రుద్దుతున్నారు.

భద్రత ముఖ్యం.. తొందరెందుకు.!

విద్యుత్ వాహనాలపై ప్రభుత్వం ఆచితూచి అడుగు

బ్యాటరీలు తగలబడకుండా భద్రత ప్రమాణాల్లో సవరణలు తెచ్చిన కేంద్రం

- భద్రతతో కూడిన బ్యాటరీల ఏర్పాటుకు కంపెనీలకు సమయం అవసరం
- ఈవీల తయారీ సంస్థలతో నెడ్‌క్యాప్ ఒప్పందం
- ఉద్యోగుల సౌలభ్యం కోసం వెబ్ పోర్టల్ ఏర్పాటు
- అన్ని మోడల్స్ గురించి తెలుసుకుని ఎంపిక చేసుకునే సౌలభ్యం
- ఇలాంటి వెసులుబాటు కల్పించింది దేశంలో ఏపీ మాత్రమే
- ఈ విషయాలన్నీ దాచిపెట్టి ప్రభుత్వంపై 'ఈనాడు' బురదజల్లే ప్రయత్నం



సాక్షి, అమరావతి: విద్యుత్ వాహనాల (ఈవీల) వినియోగాన్ని ప్రోత్సహించడం ఎంత అవసరమో.. వాటి వినియోగదారుల భద్రత కూడా అంతే ముఖ్యమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అందుకే కొనుగోళ్ల సంఖ్య పెంచడంపై కాకుండా విద్యుత్ వాహనాలు తగలబడి, అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాయి. కాలిపోకుండా ఉండే బ్యాటరీలను అమర్చాలంటూ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సురక్షితమైన బ్యాటరీలతో వచ్చే వాహనాలను ప్రభుత్వ ఉద్యోగులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ సదుద్దేశాన్ని వక్రీకరించి ఈనాడు సోమవారం తప్పుడు కథనాన్ని అచ్చేసింది. ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా వక్రభాష్యాలు చెప్పుకొచ్చింది. అసలు నిజాలను న్యూ, రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి 'సాక్షి'కి వెల్లడించారు.



ఆ వివరాలిలా ఉన్నాయి..

- కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ప్రోత్సాహమిచ్చేందుకు ఫేమ్–2 పథకం ద్వారా ఈవీలను కొనే వారికి దాని ధరలో 15 శాతం లేదా కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్)కు రూ.10 వేలు ఏది తక్కువైతే అది రాయితీగా ఇస్తోంది. నెడ్‌క్యాప్ రుణ సదుపాయం మాత్రమే కల్పిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకాన్ని స్వచ్ఛందంగా పొందవచ్చు. వారికి నచ్చిన వాహనాన్ని ఎంపిక చేసుకోవచ్చు. పర్యవేక్షణ అధికారి సంతకంతో దరఖాస్తు సమర్పించాలి. తయారీదారుడి ద్వారా బ్యాంకులే వాహనాన్ని ఏర్పాటు చేస్తాయి.
- రాష్ట్రంలో దాదాపు 90 లక్షల పెట్రోల్ ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా కాలుష్యం పెరుగుతుండటంతో విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. ముందుగా ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థలతో నెడ్‌క్యాప్ ఒప్పందం కుదుర్చుకుంది. బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తోంది. తక్కువ వడ్డీకి నాలుగేళ్ల రుణం, మొదటి వాయిదా (ఈఎంఐ) మాత్రమే ముందుగా చెల్లించి వాహనాన్ని తెచ్చుకునే అవకాశం కల్పించింది.
- ఉద్యోగుల సౌలభ్యం కోసం ఒక వెబ్ పోర్టల్‌ని ఏర్పాటు చేసింది. దీనిలో బ్యాంకు ప్రతినిధులు, తయారీదారు, ఉద్యోగికి జీతాలిచ్చే అధికారి భాగస్వాములు. ప్రతి కంపెనీ వాహనం బ్యాటరీ సామర్థ్యం, మైలేజ్, మోటార్ కెపాసిటీ, వేగం వంటి వివరాలన్నీ పోర్టల్‌లో ఉంటాయి. ఉద్యోగులు కంపెనీల అవుట్‌లెట్లకు వెళ్లి వివరాలు కనుక్కుని, బండిని ఎంపిక చేసుకునే అవస్థలు లేకుండా పోర్టల్ ద్వారా అన్ని కంపెనీల వాహనాల వివరాలు తెలుసుకుని, నచ్చిన వాహనాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఇలాంటి ఏర్పాటు దేశంలో ఎక్కడా లేదు. ఏపీ ప్రభుత్వం మాత్రమే చేసింది.
- విద్యుత్ వాహనాల బ్యాటరీ భద్రత ప్రమాణాల్లో కేంద్రం సవరణలు తెచ్చినందున, వాటికి అనుగుణంగా వాహనాల తయారీకి కంపెనీలకు సమయం కావాలి. ఉద్యోగులకు పూర్తిగా ప్రమాద రహితంగా వాహనాలు ఇవ్వాలనే ఉద్దేశంతో మార్కెట్ పరిస్థితులనుబట్టి ఈ కార్యక్రమాన్ని నెడ్‌క్యాప్ ముందుకు తీసుకెళుతుంది. తొందరపాటుగా వ్యవహరిస్తే అనర్థాలు జరిగే అవకాశం ఉంది.
- విద్యుత్ వాహనాల మార్కెట్ అభివృద్ధి దశలో ఉంది. ప్రజలకు, ఉద్యోగులకు విద్యుత్ వాహనాల లాభాలు, డ్రైవింగ్, చార్జింగ్, నిర్వహణపై నెడ్‌క్యాప్ నిరంతరంగా అవగాహన కల్పిస్తోంది.
- 2030 నాటికి పెట్రోల్ వాహనాలను దశలవారీగా తొలగించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా జాతీయ రహదారుల వెంబడి 25 కిలోమీటర్లకు ఒకటి, నగర పరిధిలో ప్రతి మూడు కిలోమీటర్లకు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 4 వేల స్థలాలను గుర్తించింది. ఇప్పటివరకు ఎన్ఆర్ఈడీసీఏపీ ఆధ్వర్యంలో 266 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. మరో 115 స్టేషన్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. దీంతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల సంఖ్య 65 వేలు దాటింది.

క్లుప్తంగా...

26 మంది హౌసింగ్ డీఈఈలకు ఈఈలుగా ప్రమోషన్

సాక్షి, అమరావతి: ఏపీ గృహ నిర్మాణ సంస్థలో పని చేస్తున్న 26 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లకు ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)లుగా ప్రమోషన్ కల్పించింది. 2023–24 ప్యానెల్ సంవత్సరానికి ఈఈలుగా ప్రమోషన్ పొందిన 26 మంది అధికారులకు పోస్టింగ్ ఇస్తూ సోమవారం గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

లైంగిక దాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

ఒంగోలు : మాయమాటలు చెప్పి ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం .. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన బాలిక నెల్లూరులో విద్యనభ్యసిస్తూ ఉండేది. వేసవి సెలవుల్లో కనిగిరిలో తండ్రి చెంతకు చేరింది. తండ్రి షాపులో పనిచేసే మహబూబ్‌బాషా (38) అనే వ్యక్తి ఆమెను మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే ఆమెను హైదరాబాద్ కూడా తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారం చేశాడు. అందిన ఫిర్యాదు మేరకు కనిగిరి పోలీసుస్టేషన్‌లో 2019లో కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ తీర్పునిచ్చారు. అంతే కాకుండా బాధితురాలికి నష్టపరిహారం కింద రూ.50 వేలు చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను న్యాయమూర్తి ఆదేశించారు.

అరెస్ట్ తర్వాతే బాబు గొప్పతనం ప్రజలకు అర్థమైంది..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి : చంద్రబాబు అరెస్ట్ తర్వాత ఆయన గొప్పతనం ప్రజలకు అర్థమైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. చంద్రబాబు అరెస్ట్‌పై మన రాష్ట్రంతో పాటు 70కు పైగా దేశాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయని తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సోమవారం దళిత సమ్మేళనం పేరుతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన చంద్రబాబుపై సీఎం జగన్ రోజుకో కేసు పెడుతున్నారని చెప్పారు. ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తే దానిపై కేసు పెట్టారన్నారు. టీడీపీ–జనసేన కూటమితో వైఎస్సార్‌సీపీ డిపాజిట్లు గల్లంతవుతాయన్నారు. దళితులంతా ప్రతి పల్లెకూ వెళ్లి ముఖ్యమంత్రి తమకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా టీడీపీ గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనంద్‌బాబు, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో ప్రమాదానికి సీఎం జగనే కారణం: లోకేశ్

సాక్షి, అమరావతి: విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వమే కారణమని టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ప్లాట్ ఫాంపైకి బస్సు దూసుకురావడం వల్ల జరిగిన ప్రమాదానికి సీఎం జగన్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాలంచెల్లిన బస్సుల కారణంగానే రాష్ట్రంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా ఆర్టీసీ గ్యారేజీల్లో నట్లు, బోల్టుల కొనుగోలుకు సైతం ప్రభుత్వం నిధులివ్వడంలేదని ఆరోపించారు. ఆర్టీసీలో రిక్రూట్‌మెంట్ కూడా లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రమాద మృతుల కుటుంబాలకు, గాయపడినవారికి మెరుగైన పరిహారం అందించాలని కోరారు.

అచ్చెన్నా.. బీసీల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

ఏపీ బీసీ సంఘం సవాల్

పటమట (విజయవాడ తూర్పు): చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలోని టీడీపీ పాలనలో బీసీలకు జరిగిన అభి వృద్ధిపై, వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు బీసీ నేతలు సవాల్ విసిరారు. సోమవారం విజయవాడ పటమట ఆర్టీసీ కాలనీలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.మారేష్ మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటుతున్నా ఇంతవరకు బీసీలకు దక్కని ఆత్మగౌరవం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దక్కుతుంటే తెలుగుదేశం నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. నవరత్న పథకాల ద్వారా అందుతున్న సంక్షేమం ద్వారా బీసీలు ఆర్థికంగా బలోపేతమై.. వారి జీవన ప్రమాణాలు మెరుగు పడుతుంటే టీడీపీ నేతలు సహించలేకపోతున్నారని ధ్వజమెత్తారు. సర్పంచ్ స్థాయి నుంచి రాజ్యసభ స్థానాల వరకు మంత్రి మండలిలో, స్థానిక సంస్థలలో ఎమ్మెల్సీలుగా రాజ్యాధికారంలో 65 శాతం పైగా వాటా ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నేతలు బీసీలపై తమ కపట ప్రేమను చూపించడం మొదలు పెడుతున్నారని విమర్శించారు.

నిరంతరం 'ఆరోగ్య సురక్ష'

జనవరి నుంచి ప్రతినెలా మండలంలో నాలుగు శిబిరాల నిర్వహణ

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షలో కలెక్టర్లు, వైద్యశాఖ అధికారులకు సీఎం దిశానిర్దేశం

సాక్షి, అమరావతి :వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి క్రమం తప్పకుండా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఉంటాయని.. ప్రతి వారం మండలంలో ఈ క్యాంపు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇలా నెలలో ఆ మండలంలో నాలుగు క్యాంపులు నిర్వహించాలని.. ఆరు నెలల్లో ప్రతి మండలం.. ప్రతి గ్రామంలో క్యాంపు జరుగుతుందన్నారు. తద్వారా సంతృప్త స్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందుతాయన్నారు. ఇదొక నిరంతర ప్రక్రియని ఆయన తెలిపారు. అలాగే, జగనన్న ఆరోగ్య సురక్ష, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రివెంటివ్ కేర్ అత్యంత కీలకంగా వ్యవహరించనున్నాయని సీఎం చెప్పారు. ఏదైనా జబ్బు వచ్చాక వైద్యం అందించడం కన్నా.. అవి రాకుండా వాటిని నియంత్రించడమే ముఖ్యమని ఇందుకు ఈ వ్యవస్థలన్నీ ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రజారోగ్య రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చే అత్యంత ముఖ్యమైన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని.. ఈ కార్యక్రమం ద్వారా వివిధ ఆరోగ్య సమస్యల బాధితులకు చేయూత అందించాలని జిల్లాల కలెక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం జగన్ వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

అత్యంత కీలకం ఐదో దశ..

ఐదు దశల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఐదో దశ కార్యక్రమం మొత్తంలో అత్యంత కీలకమైంది. ప్రస్తుతం మనం నిర్వహించే వైద్య శిబిరాలు మామూలు శిబిరాలు మాత్రం కావు. సాధారణంగా నిర్వహించే వైద్య శిబిరాలు అప్పటికప్పుడు నిర్వహించి వైద్యంచేసి మందులిస్తే అక్కడితో అంతా అయిపోతుంది. అయితే, మన కార్యక్రమంలో శిబిరాల నిర్వహణ అనంతరం అసలు పనిమొదలవుతుంది. శిబిరాలు నిర్వహించిన అనంతరం వివిధ ఆరోగ్య సమస్యల బాధితులను మనం వైద్యపరంగా చేయిపట్టి నడిపిస్తాం. ఇదే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యం. ఆరోగ్య సురక్షలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటివరకూ సురక్షలో భాగంగా పట్టణాల్లో 91 శాతం, గ్రామాల్లో 94.94 శాతం మంది జనాభా స్క్రీనింగ్ పూర్తయ్యింది. 1.44 కోట్ల గృహాలను ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ)లు జల్లెడపట్టి 6.4 కోట్ల ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో సగటున నాలుగు పరీక్షలు చేస్తూ జల్లెడ పట్టాం. గ్రామాల్లో 10,032 శిబిరాలకుగాను 98 శాతం అంటే 9,869 శిబిరాలు.. పట్టణాల్లో 2,390 శిబిరాలకు గాను 1,841 శిబిరాలు అంటే 77శాతం నిర్వహణ పూర్తయింది. ఇక గ్రామాల్లో ఈనెల 22న, పట్టణాల్లో 29 నాటికి శిబిరాల నిర్వహణ ముగుస్తుంది. ఈ క్రమంలో ఇప్పుడు మనం ఐదో దశలో ఉన్నాం. ఇక ఇక్కడి నుంచి అసలు ప్రక్రియ మొదలవుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా శిబిరాలకు వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేస్తున్నాం. ఎవరెవరికి తదుపరి వైద్యసేవలు అవసరం ఉంది? ఎవరెవరిని ఆస్పత్రులకు రిఫర్ చేశాం? ఎవరెవరు ఏఏ సమస్యలతో బాధపడుతున్నారన్న సమగ్ర సమాచారం మన దగ్గర ఉంది. ఈ సమాచారం ఆధారంగా మనం మూడు రకాల కార్యక్రమాలు ఈ దశలో చేపట్టాలి.

> "సోమవారం నాటికి.. 'ఆరోగ్య సురక్ష'లో దాదాపు 85వేల మంది రోగులను తదుపరి చికిత్సల నిమిత్తం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్, బోధనాస్పత్రులకు రిఫర్ చేశారు. వీరందరినీ మొబైల్ యాప్ ద్వారా ట్రాక్‌చేసి, ఆస్పత్రులకు మ్యాప్ చేయాలి. ఆ తర్వాత వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, గ్రామ సచివాలయంలోని వైద్య, ఆరోగ్య సిబ్బందితో అనుసంధానించాలి. సిబ్బంది ద్వారా సంబంధిత రోగులకు జబ్బులు నయమయ్యే వరకూ వైద్యపరంగా చేయిపట్టి నడిపించాలి. చికిత్సానంతరం ఇంటికి వచ్చాక వారికి తోడుగా ఉంటూ, నిరంతరం ఆరోగ్య స్థితిపై వాకబు చేస్తుండాలి".



జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కార్యక్రమం-1

జబ్బులు నయమయ్యే వరకూ చేయిపట్టి నడిపించాలి..

ఇక సోమవారం నాటికి.. దాదాపు 85వేల మంది రోగులను తదుపరి చికిత్సల నిమిత్తం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్, బోధనాస్పత్రులకు రిఫర్ చేశారు. వీరందరినీ మొబైల్ యాప్ ద్వారా ట్రాక్‌చేసి, ఆస్పత్రులకు మ్యాప్ చేయాలి. ఆ తర్వాత వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, గ్రామ సచివాలయంలోని వైద్య, ఆరోగ్య సిబ్బందితో అనుసంధానించాలి. సిబ్బంది ద్వారా సంబంధిత రోగులకు జబ్బులు నయమయ్యే వరకూ వైద్యపరంగా చేయిపట్టి నడిపించాలి. రిఫరల్ కేసుల్లో సంబంధిత వ్యక్తులకు ఆస్పత్రులకు వెళ్లేందుకు రవాణా ఖర్చుల కింద రూ.500 చొప్పున ఇవ్వాలి. 85వేల కేసుల్లో 13,850 మందికి ఇప్పటివరకూ చేయూతనిచ్చి తదుపరి చికిత్సల కోసం నెట్‌వర్క్/జిల్లా ఆస్పత్రులకు పంపించాం. మిగిలిన వారిని కూడా రాబోయే రోజుల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపించి వారికి మంచి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి. వీరందరికీ చేయూతనందిస్తూ వైద్యపరంగా చేయిపట్టి నడిపించాలి. ఈ కార్యక్రమంపై మీ అందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఇలా అన్ని ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి, గుర్తించిన మొత్తం రిఫరల్ కేసులన్నింటికీ కూడా తదుపరి చికిత్సలు అందించే కార్యక్రమాన్ని డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేయాలి. చికిత్సానంతరం ఇంటికి వచ్చాక వారికి తోడుగా ఉంటూ, నిరంతరం ఆరోగ్య స్థితిపై వాకబు చేస్తుండాలి. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్స్‌ను 3,300కు పెంచాం. అయినప్పటికీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని.. ఎక్కడైనా అరుదైన ఆరోగ్య సమస్యలు, జబ్బులు బయటపడిన సందర్భాల్లో ఫ్యామిలీ డాక్టర్ రిఫరెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి, బోధనాసుపత్రులకు పంపించి ఉచితంగా వైద్య చికిత్సలు అందించాలి. అలాంటి రోగాలకు కూడా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు ఆరోగ్యశ్రీ అధికారులకు కూడా ఆదేశాలు జారీచేస్తున్నా.

కార్యక్రమం-2

వైద్య సేవలపై ఆరా తీయాలి..

ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయించుకున్న రోగులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి. ఇందులో భాగంగా..

- డిశ్చార్జ్ అయి వచ్చిన రోగి ఇంటికి విలేజ్ క్లినిక్ సిబ్బంది వారం రోజుల్లో వెళ్లాలి.
- ఆస్పత్రుల్లో వైద్యసేవలపై ఆరా తీయాలి. ఎలాంటి లంచాలకు తావు లేకుండా పూర్తి ఉచితంగా చికిత్సలు అందాయో లేదో తెలుసుకోవాలి.
- మందులు సక్రమంగా వాడుతున్నారో లేదో పరిశీలించాలి.
- వైఎస్సార్ ఆరోగ్య ఆసరా అందిందో లేదో నిర్ధారించుకోవాలి.
- రోగితో ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఆరోగ్యశ్రీ సేవలందుకున్న రోగులకు ఏడాదిపాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా రోగులు తిరిగి ఆస్పత్రులకు వెళ్లి మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.
- కానీ, సరైన అవగాహనలేక, కొందరు తెలీక.. ఇతర కారణాలతో మరికొందరు ఆస్పత్రులకు వెళ్లి మందులు తీసుకుంటున్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది.
- ఇలా చికిత్సానంతరం మూడు నెలల తర్వాత కేవలం 33 శాతం పేషెంట్లు మాత్రమే మందులు తీసుకుంటున్నారు.
- ఆరు నెలల తర్వాత 22 శాతం, ఏడాది తర్వాత చూస్తే కేవలం 8 శాతం మాత్రమే ఉంటున్నారు.
- ఇలాంటి పరిస్థితులు ఇకపై ఉండకూడదు. నిర్ణీత సమయానికి రోగులు ఠంచన్‌గా వెళ్లి మందులు తీసుకునేలా చూడాలి.
- ఈ మేరకు మొబైల్ యాప్‌లో తగిన విధంగా ఫీచర్లు తీసుకొచ్చాం.
- రోగులు నిర్ణీత కాలానికి ఆస్పత్రులకు వెళ్లేలా చూడాల్సిన బాధ్యత విలేజ్ క్లినిక్స్‌కు, ఫ్యామిలీ డాక్టర్‌కు ఉంది.

వైద్యం కోసం ప్రజలు ఖర్చుపెట్టకుండా చూడాలి..

ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలన్న దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. పథకం ద్వారా ఉచితంగా సేవలు పొందడం గురించి తెలియని వ్యక్తి రాష్ట్రంలో ఉండకూడదు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమం నిర్వహించాలి. మంచి ఫీచర్లతో ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని ఇదివరకే ఆదేశాలిచ్చాను. ఈ కార్డుల పంపిణీ కూడా అదేరోజు నుంచి ప్రారంభించాలి. ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ ఉండాలి. 1.24 కోట్ల మంది మహిళలు దిశ యాప్‌ను తమ ఫోన్లలో రిజిస్టర్ చేసుకున్నారు. ఈ తరహాలోనే ప్రతి ఫోన్లో ఆరోగ్యశ్రీ యాప్ ఉండాలి. ఒక వ్యక్తికి ఆరోగ్యం బాగోకపోతే ఆరోగ్యశ్రీ చికిత్స కోసం ఎక్కడకు వెళ్లాలన్న దానిపై పూర్తి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. దీనిపై ఎలాంటి సందేహాలు ఎవ్వరికీ ఉండకూడదు. యాప్‌లోకి వెళ్తే సమీపంలోని ఎంపానెల్ ఆస్పత్రికి మార్గం చూపిస్తుంది. లేకపోతే విలేజ్ క్లినిక్‌లో సంప్రదించినా, 104కు ఫోన్‌చేసినా గైడ్ చేస్తారు. ఆరోగ్యశ్రీ సేవలను ఎలా పొందాలన్న దానిపై బుక్‌లెట్ కూడా ప్రతి కుటుంబానికీ అందిస్తారు. ఆరోగ్యశ్రీని వినియోగించుకోవడంపై సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కలిగించాలి. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 950 నెట్‌వర్క్ ఆసుపత్రులుంటే, ప్రస్తుతం 2,295 ఆస్పత్రుల్లో సేవలు అందుతున్నాయి. మన రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాల్లోని పెద్దపెద్ద కార్పొరేట్ ఆస్పత్రులను ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ చేశాం. అయినా వైద్యం కోసం ప్రజలు ఎందుకు తమ జేబుల్లో నుంచి డబ్బులు ఖర్చుచేసుకోవాలి? అలాంటి పరిస్థితులు ఇకపై లేకుండా చూడటం మనందరి బాధ్యత.

8.72 లక్షల మందికి కంటి పరీక్షలు..

ఇక ఆరోగ్య సురక్షలో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 8.72 లక్షల మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 5.22 లక్షల మందికి కంటి అద్దాలు ఇవ్వాలని డాక్టర్లు సిఫారసు చేశారు. వీరికి వెంటనే వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే, 73,474 మందికి కంటి సర్జరీలు చేయాలని గుర్తించారు. వీరికీ సర్జరీలు చేయించాలి. డిసెంబర్ నెలాఖరు నాటికి ఈ కార్యక్రమాలన్నీ కూడా పూర్తికావాలి. మరోవైపు.. రక్తపోటు కేసులు 2,48,638గా.. మధుమేహం 1,49,879 కేసులను గుర్తించారు. వీరిందరికీ నిర్ధారణ పరీక్షలు చేసి మందులివ్వాలి. ఆ తర్వాత వారి ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి. ప్రివెంటివ్ కేర్‌లో ఇది చాలా కీలకమైన అంశం. పౌష్టికాహారం లోపం, రక్తహీనత సమస్యలను పూర్తిగా నివారించాలి. ఈ సమస్యలతో బాధపడుతున్న వారికి సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారం, మందులు అందుతున్నాయో లేదో విలేజ్ క్లినిక్స్ ద్వారా పరిశీలించాలి. రక్తహీనత బాధితుల మీద మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారులు దృష్టిపెట్టాలి. మందులు, సంపూర్ణ పోషణం ప్లస్ ద్వారా తగిన ఆహారం కూడా ఇప్పించాలి.

దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ వ్యవస్థలు లేవు..

దేశంలో ఏ రాష్ట్రంలోని కలెక్టర్లకు లేని యంత్రాంగం, మన రాష్ట్రంలో కలెక్టర్లకు ఉంది. అలాగే, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, గ్రామ సచివాలయంలాంటి వ్యవస్థలు లేవు. ఇవన్నీ సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో మనల్ని అన్ని రాష్ట్రాలకన్నా ముందు ఉంచేందుకు ఉపయోగపడతాయి. కలెక్టర్లకు మంచి అభిరుచి ఉంటే కచ్చితంగా లక్ష్యాలు సాధిస్తాం. ప్రతి కలెక్టర్ దీన్ని సవాల్‌గా తీసుకుని, జీరో ఎనీమిక్ కేసులు దిశగా ప్రయత్నించాలి. అలాగే, 9,969 లెప్రసీ అనుమానాస్పద కేసులున్నాయి. వీరందరికీ వెంటనే నిర్ధారణ పరీక్షలు చేపట్టాలి. 442 మందికి టీబీ ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యింది. వీరికి సక్రమంగా మందులు అందించాలి. 1,239 మంది చిన్నారులు 4–డి (డెఫీషియన్సీస్, డిఫెక్ట్స్ ఎట్ బర్త్, డిసీజెస్, డెవలప్‌మెంటల్ డిలేస్) సమస్యలతో బాధపడుతున్నట్లుగా తేలింది. సాధ్యమైనంత త్వరగా వీరికి అవసరమైన చికిత్సలు అందించడంపై దృష్టిపెట్టాలి. కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సలు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా అందిస్తే పిల్లలు ఈ సమస్యల నుంచి బయటపడతారు.

కార్యక్రమం-3

మందులు ఎంత ఖరీదైనా సరే అందించాలి..

కిడ్నీ, లివర్ రోగులతో పాటు, మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులు ఖరీదైన మందులు వాడాల్సి ఉంటుంది. అంత ఖరీదైన మందులను పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేరు. అలాంటి వారికి మందులు అందిస్తూ చేయూతనివ్వాలి. మందులు ఎంత ఖరీదైనా సరే వెనకడుగు వేయకుండా మనం అందించాలి. ఈ మేరకు అధికారులందరికీ కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చాను. గ్రామ, వార్డు సచివాలయం, విలేజ్ క్లినిక్స్ ఆధారంగా మ్యాపింగ్ చేసి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం చేయాలి.

సేవలు మరింత విస్తరిస్తాం..

టెరిషరీ కేర్ వైద్యసేవలను రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తున్నాం. ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి జిల్లాలో అత్యాధునిక సేవలు అందించే బోధనాసుపత్రి అందుబాటులో ఉంటుంది. ఒకవైపు పాత ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూడా అభివృద్ధిపరుస్తూనే ఇవన్నీ చేపడుతున్నాం. ఇక నియామకాల పాలసీ మీద కలెక్టర్లు పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. ప్రతి జిల్లాలో స్పెషలిస్టు, ఎంబీబీఎస్ డాక్టర్లు, ఇతర సిబ్బంది కొరత లేకుండా సంబంధిత జిల్లాల కలెక్టర్లు చూసుకోవాలి. ఇప్పటికే కేవలం ఆరోగ్య రంగంలో 53 వేల ఖాళీలను మనం భర్తీచేశాం. ఈ నేపథ్యంలో.. ఎక్కడ ఖాళీలున్నా, వెంటనే భర్తీచేసేలా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. ఆరోగ్య రంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నాం కాబట్టే, రాష్ట్రంలో తొలిసారిగా మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డును సృష్టించాం. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కృష్ణబాబు, అజయ్‌జైన్, కార్యదర్శులు గుల్జార్, డాక్టర్ మంజుల, చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ గిరిజాశంకర్, ఆరోగ్యశ్రీ సీఈఓ హరేంధిరప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన బస్సు

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. సంస్థ తరఫున మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

మనవడిని ఇంటికి తీసుకెళ్తూ..

బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన కారు డ్రైవర్ యలమంద, భార్య ఝాన్సీరాణి, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల వయసున్న చిన్న కుమారుడికి మరో నాలుగు రోజుల్లో తన స్వగ్రామం జె.పంగులూరులో నామకరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఝాన్సీరాణి తల్లి మోటాని కుమారి (50) తన కుమార్తె, మనుమలను ముందస్తుగా ఊరికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఆమె స్వగ్రామం బాపట్ల జిల్లా, చీరాల ఉజిలిపేట నుంచి కోడలు సుకన్యను తీసుకుని వడ్డేశ్వరం వచ్చింది. సోమవారం ఉదయం కుమారి, ఆమె కూతురు, మనుమలు, కోడలు, మరో నలుగురు బంధువులతో కలసి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 8.25 గంటల సమయంలో 11, 12 నంబర్ ప్లాట్‌ఫాంల వద్ద చీరాల బస్సు కోసం ప్లాట్‌ఫాంపై కుర్చీలలో కూర్చున్నారు. అక్కడ విజయవాడ ఆటోనగర్ డిపోకు చెందిన గుంటూరు–విజయవాడ నాన్‌స్టాప్ బస్సు అదే ప్లాట్‌ఫాం వద్దకు వచ్చింది. డ్రైవర్ వి.ప్రకాశం ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరే క్రమంలో ఒక్కసారిగా బస్సు ముందుకు దూసుకొచ్చి ప్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ప్రయాణికులు కూర్చున్న కుర్చీలు, రెయిలింగ్‌లను ఢీకొట్టుకుంటూ ముందుకెళ్లింది. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ కొందరు ప్రయాణికులు తప్పించుకునే ప్రయత్నం చేయగా చిన్న మనవడిని ఒళ్లో కూర్చోపెట్టుకున్న కుమారి తప్పించుకోలేకపోయింది. దీంతో మనవడితో సహా బస్సు ముందు చక్రాల కింద పడి నలిగిపోయింది. వీరితో పాటు అక్కడే విధులు నిర్వర్తిస్తున్న గుంటూరు డిపో–2కు చెందిన అవుట్‌సోర్సింగ్ కండక్టర్ పెదనందిపాడు మండలం రావిపూడికి చెందిన యడ్లపల్లి వీరయ్య (23) కూడా మృత్యువాత పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ చిన్నారిని ఆసుపత్రికి తరలించే లోపు మృత్యువాత పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుంటూరుకు చెందిన ప్రయాణికుడు సురేష్‌కు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

సంతోషంగా కూతురి ఇంటికి వెళ్లి..

ఉజిలిపేటలో గత కొన్నాళ్లుగా నివాసం ఉంటున్న మోటాని కుమారి భర్త విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైరైన తర్వాత గతేడాది మరణించాడు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె, మనవళ్లను ఇంటికి తీసుకొస్తానని సంతోషంగా చెప్పి వెళ్లిన కుమారి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని తెలిసి ఇరుగుపొరుగు అంతా విషాదంలో మునిగిపోయారు. అంత్యక్రియల కోసం కుమారి మృతదేహాన్ని ఉజిలిపేటకు, ఏడు నెలల చిన్నారి మృతదేహాన్ని జె.పంగులూరుకు తరలించారు. తన కళ్లముందే తల్లి, కుమారుడు మృత్యువాత పడటంతో ఝాన్సీరాణి శోకసంద్రంలో మునిగిపోయింది. అమ్మా... బాబు లేవండిరా అంటూ వారి మృతదేహాలపై పడి ఏడవడం చూసి చుట్టూ ఉన్న ప్రయాణికులు సైతం కంటతడి పెట్టుకున్నారు.

రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం

బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, ప్రమాదానికి దారితీసిన కారణాలపై విచారణ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలని, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

హోం మంత్రి దిగ్భ్రాంతి

బస్సు ప్రమాద ఘటనపై హోం మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటన అత్యంత బాధాకరం, దురదృష్టమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్టీసీ ఎక్స్‌గ్రేషియా

బస్సు ప్రమాద ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, 24 గంటల్లో విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు చెప్పారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక లోపమా, మానవ తప్పిదమా అనే కోణంలో ఉన్నతాధికారుల కమిటీ విచారణ చేస్తుందన్నారు. ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేసిన ఆయన.. మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, గాయపడినవారికి పూర్తి వైద్య ఖర్చులు సంస్థ భరిస్తుందని ప్రకటించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పుతున్నామన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బస్సులు పూర్తి కండీషన్‌లో ఉన్నాయని నిర్ధారించుకున్నాకే నడుపుతున్నామని చెప్పారు.

ఎన్నికల సంగ్రామానికి ఎన్నారై సైన్యం



టొరంటోలో జరిగిన వైఎస్సార్‌సీపీ ఎన్నారై సభ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నవారు

- కెనడాలో ఘనంగా వైఎస్సార్ సీపీ ఎన్నారై సభ్యుల ఆత్మీయ సమావేశం
- జూమ్ ద్వారా మంత్రులు అంబటి, రోజా హాజరు

సాక్షి, అమరావతి: పేద ప్రజల సంక్షేమం కొనసాగాలంటే 'మళ్లీ రావాలి మన జగన్' అంటూ వైఎస్సార్‌సీపీ ఎన్నారై ఆత్మీయ సభా ప్రాంగణం ప్రతిధ్వనించింది. ఎన్నికల సంగ్రామంలో ఎన్నారై సైన్యం 'వై నాట్ 175' అనే నినాదంతో ప్రచారాన్ని హోరెత్తించేందుకు సిద్ధమైంది. కెనడాలోని టొరాంటోలో వైఎస్సార్‌సీపీ ఎన్నారై సభ్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమెరికా నుంచి వైఎస్సార్‌సీపీ విభాగం బాధ్యులు, మహానేత వైఎస్సార్, జననేత సీఎం జగన్ అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు జూమ్ యాప్ ద్వారా మాట్లాడుతూ.. ప్రపంచాన్ని భయపెట్టిన కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదర్కోవడంలో ఏపీ సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషించాయన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మేనిఫెస్టోను సుమారు 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదరికాన్ని పారదోలడంతో పాటు 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మిస్తున్నట్టు వివరించారు.

రూ.67 వేల కోట్లతో 127 పరిశ్రమలు: రోజా

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ.. రూ.67 వేల కోట్ల పెట్టుబడులతో 127 పెద్ద పరిశ్రమలు, 85వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇన్ఫోసిస్ వంటి సంస్థలు విశాఖకు రావడం ప్రభుత్వ ప్రతిభకు నిదర్శనమన్నారు. ఎన్నారైలు ఏపీలో కొత్త సంస్థలు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. ఎన్నారై గ్లోబల్ కన్వీనర్ వెంకట్ ఎస్. మేడపాటి మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ అభివృద్ధికి బాటలు వేస్తూ.. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన.. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తెలియజేసి వైఎస్ఆర్‌సీపీని అత్యధిక సీట్లు, భారీ మెజార్టీతో అధికారంలోకి తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పచ్చ మీడియాను ఎదుర్కొని ప్రజలకు సామాజిక మాధ్యమాల్లో వాస్తవాలను చెప్పడంలో ఎన్నారైల సహకారం అవసరమన్నారు. ఎన్నారై మెడికల్ మెడికల్ అఫైర్స్ కన్వీనర్ వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ కెనడా అడ్వైజర్ జగన్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ వేణు చుక్కలూరు, అమెరికా నుంచి వైఎస్సార్ సీపీ కన్వీనర్లు కేవీ రెడ్డి, కోరసపాటి శ్రీధర్ రెడ్డి (నాటా ప్రెసిడెంట్), రమేష్‌రెడ్డి, యూఎస్ కన్వీనర్లు రత్నాకర్, కేవీ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. గతేడాది ప్రమాదంలో మృతి చెందిన ఏపీ ఎన్నార్టీ సభ్యుడు రామ్‌కు ఘన నివాళులర్పించారు.

తెలంగాణ

కాంగ్రెస్, సీపీఐ పొత్తు ఖరారు

- కొత్తగూడెం సీటు.. రెండు ఎమ్మెల్సీలు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు ఖరారైంది. కొత్తగూడెం శాసనసభ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థికి సంపూర్ణ మద్దతునివ్వడంతోపాటు, రెండు ఎమ్మెల్సీ స్థానాలను సీపీఐకి ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీల జాతీయ నాయకత్వాలను సంప్రదించిన తర్వాత ఈ మేరకు ఒప్పందానికి వచ్చామని చెప్పారు. రేవంత్ సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌కు వెళ్లారు. ఏఐసీసీ పరిశీలకులు దీపాదాస్ మున్షీ, కార్యదర్శి విష్ణుదాస్ ఆయన వెంట ఉన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తదితరులతో పొత్తుపై చర్చించారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పేదల తరఫున నిలబడేందుకు, పెద్ద మనసుతో ముందుకు రావాలని తాము చేసిన విజ్ఞప్తికి సీపీఐ అంగీకరించిందని తెలిపారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. ఎన్డీఏ కూటమిని ఇండియా కూటమి ఓడించాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, సీపీఐల మధ్య స్పష్టమైన పొత్తు ఖరారైందన్నారు.

అజారుద్దీన్‌కు ఊరట

ముందస్తు బెయిల్ మంజూరు



సాక్షి, హైదరాబాద్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో కాంగ్రెస్ నేత అజారుద్దీన్‌కు ఊరట లభించింది. మల్కాజిగిరి కోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 41ఏ నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని అధికారులను కోర్టు ఆదేశించింది. విచారణకు సహకరించాలని అజారుద్దీన్‌కు స్పష్టం చేసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిటీ అజారుద్దీన్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మల్కాజిగిరి కోర్టులో అజారుద్దీన్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. పైవిధంగా ఆదేశాలు జారీచేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష — 28వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	12,056
నమోదైన ఓపీలు	58,11,548
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,42,85,270
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	85,530



నెల్లూరు రూరల్‌లోని 29వ డివిజన్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పాపారావు



శ్రీకాకుళం జిల్లా మందస మండలం బైరిసారంగపురంలో వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన గ్రామస్తులు



గుంటూరు జిల్లా తెనాలిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్న కమిషనర్ జస్వంతరావు



విశాఖ జిల్లా కొమ్మాది వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్నులో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు వెలివెల రాజేశ్

ఫోన్ ద్వారానే అన్ని విద్యుత్ సేవలు

- చాట్‌బోట్, వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఎస్పీడీసీఎల్
- వీటి ద్వారా అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణ.. వెంటనే పరిష్కారం
- అన్నదాతల కోసం రైతు నేస్తం అప్లికేషన్– రైతులు ఫోన్ ద్వారా ఇంటి నుంచే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవచ్చు
- విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి



ఎస్పీడీసీఎల్ నూతన వెబ్‌సైట్, రైతునేస్తం యాప్‌లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: వినియోగదారులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా సేవలందించాలనే లక్ష్యంతో.. ఫోన్ ద్వారానే అన్ని రకాల విద్యుత్ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఎస్పీడీసీఎల్ రూపొందించిన చాట్‌బోట్, రైతునేస్తం అప్లికేషన్లతోపాటు ఆధునీకరించిన ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం తిరుపతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు వీలైనంత వేగంగా సేవలందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇందులో భాగంగా ఎస్పీడీసీఎల్‌లో చాట్‌బోట్‌తోపాటు వాట్సాప్ నంబర్ 91333 31912ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. వీటి ద్వారా వినియోగదారులు తమ సమస్యలను అధికారులు/సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి.. వెంటనే పరిష్కరించుకోవచ్చని సూచించారు. అలాగే సీఎం జగన్ సూచనల మేరకు రైతు సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. రైతులు అడిగిన వెంటనే వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలనే లక్ష్యం మేరకు రైతునేస్తం అప్లికేషన్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వాట్సాప్ నంబర్ 91333 31912కు మెసేజ్ చేయడం ద్వారా కూడా రైతులు ఇంటి నుంచే వ్యవసాయ విద్యుత్ సర్వీసు తీసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసినప్పటి నుంచి సర్వీసు మంజూరు వరకు ప్రతి స్థాయిలోనూ ఒక్కో అధికారిని బాధ్యులను చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించి వినియోగదారుల ఫోన్‌కు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా సమాచారం అందుతుందన్నారు. కాగా, వైఎస్ జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నర ఏళ్లలోనే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3.70 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. గత టీడీపీ హయాంలో పెండింగ్‌లో ఉన్న 1.15 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను కూడా వైఎస్ జగన్ ప్రభుత్వమే మంజూరు చేసిందని చెప్పారు. గత నెలలో వచ్చిన మరో 16 వేల కనెక్షన్లను వచ్చే 15 రోజుల్లో మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శివప్రసాదరెడ్డి, ఐటీ అధికారులను మంత్రి పెద్దిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు, శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ రైతు భరోసా సాయం

53.53 లక్షల కుటుంబాలకు రూ.2204.77 కోట్లు

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి: వరుసగా ఐదో ఏడాది.. రెండో విడత వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఒక్కొక్కరికి రూ.4,000 చొప్పున 53.53 లక్షల మంది రైతన్నలకు రూ.2,204.77 కోట్ల రైతు భరోసా సాయాన్ని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతన్నల ఖాతాల్లో జమ చేయనున్నారు. వ్యవసాయం దండగ అనే గత పరిస్థితులను సమూలంగా మార్చి వ్యవసాయాన్ని పండుగ చేసి రైతన్నలకు అడుగడుగునా వెన్నుదన్నుగా నిలుస్తూ చెప్పిన దానికన్నా ముందుగా, మాట ఇచ్చిన దానికన్నా మిన్నగా.. రైతన్నలకు సాయం అందిస్తున్నారు. మేనిఫెస్టోలో ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేల సాయం అందిస్తామన్న హామీకి మిన్నగా.. ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 చొప్పున అంటే మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే రైతన్నకు అదనంగా రూ.17,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ పంట వేసే ముందు మేలో రూ.7,500, అక్టోబర్–నవంబర్ నెల ముగిసే లోపే ఖరీఫ్ కోతలకు, రబీ అవసరాల కోసం రూ.4,000, పంట ఇంటికి వచ్చే వేళ జనవరి/ఫిబ్రవరిలో రూ.2 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులు, ఆర్‌వోఎఫ్‌ఆర్ (అటవీ), దేవదాయ భూ సాగుదారులకు భూ యజమానులతో సమానంగా రైతు భరోసా కింద ప్రభుత్వం రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. తాజాగా జమచేస్తున్న రూ.2,204.77 కోట్లతో కలిపి వైఎస్సార్ రైతు భరోసా కింద ఒక్కో రైతు కుటుంబానికి రూ.65,500 చొప్పున ఈ నాలుగున్నరేళ్లలో రూ.33,209.81 కోట్ల పెట్టుబడి సాయం అందించింది.



మధ్యప్రదేశ్‌లోని కుక్షిలో ప్రియాంకా గాంధీని ఆహ్వానిస్తున్న మహిళలు



సోమవారం నామినేషన్ వేసేందుకు వెళ్తూ సోదరి విమలా దేవి ఆశీర్వాదం తీసుకుంటున్న రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్



మధ్యప్రదేశ్‌లోని దేవ్‌సర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా సంగీత కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చౌహాన్

నేడు ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ

- అసెంబ్లీలోని 20 స్థానాలకు పోలింగ్
- మాజీ సీఎం రమణ్‌సింగ్ సహా తేలనున్న పలువురు నేతల భవితవ్యం
- 60 వేల భద్రతా సిబ్బందితో భారీ బందోబస్తు



జగదల్‌పూర్‌లో పోలింగ్ విధులకు బయలుదేరుతున్న పోలీస్ సిబ్బంది

సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు సిద్ధమైంది. అసెంబ్లీలోని 90 స్థానాలకు గానూ 20 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. తొలి దశలో పోలింగ్ జరుగనున్న ఈ 20 స్థానాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో నిలిచిన 223 మంది అభ్యర్థుల్లో 25 మంది మహిళలున్నారు. తొలిదశలో మొత్తం 5,304 పోలింగ్ కేంద్రాల్లో 40.78 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 5,304 పోలింగ్ స్టేషన్లకు గాను 25,429 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) చెప్పారు. పది నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటలకు మొదలై మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. మరో 10 నియోజకవర్గాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మొదటి విడత పోలింగ్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం బస్తర్‌లోని 12 నియోజకవర్గాల్లో జరగనున్నందున అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తం 60 వేల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించారు. వీరిలో 40 వేల మంది కేంద్ర సాయుధ రిజర్వు బలగా(సీఏపీఎఫ్)లున్నాయి.

తొలిదశలో బరిలో ఉన్న అభ్యర్థులలో బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్‌సింగ్‌తో పాటు ఆయన మంత్రివర్గంలో పనిచేసిన ఐదుగురు మంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుత కేబినెట్‌లోని ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీ సహా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్‌లు బరిలో ఉన్నారు. తొలిదశలోని 20 స్థానాల్లో ముఖ్యంగా చిత్రకోట్, రాజ్‌నంద్‌గావ్, కవర్ధా, కొండగావ్, కొంటా, కేశ్‌కాల్, నారాయణ్‌పూర్, బిజాపూర్, అంతాగఢ్, దంతెవాడ నియోజకవర్గాలపై ప్రస్తుతం అందరి దృష్టి నెలకొంది. రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ మాజీ సీఎం రమణ్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గిరీష్ దేవాంగన్‌ల మధ్య నెలకొంది. రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ సీటు రమణ్ సింగ్‌కు బలమైన కోటగా పరిగణిస్తారు. 2008 నుంచి 2018 వరకు ఈ స్థానం నుంచి గెలుపొందారు. రమణ్‌సింగ్‌కు పోటీగా కాంగ్రెస్ సీనియర్ నేత గిరీష్ దేవాంగన్‌ను ఇక్కడి నుంచి పోటీకి దింపింది. చిత్రకోట్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి వినాయక్ గోపాల్ దీపక్‌కు సవాల్ విసిరారు. కొండగావ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మోహన్ మార్కంకు కాంగ్రెస్ మళ్లీ టికెట్ ఇవ్వగా.. రమణ్‌సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన లతా ఉసేండిని బీజేపీ రంగంలోకి దింపింది. కవర్ధా అసెంబ్లీ స్థానం నుంచి భూపేశ్ బఘేల్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మహమ్మద్ అక్బర్ కాంగ్రెస్ నుంచి బరిలో ఉండగా, అక్బర్‌ను ఓడించేందుకు బీజేపీ విజయ్ శర్మను రంగంలోకి దించింది. ఈ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా ఒడిశా–తెలంగాణ సరిహద్దులో ఉన్న కొంట అసెంబ్లీ 24 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధీనంలో ఉంది. కొంటా నుంచి వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కవాసీ లఖ్మాను కాంగ్రెస్ పోటీకి దింపింది.

మిజోరంలో నేడే పోలింగ్



మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో ఈవీఎంలు, ఇతర సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీకి నేడు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) మధూప్ వ్యాస్ చెప్పారు. అసెంబ్లీలోని 40 స్థానాలకు గాను 18 మంది మహిళలు, 27 మంది స్వతంత్రులు సహా 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు చెప్పారు. మొత్తం 8.57 లక్షల ఓటర్లకుగాను 1,276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. 149 పోలింగ్ కేంద్రాలు మారుమూల ప్రాంతాల్లోనూ, మరో 30 కేంద్రాలు, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో ఉన్నాయని చెప్పారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రంతో ఉన్న మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దులను మూసివేశారు. వీటితోపాటు రాష్ట్రంతో ఉన్న అస్సాంలోని మూడు జిల్లాలు, మణిపూర్‌లోని రెండు, త్రిపురలోని ఒక జిల్లా సరిహద్దులను మూసివేశారు. భద్రతా విధుల్లో మూడు వేల మంది పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సేవలను వినియోగించుకుంటున్నారు.

పంచతంత్రం

ధుంధాడ్‌లో దూకుడెవరిదో!

రాజస్తాన్‌లో రాజకీయంగా కీలక ప్రాంతం

ఇక్కడ పైచేయి సాధించిన పార్టీదే అధికారం

ధుంధాడ్ రాజస్తాన్‌కు అధికార కేంద్రంగా చెప్పకునే ప్రాంతం. రాష్ట్ర రాజకీయాలకు కూడా ఒకరకంగా ఆయువుపట్టు. పైగా గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ ఎక్కువ సీట్లు సాధించిన పార్టీయే అధికారంలోకి వచ్చింది. అందుకే 32 అసెంబ్లీ స్థానాలున్న ఈ ప్రాంతంపై ఆధిపత్యం కోసం కాంగ్రెస్, బీజేపీ ఈసారి కూడా హోరాహోరీగా తలపడుతున్నాయి. అయితే ధుంధాడ్ ఒక్కోసారి ఒక్కో పార్టీని అందలమెక్కిస్తూ వస్తోంది. ఈసారి ఇక్కడ ఎవరు దూకుడు ప్రదర్శిస్తారన్నది ఆసక్తికరంగా మారింది...



ధుంధాడ్ తూర్పు–మధ్య రాజస్తాన్‌లో ఉన్న ప్రాంతం. తొలుత ఇక్కడ 25 అసెంబ్లీ స్థానాలుండేవి. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం 32కు పెరిగాయి. 2008 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 11, కాంగ్రెస్ 13 సీట్లు గెలిచాయి. ఐదు సీట్లలో స్వతంత్రులు, రెండింట్లో బీఎస్పీ నెగ్గగా ఒకటి లోక్‌తాంత్రిక్ సమాజ్‌వాదీ ఖాతాలోకి వెళ్లింది. కానీ 2013లో మాత్రం బీజేపీ ఇక్కడ ఏకంగా 28 స్థానాలను గుప్పిట పట్టి కాంగ్రెస్‌ను కేవలం ఒక్క స్థానానికి పరిమితం చేసింది. నేషనల్ పీపుల్స్ పార్టీ 2, స్వతంత్రులు ఒక సీటు గెలుచుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పరిస్థితి మారింది. కాంగ్రెస్ 20 సీట్లు హస్తగతం చేసుకుంది. బీజేపీ ఆరింటితో సరిపెట్టుకుంది. స్వతంత్రులు కూడా ఆరు సీట్లలో గెలవడం విశేషం. ఇక్కడి పట్టణ ప్రాంతాలు సాంప్రదాయికంగా బీజేపీకి కంచుకోటలంటారు రాజకీయ విశ్లేషకుడు నారాయణ్ బరేథ్. ఇక్కడ ఎక్కువగా ఉండే బ్రాహ్మణ, బనియా సామాజికవర్గాల వాళ్లు బీజేపీని తమ పార్టీగా భావిస్తుండటమే ఇందుకు కారణమన్నారాయన. ధుంధాడ్‌లో పోయినసారి కాంగ్రెస్ ప్రదర్శన బాగున్నా ఈసారి మాత్రం పోటీ హోరాహోరీగా ఉండనుందని జోస్యం చెప్పారు. ''అయితే ఇరు పార్టీలనూ వర్గపోరు కుంగదీస్తోంది. దాన్ని సరి చేసుకుని ప్రచారంలో దూకుడుగా వెళ్లడంతో పాటు అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్త పడేవాళ్లదే ఈసారి ధుంధాడ్‌లో పైచేయి''అని అభిప్రాయపడ్డారు.

సీఎం అవకాశం ఇవ్వనందుకు ఈసారి కాంగ్రెస్‌పై బాగా అసంతృప్తితో ఉన్నారు. ధుంధాడ్‌లో చాలా నియోజకవర్గాల్లో గుజ్జర్ల ప్రాబల్యమున్న నేపథ్యంలో ఇది కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగానే మారే అవకాశముంది. మీనా, ఎస్సీ సామాజికవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ఆదరణ ఉంది. బ్రాహ్మణ, రాజ్‌పూత్, బనియాలు బీజేపీకి ఎప్పుడూ మద్దతుగా ఉంటూ వస్తున్నారు.

గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ధుంధాడ్ ప్రాంతంలో ఫలితాలు...
(మొత్తం స్థానాలు 32)

ఏడాది	2008	2013	2018
బీజేపీ	11	28	6
కాంగ్రెస్	13	1	20
ఇతరులు	8	3	6


(జైపూర్, దౌసా, టోంక్, సవాయ్ మధోపూర్, కరౌలి జిల్లాలు ధుంధాడ్ ప్రాంతం పరిధిలోకి వస్తాయి)

రాచరికపు ప్రభావం...

ధుంధాడ్ ప్రాంతంపై జైపూర్ రాజ వంశీకుల ప్రభావం చాలా ఎక్కువ. స్కూళ్లు, కాలేజీలు వంటి పలు విద్యా సంస్థలు, ఆస్పత్రులు తదితర నిర్మాణాలతో ప్రజల్లో రాజ కుటుంబం మంచి ఇమేజీ తెచ్చుకుంది. 1962 దాకా కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో స్వతంత్ర పార్టీ ఆవిర్భావంతో కథ మారింది. మహారాణి గాయత్రీ దేవి సారథ్యంలో ఆ పార్టీ ప్రాబల్యం పెరిగింది. ఆ ఇమేజీని సొమ్ము చేసుకునేందుకు బీజేపీ ఈసారి రాజ వంశానికి చెందిన తమ ఎంపీ దియా కుమారిని విద్యాధర్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దింపింది.

కుల ప్రభావం ఎక్కువ

హీరాలాల్ శాస్త్రి, టికారాం పలివాల్ రూపంలో రాష్ట్రానికి ఇద్దరు ముఖ్యమంత్రులను ఇచ్చిన చరిత్ర ధుంధాడ్ ప్రాంతానిది. ఇక్కడ కుల సమీకరణలు చాలా కీలకంగా ఉంటాయి. పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఆదరణ ఉండగా గ్రామీణ ప్రాంతాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుంటాయి. కాకపోతే గుజ్జర్లు తమ సామాజిక వర్గానికి చెందిన సచిన్ పైలట్‌కు 2018లో



సాక్షి బిజినెస్
మంగళవారం
7-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	595	64,959
నిఫ్టీ ▲	181	19,412

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,506	▲	27
డోజోన్స్	34,120	▲	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▲	1
డాక్స్	15,137	▼	53
షాంఘై	3,058	▲	28
నికాయ్	32,708	▲	759

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,053
బంగారం (99.5 స్వచ్ఛత)	60,808
వెండి (కేజీ)	72,037

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.78	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.20	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.05	90.13
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.45	56.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.45	55.82
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.19	62.45
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.76	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.33	12.40

ఎల్‌అండ్‌టీకి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్ట్



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి భారీ ఆర్డరు దక్కించుకున్నట్లు లార్సన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి విమానాశ్రయ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ (ఈపీసీ) కాంట్రాక్టు తమ అనుబంధ సంస్థ ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్‌కి లభించినట్లు వివరించింది. అయితే, కాంట్రాక్టు విలువ మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా రూ. 2,500 కోట్ల నుంచి రూ. 5,000 కోట్ల శ్రేణిలోని కాంట్రాక్టులను కంపెనీ భారీ ఆర్డర్లుగా పరిగణిస్తుంది. ప్రాథమికంగా ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల (ఎంపీపీఏ) హ్యాండ్లింగ్ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం ఉంటుందని, తర్వాత ఇది 12 ఎంపీపీఏకి పెరుగుతుందని సంస్థ తెలిపింది. కాంట్రాక్టు ప్రకారం ఏటీసీ టవర్, ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి (3,800 మీటర్ల దక్షిణ రన్‌వే, ట్యాక్సీవే, యాప్రాన్, ఎయిర్‌ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్) మొదలైన పనులు చేయాల్సి ఉంటుందని ఎల్‌అండ్‌టీ పేర్కొంది. కంపెనీ ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో భారీ విమానాశ్రయాల్లో నిర్మాణ పనులను నిర్వహిస్తోంది.

మార్కెట్ మూడోరోజూ ముందడుగు

- సెన్సెక్స్ 595 పాయింట్లు ప్లస్
- 19400 పాయింట్లపైకి నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్లలో సానుకూలతలు
- ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు డిమాండ్

ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 595 పాయింట్లు బలపడి 64,959 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181 పాయింట్లు పెరిగి 19,412 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 629 పాయింట్లు పెరిగి 64,993 వద్ద, నిఫ్టీ 192 పాయింట్లు బలపడి 19,423 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్ల రూ.549 కోట్ల షేర్లు అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.596 కోట్ల షేర్లు కొన్నారు. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్లు నమోదు కావడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఉండకపోవచ్చనే ఆశలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- 3 రోజుల్లో సెన్సెక్స్ 1,367 పాయింట్ల ర్యాలీతో రూ.7.95 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.318 లక్షల కోట్లకు చేరింది. సోమవారం ఒక్కరోజే రూ.2.95 లక్షల కోట్లు పెరిగింది.



- సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎస్‌బీఐ (0.65%), హెచ్‌యూఎల్ (0.29%), టాటా మోటార్స్ (0.29%), టైటాన్ (0.19%) షేర్లు మాత్రమే నష్టపోయాయి. ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, బజాజ్‌ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు 2% రాణించి టాప్ 5 గెయినర్లుగా నిలిచాయి.

బిగ్'సి'లో దీపావళి ధమాకా



హైదరాబాద్: దీపావళి సందర్భంగా బిగ్'సి' ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.10వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.4వేల వరకు కచ్చితమైన బహుమతి ఇస్తామని సంస్థ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా మొబైల్స్ కొనుగోలుపై రూ.9వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ ఇస్తామన్నారు. మొబైల్/స్మార్ట్‌టీవీ/ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఎస్‌బీఐ కార్డు ద్వారా రూ.3వేల వరకు, ఐడీఎఫ్‌సీ ద్వారా రూ.7,500 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ లభిస్తుందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు రాయితీ అందిస్తామన్నారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయొచ్చని బాలు వివరించారు.

అదానీ ఎనర్జీ లాభం భళా



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 46 శాతం జంప్‌చేసి దాదాపు రూ. 284 కోట్లకు చేరింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 194 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,032 కోట్ల నుంచి రూ. 3,421 కోట్లకు ఎగసింది.

పదేళ్లలో ఎలక్ట్రిక్ బ్రాండ్‌గా మారతాం

జపాన్ లగ్జరీ కార్ల సంస్థ లెక్సస్ ఇండియా ఎండీ నవీన్ సోనీ



- 2035 నాటికి పూర్తిగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలే కంపెనీ లక్ష్యం
- భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి
- మొత్తం కార్ల అమ్మకాల్లో ఇది ఒక శాతం మాత్రమే..
- అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 15 శాతం వరకు ఉంది
- ఒకసారి చార్జి చేస్తే 1000 కి.మీ. ప్రయాణించే ఎలక్ట్రిక్ కార్లు త్వరలో

సాక్షి, అమరావతి

స్థానిక సంప్రదాయాలు, కళలతో మమేకం అవడం ద్వారా భారతీయ మార్కెట్లో వేగంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జపాన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ లెక్సస్ ప్రకటించింది. ఇందుకోసం కారు కొనుగోలుదారులను అతిథులుగా గౌరవిస్తూ స్థానిక కళలకు ప్రాచుర్యం కల్పించే విధంగా విశాలమైన ప్రాంగణాలను మెరాకీ పేరుతో ఏర్పాటు చేస్తోంది. దేశంలో అయిదో లెక్సస్ మెరాకీని విజయవాడ సమీపంలో మంగళగిరి వద్ద ఏర్పాటు చేసింది. దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, ఇప్పటి వరకు ఈ రంగంలో ఆధిపత్యం ఉన్న జర్మనీ బ్రాండ్‌లకు జపాన్ బ్రాండ్ గట్టి పోటీనివ్వనుందని లెక్సస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ సోనీ తెలిపారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆయన మాటామంతీ...

అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే దేశీయంగా లగ్జరీ కార్ల అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయి?

దేశవ్యాప్తంగా ఏటా జరుగుతున్న కార్ల అమ్మకాల్లో కేవలం ఒక శాతం మాత్రమే లగ్జరీ కార్లు ఉంటున్నాయి. ఏటా సుమారుగా 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడవుతుంటే అన్ని లగ్జరీ బ్రాండ్‌లు కలిసి ఏటా 40,000 కార్లను విక్రయిస్తున్నాయి. అదే చైనాలో మొత్తం కార్ల అమ్మకాల్లో 15 నుంచి 16 శాతం, యూరప్‌లో 17 శాతం, అమెరికాలో 14 నుంచి 15 శాతం, జపాన్‌లో 3 నుంచి 5 శాతం అమ్మకాలు జరుగుతున్నాయి. దీని ప్రకారం చూస్తే వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 3 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది జరిగితే తలసరి ఆదాయం ప్రస్తుత స్థాయి నుంచి 6 రెట్లు పెరుగుతుంది. ఇదే దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్‌ను శాసించే ప్రధానాంశం.

కోవిడ్ తర్వాత పడిపోయిన లగ్జరీ కార్ల అమ్మకాల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది?

లాక్‌డౌన్‌కు ముందు ఏటా 40 నుంచి 42 వేల లగ్జరీ కార్లు అమ్ముడవుతుంటే అది కోవిడ్ సమయంలో 18,000 యూనిట్లకు పడిపోయింది. ఆ తర్వాత సాధారణ కార్ల అమ్మకాలు పెరిగినంత వేగంగా లగ్జరీ కార్ల అమ్మకాలు పెరగలేదు. 2021లో 26,000కు, 2022లో 36,000కు చేరిన లగ్జరీ కార్ల అమ్మకాలు ఈఏడాది 43,000 మార్కును దాటుతాయని అంచనా వేస్తున్నాం. ఇక ఇక్కడ నుంచి ఈ రంగం కూడా వేగంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి.

దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్లోకి ఆలస్యంగా ప్రవేశించిన లెక్సస్ మార్కెట్ అమ్మకాలను పెంచుకోవడానికి ఎటువంటి ప్రణాళికలతో ముందుకు వెళుతోంది?

రెండేళ్ల క్రితం కేవలం 4 నగరాల్లో ఉన్న లెక్సస్‌కు ఇప్పుడు 19 నగరాల్లో 26 షోరూమ్‌లు ఉన్నాయి. అమ్మకాల సంఖ్యను చెప్పలేను కానీ, దేశీయ మార్కెట్లో లెక్సస్ వేగంగా విస్తరిస్తోందని మాత్రం చెప్పగలను. కేవలం కొనుగోలుదారులుగా కాకుండా వారిని అతిథులుగా గౌరవిస్తూ దానికి అనుగుణంగా కార్ల డిజైన్లను రూపొందించి విక్రయించనున్నాం. ఇందుకోసం వేగంగా విస్తరించడం కంటే వినియోగదారు, షోరూమ్ భాగస్వాములు ప్రయోజనం పొందే విధంగా అడుగులు వేస్తున్నాం. గతంలో హైదరాబాద్‌కు పరిమితమైన లెక్సస్ ఇప్పుడు విజయవాడలో అడుగుపెడుతోంది. రానున్న కాలంలో విశాఖ, నెల్లూరు వంటి నగరాలకు విస్తరణ అవకాశాలను పరిశీలిస్తాం.

వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ కార్ల రంగంలో లెక్సస్ భవిష్యత్తు ప్రణాళికలేంటి?

ప్రస్తుతం హైబ్రీడ్ మోడల్స్‌లో ఎలక్ట్రిక్ కార్లను అందిస్తున్నాం. ఇప్పటికే సింగిల్ చార్జ్‌తో 1000 కి.మీ ప్రయాణించే విధంగా కాన్సెప్ట్ కారును విడుదల చేశాం. వాణిజ్యపరంగా ఈ కారును 2026 నాటికి విడుదల చేయనున్నాం. 2035 నాటికి లెక్సస్‌ను పూర్తి ఎలక్ట్రిక్ కార్ల బ్రాండ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

లాభాల్లోకి హెచ్‌పీసీఎల్

క్యూ2లో రూ. 5,827 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్‌లో నష్టాలను వీడి రూ. 5,827 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,476 కోట్ల నికర నష్టం ప్రకటించింది. తాజా సమీక్షా కాలంలో మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడటంతో లాభదాయకత పుంజుకుంది. ముడిచమురు ధరలు క్షీణించినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడం ఇందుకు సహకరించింది.

ఆదాయం డౌన్

ఈ ఏడాది క్యూ2లో హెచ్‌పీసీఎల్ మొత్తం ఆదాయం రూ. 1.13 లక్షల కోట్ల నుంచి రూ. 1.02 లక్షల కోట్లకు క్షీణించింది. క్యూ2లో ఇంధనాల ఉత్పత్తి 4.49 మిలియన్ టన్నుల నుంచి 5.75 ఎంటీకి బలపడింది. ఈ ఏడాది తొలి అర్థభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఒక్కో బ్యారల్‌పై స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్‌ఎం) 10.49 డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 12.62 డాలర్ల చొప్పున జీఆర్‌ఎం సాధించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు 1.6 శాతం బలపడి రూ. 262 వద్ద ముగిసింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో..'చిల్డ్రన్స్ డే' పోటీలు
1. Quiz on India's Freedom Movement 2. Photo Contest
పూర్తి వివరాలకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2023

సీఎస్ఐఆర్–యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్–2023కు నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహించనుంది.

» **సబ్జెక్టులు:** పరీక్షను ఐదు సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులు/నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్ ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ, థర్డ్‌జెండర్, దివ్యాంగ అభ్యర్థులు అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
» **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు అర్హతకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 01.07.2023 నాటికి 28 ఏళ్లు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయో సడలింపు వర్తిస్తుంది.
» **పరీక్ష విధానం:** పరీక్ష 200 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 02.12.2023 నుంచి 04.12.2023 వరకు.
» **పరీక్ష తేదీలు:** 26.12.2023, 27.12.2023, 28,12.2023.
» **వెబ్‌సైట్:** https://csirnet.nta.nic.in/ www.nta.ac.in

జేఈఈ(మెయిన్స్)-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీటెక్ సీట్లను జేఈఈ మెయిన్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేస్తారు. ఐఐటీల్లో చేరాలంటే జేఈఈ అడ్వాన్స్ రాయాలి. అందుకు జేఈఈ మెయిన్‌లో టాప్‌లో నిలిచిన 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది.

» **అర్హత:** అభ్యర్థులకు వయోపరిమితి నిబంధన లేదు. 2022, 2023లో 12వ తరగతి/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా 2024లో 12వ తరగతి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు జేఈఈ(మెయిన్)–2024కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 65 శాతం, మిగతా అభ్యర్థులకు 75 శాతం మార్కులు తప్పనిసరిగా రావాలని ఎన్‌టీఏ స్పష్టంచేసింది.

ముఖ్యమైన తేదీలు

సెషన్–1: జేఈఈ(మెయిన్)–జనవరి 2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023
» **పరీక్ష తేదీలు:** 2024 జనవరి నుంచి ఫిబ్రవరి 1 వరకు.

సెషన్–2: జేఈఈ(మెయిన్)–ఏప్రిల్ 2024
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.02.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**02.03.2024
» **పరీక్ష తేదీలు:**2024 ఏప్రిల్ 1 నుంచి 14 వరకు
» **వెబ్‌సైట్:** https://jeemain.nta.ac.in

ఎన్‌ఎఫ్‌ఎల్, నోయిడాలో 74 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 74
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్)–60, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్–ఏ)–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(లా)–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీబీఎం, పీజీడీఎం, సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ, ఎల్ఎల్‌బీ, బీఎల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.40,000 నుంచి1,40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 03.12.2023, 04.112.2023
» **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

కొచ్చి మెట్రోలో అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ) పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చి మెట్రోరైల్ లిమిటెడ్(కేఎంఆర్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** ఎంటెక్/ఎంఈ(ఫైర్ అండ్ సేఫ్టీ) లేదా బీఈ, బీటెక్ (సివిల్/మెకానిక్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి 1,60,000
» **దరఖాస్తులకు చివరితేది:** 15.11.2023.
» **వెబ్‌సైట్:** www.kochimetro.org

నీట్‌కు తుది సన్నద్ధత

నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ... నీట్-యూజీ! ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష! నీట్‌లో ఉత్తమ స్కోర్ సొంతం చేసుకుంటేనే మెడికల్ కోర్సుల్లో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది! ఇందుకోసం బైపీసీ విద్యార్థులు ఇంటర్‌లో చేరిన రోజు నుంచే ప్రిపరేషన్‌ప్రారంభిస్తారు. వీరంతా ఇప్పుడు తమ ప్రిపరేషన్‌ను మరింత పదును పెట్టుకోవాలి! కారణం.. నీట్ 2024కు పరీక్ష తేదీ ఖరారు కావడమే!!! ఈ నేపథ్యంలో.. నీట్-యూజీ-2024 పరీక్ష విధానం, బెస్ట్ ర్యాంకు సాధించేందుకు ప్రిపరేషన్ గైడెన్స్..

» 2024, మే 5న నీట్ పరీక్ష నిర్వహణ
» వైద్య కోర్సుల్లో ప్రవేశానికి మార్గం..నీట్
» ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సులకు ప్రామాణికం
» పక్కా ప్రిపరేషన్‌తో మెరుగైన స్కోర్ సాధించే అవకాశం



మెడికల్ కోర్సులను లక్ష్యంగా చేసుకుంటూ నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. నీట్–యూజీ- 2023కి దేశ వ్యాప్తంగా 20,38,596 మంది హాజరు కాగా.. నీట్–యూజీ–2022కి 13,66,945 మంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 2023లో ఏపీ నుంచి 68,578; తెలంగాణ నుంచి 72,842 మంది నీట్ రాసారు. అదే విధంగా 2022లో ఏపీ నుంచి 65,305 మంది; తెలంగాణ నుంచి 50,392 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంటే..మొత్తం నీట్ అభ్యర్థుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా దాదాపు 1.3 లక్షల మంది పోటీ పడుతున్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో మెడికల్ సీట్లు పెరుగుతుండటంతో 450 నుంచి 500 స్కోర్ వరకు సీట్లు లభిస్తున్నాయి.

అన్ని ఇన్‌స్టిట్యూట్స్‌కి నీట్ స్కోర్

దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నీట్–యూజీ స్కోర్‌నే ప్రామాణికం. ఆల్ ఇండియా కోటా పేరిట దేశంలోని అన్ని వైద్య కళాశాలల్లో 15 శాతం సీట్లను; రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సీట్లను; డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీలు.. ఇలా అన్ని కేటగిరీల యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో నీట్ స్కోర్ ఆధారంగానే అడ్మిషన్ కల్పిస్తున్నారు. అదే విధంగా ఆయుష్ కోర్సులుగా పిలిచే బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ తదితర కోర్సులకు కూడా నీట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటారు.

నీట్ యూజీ స్వరూపం

నీట్–యూజీ పరీక్ష మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో 720 మార్కులకు నిర్వహిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ.. ఇలా ప్రతి సబ్జెక్టు నుంచి 45 ప్రశ్నలు–180 మార్కులకు చొప్పున పరీక్ష జరుగుతుంది. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్లు (సెక్షన్ ఏ- 35 ప్రశ్నలు, సెక్షన్ బి–15 ప్రశ్నలు) ఉంటాయి. ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్–బిలోని 15 ప్రశ్నలకు గాను పది ప్రశ్నలకు సమాధానాలిస్తే సరిపోతుంది. అంటే.. సెక్షన్–బిలో ఛాయిస్ వెసులుబాటు ఉంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఉంటాయి. పరీక్షను పెన్–పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. అదే విధంగా ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటలు.

సమయం సద్వినియోగం

నీట్ నిర్వాహక సంస్థ ఎన్‌టీఏ.. గత రెండేళ్లుగా పరీక్ష తేదీని దాదాపు ఏడెనిమిది నెలల ముందే ప్రకటిస్తోంది. తాజాగా నీట్ యూజీ–2024 తేదీని కూడా ముందుగానే ప్రకటించింది. 2024, మే 5న నీట్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అంటే.. విద్యార్థులకు ఆరు నెలలకుపైగా సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని.. సబ్జెక్ట్‌ల వారీగా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా నీట్ ప్రిపరేషన్, రివిజన్, మాక్ టెస్ట్‌లకు హాజరు ద్వారా మెరుగైన స్కోర్ సాధించే వీలుంటుంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 మార్కులు లక్ష్యంగా

నీట్‌లో మెరుగైన స్కోర్ కోసం విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా సిలబస్ అంశాలను ఔపోసన పట్టాలి. అప్పుడే మంచి ర్యాంకు సొంతమవుతుంది. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా కృషి చేస్తే.. మెడికల్ కోర్సుల కల నెరవేర్చుకోవచ్చు.

బోర్డ్ పరీక్షలతో సమన్వయం

ప్రస్తుత సమయంలో నీట్–యూజీకి సన్నద్ధమయ్యే విద్యార్థులు బోర్డ్ పరీక్షలతో సమన్వయం చేసుకోవాలి. బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను కలిపి చదువుకోవాలి. బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించుకోవాలి. ఈ సమయంలో వీలైనంత మేరకు రివిజన్ చేయాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని.. దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువ అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి.దీని ద్వారా రివిజన్ సమయంలో సమయం ఆదా అవుతుంది.

నీట్-యూజీ-2024 ముఖ్య సమాచారం

- 2024, మే 5న నీట్ యూజీ పరీక్ష.
- 2024 ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి రెండో వారంలో నోటిఫికేషన్.
- పెన్–పేపర్ విధానంలో మూడు గంటల వ్యవధిలో 720 మార్కులకు పరీక్ష.
- నీట్‌లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల సీట్ల భర్తీ.
- 450 – 500 స్కోర్‌తో మెడికల్ సీట్లు పొందే అవకాశం.

సబ్జెక్ట్ వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు

నీట్ పరీక్ష తేదీ ఖరారైన నేపథ్యంలో.. సబ్జెక్ట్ వారీగా సన్నద్ధతకు, ఆయా సబ్జెక్ట్‌లలో దృష్టి పెట్టాల్సిన అంశాల వివరాలు..

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో బెస్ట్ స్కోర్

నీట్‌లో కొంత క్లిష్టమైన సబ్జెక్టుగా భావించే ఫిజిక్స్‌లో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

కెమిస్ట్రీలో రాణించేందుకు విద్యార్థులు ఆయా టాపిక్స్‌కు సంబంధించిన కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు వెయిటేజీ కొంత ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. దీంతో నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే..ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి స్కోర్‌కు ఆస్కారం ఉంటుంది.

బోటనీకి ఇలా

నీట్‌లో కీలకంగా భావించే బోటనీలో బెస్ట్ స్కోర్ కోసం విద్యార్థులు కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్,సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్‌పై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన(సమవిభజన,క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు,కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి.బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్,ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ.. ఈ అంశాలు

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 7 । నవంబర్ । 2023



కాలువలోకి స్కూల్ బస్సు పల్టీ


విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపు తప్పి కాలువలోకి పల్టీ కొట్టింది. స్థానికులు స్పందించి విద్యార్థులను రక్షించారు.

-IIలో▸



బాణసంచా విక్రయాలపై సమీక్ష

దీపావళి బాణసంచా విక్రయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలపై డీసీపీ విశాల్ గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. -IIలో▸



బస్టాండ్‌లో ఘోరం

బస్టాండ్(విజయవాడసెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో సోమవారం ఆర్టీసీ బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకొచ్చిన ప్రమాదంలో ఓ చిన్నారి సహా ముగ్గురు మృత్యువాత పడ్డారు.

న్యూస్‌రీల్

లేపాక్షిలో ప్రమిదల విక్రయాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళిని పురస్కరించుకుని గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో ప్రమిదల ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజర్ ఎం.సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తెప్పించిన టెర్రకోట (ఎర్రమట్టి) కుందన్ డిజైన్స్ మైనంతో నింపి తయారు చేసిన సరికొత్త అందమైన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు. ఈ దీపాలు గిఫ్ట్ బాక్సుల్లో లభ్యమవుతాయని తెలిపారు. దీపావళి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఓబీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కేసన శంకరరావు డిమాండ్ చేశారు. అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. శంకరరావు మాట్లాడుతూ.. మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలు ఎంత శాతమో లెక్క తేల్చాలన్నారు. అందులో ఓబీసీ మహిళలు ఎందరు, వారికి బిల్లుతో దక్కే వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లపై కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, వావిలాల సరళ దేవి, మార్కాపురపు కనకారావు, గుర్రపు ద్వారక శ్రీను, స్వాతి, హనుమంతరావు, షేక్ ముస్తఫా, గుర్రం జానకిరాం ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): నగరవాసులందరూ ఈ ఏడాది శుభప్రదమైన దీపావళిని స్వచ్ఛ దీపావళిగా జరుపుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పర్యావరణ హితమైన పదార్థాలనే వినియోగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని కోరారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో వీఎంసీ అధికారులతో కలిసి ఆయన సోమవారం స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దీపావళి పండుగను కాలుష్యాన్ని పెంచే కారకాలు కాకుండా, పర్యావరణ హిత పదార్థాలను ఉపయోగించి జరుపుకోవాలనే లక్ష్యంతో 'స్వచ్ఛ దివాళి.. శుభ దివాళి' నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

8న మినీ జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదో తేదీన స్థానిక జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్‌మేళా జరుగుతుందని ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్నోవా కంపెనీ, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, ఫోన్‌పే, అపోలో ఫార్మసీ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానికల్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం లభిస్తుందన్నారు. వివరాలకు 8142416211 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొండకు పండుగ శోభ

- వారం పాటు పండుగలు, విశేష పర్వదినాలు
- 12 నుంచి 18 వరకు ప్రత్యేక సేవలు
- 15న దుర్గమ్మకు గాజుల అలంకరణ
- 16న సరస్వతీ యాగం, 17న నాగుల చవితి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రికి పండుగ శోభ వచ్చింది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు పండుగలు, విశేష పర్వదినాల నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 12వ తేదీ దీపావళితో ప్రారంభమయ్యే వేడుకలు 18వ తేదీ వరకు కొనసాగుతాయి. వరసగా వారం రోజుల పాటు విశేష పర్వదినాలు, పండుగలు రావడం ఇదే తొలి సారి.

12న దీపావళి

దుర్గమ్మ సన్నిధిలో 12వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తారు. ఆలయ ప్రాంగణంలో బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

13న ఆర్జిత సేవలకు డిమాండ్

అమావాస్య నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో నిర్వహించే పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే ఖడ్గమాలార్చన, చండీ హోమంతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చనకు భక్తుల నుంచి డిమాండ్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా చండీ హోమానికి రికార్డు స్థాయిలో భక్తులు హాజరవుతారు. అమావాస్య రోజున సుమారు 300లకు పైగా టికెట్లను దేవస్థానం విక్రయిస్తుంది. యాగశాలలో అంతమంది భక్తులు కూర్చునే అవకాశం ఉండదు. ఆరుబయట కూర్చుని తమ గోత్రనామాలతో పూజ జరిగితే చాలు అని భక్తులు భావిస్తారు. దీపావళి అమావాస్య నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

14న కార్తిక మాసోత్సవాలు ప్రారంభం

ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి వారికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రారంభం కానున్నాయి. కార్తిక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామికి నిత్యం సహస్ర లింగార్చన, రుద్రహోమం, ఊంజల సేవ జరుగుతాయి. సాయంత్రం మల్లేశ్వర స్వామి ఆలయం, నటరాజ స్వామి ఆలయం వద్ద ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. స్వామికి కార్తిక సోమవారాలు, ఏకాదశి, మాస శివరాత్రి పర్వదినాల్లో బిల్వార్చన జరుగుతుంది. 26వ తేదీ కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, 27వ తేదీ సోమవారం కార్తిక పౌర్ణమి గిరి ప్రదక్షిణ, బిల్వార్చన జరుగుతాయి.

దుర్గమ్మకు గాజుల అలంకారం

యమ ద్వితీయ, భగిని హస్త భోజనాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గాజులతో విశేష అలంకరణ జరుగుతుంది. ఉత్సవంలో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌తో పాటు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని గాజులతో విశేషంగా అలంకరిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని రంగు రంగుల గాజులతో ముస్తాబు చేస్తారు. ఉత్సవం ముగిసిన అనంతరం అమ్మవారికి అలంకరించిన గాజులను క్యూలైన్‌లో భక్తులకు పంపిణీ చేస్తారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం అవసరమైన గాజులను దాతలు, భక్తులు దేవస్థానానికి విరాళంగా అందజేయొచ్చు.

16న సరస్వతీ యాగం

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని 16వ తేదీన ఇంద్రకీలాద్రిపై అమ్మవారి సన్నిధిలో సరస్వతి యాగాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఈ యాగాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహిస్తారు. యాగంలో పాఠశాల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. యాగంలో పాల్గొన్న విద్యార్థులకు అమ్మవారి చెంత ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను పంపిణీ చేస్తారు.

17న నాగుల చవితి

కార్తిక శుద్ధ చవితిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఈ నెల 17వ తేదీన స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని జంట నాగేంద్ర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతాయి.

18వ తేదీన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం ఈ నెల 18వ తేదీన జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై స్వామి కల్యాణ వేడుకను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు, కల్యాణం అనంతరం నిర్వహించే ఊరేగింపులో పల్లకి మోసేందుకు భక్తులు ఎంతో ఆసక్తిని చూపుతారు. స్వామి కల్యాణంలో పాల్గొన్న వారికి కల్యాణ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

కృష్ణా వర్సిటీ కబడ్డీ టోర్నీ విజేత ఎస్‌ఆర్‌ఆర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పురుషుల టోర్నమెంట్‌లో మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల జట్టు విజయకేతనం ఎగురవేసింది. మూడు రోజుల పాటు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సోమవారం జరిగిన పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల కబడ్డీ జట్టు నలంద డిగ్రీ కళాశాల జట్టుపై 46–26 స్కోరు తేడాతో విజయం సాధించింది. మొత్తం 14 కళాశాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో నూజివీడు డీఏఆర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, విజయవాడ నలంద డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానం, మైలవరం డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ట్రోఫీ అందజేశారు. కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ పోటీలను పర్యవేక్షించారు.

సౌత్‌జోన్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో కృష్ణా యూనివర్సిటీ కబడ్డీ పురుషుల జట్టు పాల్గొంటుందని డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి కె.వెంకట్ ఫణీంద్ర, వై.శామ్యూల్ రాజ్, బి.వెంకటేశ్వర్లు, ఎస్కే దావూద్, నూజివీడు డీఏఆర్ కళాశాల నుంచి పి.శ్యామ్ కుమార్, వి.వర ప్రసాద్, విజయవాడ నలంద డిగ్రీ కళాశాల నుంచి పి.గౌరినాయుడు, రంగ నవీన్‌రాజు, మైలవరం డాక్టర్ ఎల్ హెచ్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నుంచి కె.వెంకట నాగ సాయి, విజయవాడ పీబీఎస్ కళాశాల నుంచి కె.మహేష్, విజయవాడ కేబీఎన్ కళాశాల నుంచి ఎ.వేణు, గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల నుంచి ఎస్.ప్రవీణ్ సౌత్ జోన్ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు.



ఎస్ఆర్ఆర్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, కోటేశ్వరరావు, యుగంధర్

శతఘ్ని కవితా సంపుటి ఆవిష్కరణ


విజయవాడ కల్చరల్: అశోక్ మినీ కవితా రీతి యువకవులకు ఆదర్శమని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆలోచన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సింగంపల్లి అశోక్‌కుమార్ రచించిన శతఘ్ని మినీ కవితా సంపుటిని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ. మినీ కవితల ద్వారా రచయిత అశోక్‌కుమార్ సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను తనదైన రీతిలో వెలుగులోనికి తీసుకొచ్చారని అభినందించారు. రచయిత అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీశ్రీ సాహిత్య నిధి ద్వారా శ్రీశ్రీ సాహిత్యాన్ని, శ్రీశ్రీ మీద ఇతర కవులు రచించిన గ్రంథాలను ప్రచురిస్తున్నట్లు తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షుడు కె.దేవేంద్రర్ ఈ కవితా సంపుటిని ఆవిష్కరించారు. విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, జన సాహితీ అధ్యక్షుడు దివికుమార్, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు సత్యాజీ, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి ప్రసంగించారు. ఆలోచన సభ్యుడు బోడి ఆంజనేయరాజు, అరసం ఎన్టీఆర్ జిల్లా బాధ్యుడు అజయ్‌కుమార్ చలసాని పాల్గొన్నారు.



మినీ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

గుండె వైఫల్యానికి ఆధునిక వైద్యం

- కోవిడ్ తర్వాత పెరిగిన హార్ట్ ఫెయిల్యూర్ రోగులు
- మధుమేహం, రక్తపోటు, అధిక కొలస్ట్రాల్‌తో సమస్యలు
- ఆధునిక చికిత్సలతో ప్రాణాలు కాపాడుతున్న వైద్యులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్) ఇటీవల ఎక్కువగా వింటున్న పదం. కోవిడ్ తర్వాత గుండె వైఫల్యం చెందిన వారిని ఎక్కువగా చూస్తున్నట్లు హృద్రోగ వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరంలో ఉన్న కణాలకు ఆక్సిజన్, పోషకాలు అందించే ప్రక్రియ గుండె పంపింగ్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. గుండె తన సామర్థ్యానికి తగిన విధంగా రక్తాన్ని పంపింగ్ చేయలేని స్థితిని హార్ట్ ఫెయిల్యూర్ అంటారని వైద్యులు చెపుతున్నారు. కొందరిలో హార్ట్ పంపింగ్ సాధారణ స్థితిలో ఉన్నా ఫెయిల్యూర్‌కు దారితీయవచ్చని పేర్కొంటున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటాయని సూచిస్తున్నారు. గుండె పంపింగ్ తగ్గి హార్ట్ ఫెయిల్యూర్ అయిన వారితో పాటు, గుండె పంపింగ్‌లో తరచూ వ్యత్యాసాలు ఉండి హార్ట్ ఫెయిల్యూర్‌కు దారి తీసి సడన్ డెత్ అయిన వారిని కూడా చూస్తున్నామని వివరిస్తున్నారు. గుండె వైఫల్యాన్ని ముందుగా గుర్తించి, మెరుగైన చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సూచిస్తున్నారు. హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు అధునాతన చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

హార్ట్ ఫెయిల్యూర్‌కు కారణాలు

మధుమేహం, రక్తపోటు, గుండె రక్తనాళాల్లో పూడికలు, సైలెంట్ హార్ట్ ఎటాక్‌కు ప్రధాన కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. వైరల్ జ్వరం వచ్చిన వారిలో కూడా ఒక్కోసారి హార్ట్ ఫెయిల్యూర్‌కు దారితీయవచ్చని హెచ్చరిస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లోనూ హార్మోన్ల అసమతుల్యత వల్ల, కిడ్నీ రోగుల్లో హార్ట్ ఫెయిల్యూర్ ఎదురవ్వొచ్చని పేర్కొన్నారు. జెనటిక్‌గా కూడా హార్ట్ ఫెయిల్యూర్ సంభవించొచ్చని వివరిస్తున్నారు. గుండె వైఫల్యంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వారానికి పది మంది వరకు, ప్రయివేటు ఆస్పత్రులకు 100 మంది వరకూ కొత్త రోగులు వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

లక్షణాలు ఇవీ..

హార్ట్ ఫెయిల్యూర్ అయిన వారు ఆయాసం, నీరసం, నిస్సత్తువ, అలసట, కనీస వ్యాయామం చేయలేక పోవడం, కాళ్లలో, పొట్టలో వాపు, నీరు చేరడం వంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

తొలిదశలో గుర్తించడం ముఖ్యం

గుండె వైఫల్యం చెందిన వారిని తొలిదశలో గుర్తించడం చాలా ముఖ్యం. హార్ట్ ఫెయిల్యూర్‌కు గురైన వారికి సత్వర వైద్యం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చని కార్డియాలజిస్టులు సూచిస్తున్నారు. క్వాడ్రాపుల్ థెరపీ, ఎమర్జెన్సీ బైపాస్ శస్త్ర చికిత్సలతో హార్ట్ ఫెయిల్యూర్ రోగుల జీవన ప్రమాణాలను పదేళ్ల పాటు పొడిగించొచ్చని పేర్కొంటున్నారు. కొన్ని ప్రత్యేకమైన అత్యాధునిక డివైజ్‌లు, క్లిష్టతరమైన కరోనరీ ఇటర్వెన్షనల్ ప్రక్రియల ద్వారా హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు ఉపశమనం కలిగించొచ్చని సూచిస్తున్నారు.

తొలి దశలో గుర్తించాలి



ఇటీవల కాలంలో హార్ట్ ఫెయిల్యూర్ రోగులను ఎక్కువగా చూస్తున్నాం. కోవిడ్ తర్వాత రోగులు పెరిగారు. హార్ట్ ఫెయిల్యూర్ గుండె పంపింగ్ తగ్గడంతో పాటు, పంపింగ్ నార్మల్‌గా ఉన్న వారిలో కూడా జరుగుతుంది. తొలిదశలో గుర్తించడం ద్వారా ఫెయిల్యూర్‌ను నివారించేందుకు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ, అత్యవసర బైపాస్ సర్జరీతో పాటు, పలు డివైజ్‌లు ఉన్నాయి.

– డాక్టర్ బి.విజయ్‌చైతన్య, కార్డియాలజిస్టు, విజయవాడ ప్రభుత్వాస్పత్రి

● ముమ్మర సాధన



ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో ఉన్న డీవీఆర్, సీపీ క్రికెట్ మైదానాల్లో అండర్–19 పురుషుల అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీని ఈ నెల 13 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే విజయవాడ చేరుకున్న ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు కెప్టెన్ బెన్ మెక్కిన్నీ పర్యవేక్షణలో మూలపాడు స్టేడియంలో సోమవారం ముమ్మరంగా సాధన చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) పర్యవేక్షణలో జరిగే ఈ టోర్నమెంట్‌లో ఇండియా–ఏ, ఇండియా–బీ, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ జట్లు తలపడతాయి. బంగ్లాదేశ్, ఇండియా జట్లు ఈ నెల 11వ తేదీన విజయవాడ చేరుకుంటాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల నిర్ణయంపై హర్షం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని కేబినెట్ తీర్మానించడాన్ని ఏపీయూడబ్ల్యూజే స్వాగతించింది. త్వరితగతిన విధి విధానాలు రూపొందించాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వానికి విన్నవించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. 2019 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఒక తీర్మానంలో పేర్కొంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి అక్రెడిటేషన్ కలిగి ఉన్న పాత్రికేయులు అందరికీ స్థలాలు అందేలా నియమాలను రూపొందించాలని యూనియన్ కోరింది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలి

- ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్
- స్పందనలో 106 అర్జీల స్వీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పెండింగ్‌లో లేకుండా న్యాయమైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. జేసీ సంపత్‌కుమార్ డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనకు వచ్చిన ప్రజలను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిలో కొన్నింటిని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీకి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్నంగా పరిశీలించాలన్నారు. అపుడే సమస్యకు సరైన పరిష్కారం లభిస్తుందన్నారు.

మొత్తం 106 అర్జీలు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 106 అర్జీలు అందాయని జేసీ తెలిపారు. అత్యధికంగా రెవెన్యూ పరిధిలో 41 అర్జీలు అందాయి. శాఖల వారీగా చూస్తే పోలీస్ 30, డీఆర్‌డీఏ, బీసీ సంక్షేమంలో నాలుగు చొప్పున, మిగిలినవి మునిసిపల్, పట్టణాభివృద్ధి, విద్య, సర్వే అండ్ సెటిల్‌మెంట్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, విభిన్న ప్రతిభావంతులు, పౌర సరఫరాలు, దేవదాయ, విద్యుత్, హెల్త్, హౌసింగ్, ఉపాధి, గ్రామీణ నీటిసరఫరా, బ్యాంకులకు సంబంధించి అందాయని జేసీ తెలిపారు. వీటితోపాటు ఆన్‌లైన్‌లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టిపెట్టాలన్నారు. ఏపీ సేవ డాష్ బోర్డు, జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌లో జిల్లాకు చెందిన అర్జీలను పెండింగ్ లేకుండా ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజలను అడిగి సమస్యలు వారి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్

ప్రత్యేక అవసరాలు గల బాలలకు ట్యాబ్‌లు



ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. తన క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లకు కలెక్టర్ సోమవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 20 భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ విద్యార్థులు అవరోధాలను అధిగమించి బాగా చదువుకునేందుకు, విద్యా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ట్యాబ్‌లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు కార్యాలయం సమకూర్చిన 102 లెనోవో, శామ్‌సంగ్ ట్యాబ్‌లను దృష్టి, వినికిడి సమస్యలున్న వారికి, ప్రత్యేక అవసరాలు గల ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు అందించామన్నారు. ఉపయోగపడే గూగుల్ యాప్స్‌తో పాటు టాక్‌బ్యాక్, డాల్ఫిన్ ఈజీ రీడర్, ఇన్‌స్టా రీడర్, కేపీవీఐ–పీటీఎస్ తదితర యాప్‌లు ట్యాబ్‌లో ఇన్‌స్టాల్ చేశారన్నారు. ఆడియో పాఠాలు, ఆన్‌స్క్రీన్ బ్రెయిలీ కీబోర్డు వంటి వాటితో ఎలాంటి ఇబ్బందీ లేకుండా దృష్టి, వినికిడి సమస్యలున్న వారు చదువుకుని, భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవచ్చని పేర్కొన్నారు. లెర్నింగ్ డిజార్డర్ (డిస్‌లెక్సియా) ఉన్న విద్యార్థులకు కూడా ఈ ట్యాబ్ బాగా ఉపయోగపడుతుందన్నారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎల్.వెంకటేశ్వరరావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సదారత్, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో 520 జేఏఎస్ శిబిరాలు పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 520 శిబిరాలు నిర్వహించినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జేఏఎస్ శిబిరాలపై సోమవారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 143 వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు ఈ శిబిరాల్లో 2,30,375 ఓపీ నమోదైనట్లు వివరించారు. వీరిలో 12,536 మందికి ఈసీజీ, 1,33,512 మందికి బీపీ, 1,08,185 మందికి ఆర్‌బీఎస్, 80,953 మందికి హెచ్‌బీ, 9,289 మందికి యూరిన్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరం మేరకు మలేరియా, డెంగీ, 4డీ స్క్రీనింగ్ తదితర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కంటి వెలుగు కింద 22,710 మందిని పరీక్షించారన్నారు. జనవరి 1 నుంచి ప్రతి మండలంలోనూ నెలకు నాలుగు చొప్పున జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించాలన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త జె.సుమన్, డీఈఓ సీవీ రేణుక, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి ఫొటోలు వాట్సాప్, ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు చేసి తాము ప్రేమించుకుంటున్నామని ప్రచారం చేస్తున్న యువకుడిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ఎల్ఐసీ కాలనీకి చెందిన ఎం.సరస్వతి వన్‌టౌన్‌లోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. మూడేళ్ల కిందట హలో యాప్‌లో కర్నూలుకు చెందిన విజయ్ పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడప్పుడు విజయవాడకు వచ్చి సరస్వతితో కలిసి పీవీపీ మాల్, రైల్వే స్టేషన్ ఇలా పలు చోట్లకు తిరిగారు. ఇద్దరూ కలిసి ఫొటోలు దిగారు. కొంత కాలంగా యువతి ఫోన్ వాడడం మానేసింది. నెల క్రితం తిరిగి ఫోన్ వాడడంతో విజయ్ తన వద్ద ఉన్న ఫొటోలు ఆమె తండ్రి వాట్సాప్, స్నేహితుల ఇన్‌స్టాకు పంపి తాము ప్రేమించుకున్నామని, పెళ్లిచేసుకుబోతున్నామని చెప్పసాగాడు. దీంతో ఆమె విజయ్‌తో మాట్లాడడం మానేసింది. మళ్లీ అదేపనిగా యువతి తండ్రికి, స్నేహితులకు ఫొటోలు పంపుతుండడంతో విసిగిపోయిన ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్కంఠగా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ సీఎం జగన్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం మెయిన్ డ్రా మ్యాచ్‌లు రెండో రోజు ఉత్కంఠగా సాగాయి. ఈ మ్యాచ్‌లు బందరురోడ్డులోని దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, గురునానక్ నగర్‌లోని సాయి సందీప్ అకాడమీల్లో జరిగాయి. ఆంధ్రా రంజీ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ విజయసారథి, సీనియర్ క్రికెటర్ మురళీకృష్ణంరాజు దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లను వీక్షించారు.



టోర్నమెంట్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

- అండర్ 15 బాయ్స్ సింగిల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన ప్రతీక్ కౌండిల్య, మహారాష్ట్రకు చెందిన అవధూత్, తెలంగాణకు చెందిన జి.శ్రావణ్‌కుమార్, మహారాష్ట్రకు చెందిన హర్షిత్ మెయిన్ డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో తమిళనాడుకు చెందిన దిశ, ఢిల్లీకి చెందిన రిషికా నంది, కర్ణాటకకు చెందిన నిధి, గుజరాత్‌కు చెందిన సోనియా గాలా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దివ్యశ్రీ మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్ ప్రవేశానికి అర్హత పొందారు.
- అండర్-15 బాయ్స్ డబుల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన నిలీష్ జయరాజ్, హర్థిక్ మహంతి, కేరళకు చెందిన కిరణ్ నాగూంచి, జావెద్ రహమాన్, తెలంగాణకు చెందిన షాహీద్ ఇబ్రహీం పీర్, సూర్య మెయిన్ డ్రా మ్యాచ్‌లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్-15 బాలికల డబుల్స్ విభాగంలో కర్ణాటకకు చెందిన దీపక్ రాజ్ అతిథి, వర్థిని, తెలంగాణకు చెందిన బాల మన్విత్‌ా రెడ్డి, అమృత, తమిళనాడుకు చెందిన మోక్షిత, రాజరాజేశ్వరి ప్రధాన డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన నిషా కౌర్, తమిళనాడుకు చెందిన రీమా పర్వీన్, హర్యానాకు చెందిన మాధవీ నాయర్, ఢిల్లీకి చెందిన ఇషితా ప్రధాన డ్రా మ్యాచ్‌ల్లో రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.
- అండర్-17 బాయ్స్ డబుల్స్ విభాగంలో పాండిచ్చేరికి చెందిన మిథిలేష్, హరీష్ రాఘవేంద్రన్, తమిళనాడుకు చెందిన బుద్విన్ సోల్‌బర్గ్, సందీప్ కుమార్, రాజస్థాన్‌కు చెందిన జగజ్జీత్ సింగ్, ఆర్యన్ శర్మ మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో మూడో రౌండ్‌కు అర్హత పొందారు.
- అండర్-17 బాలికల డబుల్స్ విభాగంలో మహారాష్ట్రకు చెందిన సౌర్య మాధవి, ద్రాక్షాయణి పాటిల్, తెలంగాణకు చెందిన కీర్తి, పి.వర్ణ, ఢిల్లీకి చెందిన ఆయాన్ బిషిత్, ఇషితా, కర్ణాటకకు చెందిన జాడి అనిల్, దివ్య మెయిన్ డ్రా మ్యాచ్ రెండో రౌండ్‌లో ప్రతిభ చూపి మూడో రౌండ్‌కు అర్హత పొందారు.

బాణసంచా విక్రయాలపై సమీక్ష

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలపై డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రెవెన్యూ, ఫైర్, విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులతో బాణసంచా విక్రయ ప్రదేశాలలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాణసంచా విక్రయదారుల లైసెన్స్‌ల కోసం ఆయా ప్రదేశాలలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని డిపార్టుమెంట్ల సమన్వయంతో ఒక సింగిల్ విండో కౌంటర్ ఏర్పాటు గురించి ఆయా శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేయటం, బాణసంచా విక్రయ ప్రదేశాలలో దుకాణానికి, దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం, ఇసుక బకెట్ల ఏర్పాటు, స్మోక్ డిటెక్టివ్ పరికరాల ఏర్పాటు, ఫైర్ ఇంజన్లు, వాటర్ ట్యాంక్‌లు, ఆయా ప్రదేశాలలో ప్రజలు ఇబ్బంది లేకుండా లోనికి, బయటకు వచ్చేందుకు విశాలమైన మార్గాలపై చర్చించి పలు మార్గదర్శకాలను సూచించారు. ఇటువంటి సింగిల్ విండో విధానాన్ని సద్వినియోగం చేసుకుని విక్రయదారులందరూ సక్రమమైన తాత్కాలిక అనుమతులు పొంది వారి వ్యాపారాలు చేసుకోవల్సిందిగా డీసీపీ విశాల్‌గున్ని


బాణసంచా విక్రయ ప్రదేశాలను తనిఖీ చేసి సూచనలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్

సూచించారు. బాణసంచా విక్రయదారులు ఈ నెల 9 వరకు ఆయా ప్రాంతాలలోని తహసీల్దార్ కార్యాలయ సింగిల్ విండో కౌంటర్‌లో అర్జీ పెట్టుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం డీసీపీ విశాల్‌గున్ని, సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఇతర శాఖల అధికారులతో కలసి బాణసంచా విక్రయ ప్రదేశాలు వజ్రా గ్రౌండ్స్, సితార సెంటర్ సమీపంలోని విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, భాస్కరరావు, సీహెచ్ రవికాంత్, సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి శంకరరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ పి.శ్రీధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర జట్టుకు కృష్ణా విద్యార్థులు

ఒంగోలు: అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. బాలుర రాష్ట్ర జట్టుకు ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన కె.హేమంత్ కుమార్ (కృష్ణా), బాలికల జట్టుకు కె.రిషిత ఎంపికయ్యారు.

విద్యార్థులకు ప్రత్యేకంగా జవాన్ సినిమా ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడతూర్పు): సినీపోలీస్, రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ శాఖ, లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 200 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పీవీపీ మాల్‌లోని సినీ పోలీస్ థియేటర్లో సోమవారం జవాన్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సినీ పోలీసు సంస్థ సెంటర్ హెడ్ మురళీ కృష్ణ మాట్లాడుతూ భావిభారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు దేశంలోని 38 పట్టణాలలో 10 వేల మందికి పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జవాన్ సినిమాను చూపించినట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ ఇండియా, విజయవాడ చైర్మన్ ధీరజ్ సింగ్ మాట్లాడుతూ అమ్మ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3వేల పాఠశాలల తరగతి గదులను నిర్మించామన్నారు. బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ పోలీసు సంస్థ కార్యదర్శి శ్రీకర్, కౌశిక్, సభ్యులు వినీల, ఐశ్వర్య, ప్రతిభా ఆఫ్ సెట్ ప్రింటర్స్ చైర్మన్ కాట్రగడ్డ మోహన్ పాల్గొన్నారు.


పీవీపీ మాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మురళీకృష్ణ, ఇతర ప్రతినిధులు

కాలువలోకి స్కూల్ బస్సు పల్టీ

కోడూరు: విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపు తప్పి కాలువలోకి పల్టీ కొట్టిన ఘటన కోడూరు మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... అవనిగడ్డలోని ఓ ప్రయివేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం పిట్టల్లంకలో విద్యార్థులను ఎక్కించుకుని అవనిగడ్డకు బయలుదేరింది. అయితే వి.కొత్తపాలెం- విశ్వనాథపల్లి గ్రామాల మధ్యకు రాగానే స్కూల్ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ బస్సును అదుపు చేయలేకపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి పల్టీ కొట్టింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనచోదకులు, సమీప పొలాల్లోని రైతులు వెంటనే స్పందించి బస్సు కిటికీల్లో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. వంతులవారీ విధానం కారణంగా కాలువలో సాగునీరు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని, ఏవిధమైన గాయాలు కాలేదని ఎస్ఐ తెలిపారు. బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రమాదంలో విద్యార్థులంతా సురక్షితంగా బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్

మల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధి పనులు త్వరలో పూర్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు త్వరలో పూర్తి కానున్నాయని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను సోమవారం ఆయన దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్పతో కలిసి పరిశీలించారు. ఆలయ శిఖరం పనులతో పాటు ఆలయం చుట్టూ నిర్మిస్తున్న రాతి మండపం, ఆలయం లోపల జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్ శర్మ, పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ, ఇతర దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జి.కొండూరు: ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే...తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం కట్టుగూడెంకు చెందిన రహీమ్ పటాన్, ఎస్కే నూర్అలీ ఇద్దరూ తమ కారులో విజయవాడ వైపు నుంచి తిరువూరు వైపు సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో వెళ్తున్నారు. అదే సమయంలో కుంటముక్కల వైపు నుంచి వస్తున్న లారీని కుంటముక్కల గ్రామ శివారులోని 30వ నంబరు జాతీయ రహదారిపై సాయిబాబా దేవాలయం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


కుంటముక్కల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

వెయిట్ లిఫ్టింగ్‌లో మైలవరం విద్యార్థుల ప్రతిభ

మైలవరం: ఉమ్మడి కృష్ణా అండ్ ఎన్టీఆర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఏడు బంగారు పతకాలు, మూడు రజత, ఒక కాంస్య పతకాలను సాధించి విజయకేతనం ఎగురవేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరంలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ పోటీలు ఉమ్మడి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకి ఉషోదయ పబ్లిక్ స్కూల్‌లో జరిగాయన్నారు. ఈ పోటీలలో ఎస్.ప్రియాంక 56 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, కె.పల్లవి 48 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్, ఎ.తేజస్విని 82 కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, డి.జాహ్నవి 79 కిలోల కేటగిరీలో గోల్డ్ మెడల్, వై.రిషితశ్రీ 85కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, ఎ.అంజనాశ్రీ 56కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్, ఎన్ నాగసాయిశ్రీ 50కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్, కె.నవచైతన్య 66కిలోల కేటగిరిలో కాంస్య పతకం, సీనియర్స్ విభాగంలో ఎ.తేజస్విని 82 కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, డి.జాహ్నవి 79కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్, వై.రిషితశ్రీ 85కిలోల కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అసిస్టెంట్ పీడీ ఎం.బేబీరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, ఎస్.దుర్గారెడ్డిని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

ఘనంగా ముగిసిన సాహిత్య, సాంస్కృతిక పోటీలు

గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న అంతర్ రాష్ట్రాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. సాహిత్య, సాంస్కృతిక విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మౌంట్‌ఫోర్ట్(నాగపూర్) స్కూల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథి హైదరాబాద్ ప్రావిన్షియల్ సుపీరియర్ బ్రదర్ షైన్ అలెక్స్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల నుంచి 27 పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్వేచ్ఛా వాతావరణంలో స్నేహపూర్వకంగా ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. విభిన్న ప్రాంతాలు, మతాలు, భాషల వారు ఒకే వేదికపై చేరి భారతీయ సాహిత్య, సంస్కృతులను చాటి చెప్పడం గొప్ప విషయమన్నారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీధర్, డాక్టర్ టీఎస్‌వీ సత్యనారాయణ, పూణే ప్రావిన్షియల్ సుపీరియర్ బ్రదర్ జయకో గర్వాసిస్, హైదరాబాద్ లిటిల్‌ఫ్లవర్ ప్రిన్సిపాల్ బ్రదర్ షాజన్ ఆంటోని, సీనియర్ బ్రదర్ జిమ్మీ కురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్ పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకున్న నాగపూర్ విద్యార్థులు

క్లుప్తంగా

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. 15వ డివిజన్ లోని 72వ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ శిబిరాన్ని బెల్లం దుర్గ ప్రారంభించారు. 738 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. జోగానందరావు, పూజిత, అనురాధ, శివాని, తో పాటు పలువురు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మొక్కలు తొలగింపు

ఆటోనగర్(విజయవాడతూర్పు): 16వ డివిజన్ దళితుల శ్మశానవాటికలో ఏపుగా మొక్కలు పెరిగిన మొక్కలు సోమవారం తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల అంత్యక్రియలు చేసుకోవడానికి ఇబ్బందులు తొలగాయని అంటున్నారు. గత నెల 27వ తేదీన శ్మశానవాటికలో నెలకొన్న ఇబ్బందులపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించారు.

రోగులకు మందుల కిట్లు పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా రాణిగారితోట, 17వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం శాంపిల్ బిల్డింగ్‌లో 80 వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు పరిశీలించారు. రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో నీహాల్‌కు బంగారు పతకం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు తణకులోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 35వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రోలింగ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో అండర్–14 ఇన్‌లైన్ హాకీ స్కేటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో తమ అకాడమీలో శిక్షణ పొందిన నగరానికి చెందిన తోట నీహాల్ ప్రతిభ చూపి బంగారు పతకం పొందాడని శరత్ రోలర్ స్కేటింగ్ అకాడమీ కోచ్ శరత్ కుమార్ ప్రకటనలో తెలిపారు. బంగారు పతకం పొందిన నీహాల్ అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మొగల్రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధు గార్డెన్ ఏరియా, ఏఎస్.రామారావు రోడ్డు, శాంతినగర్, జమ్మిచెట్టు సెంటర్, జమ్మిచెట్టు రోడ్డు (పీవీపీ రోడ్డు), ఉడ్‌పేట, బాడవపేట, వాటర్ ట్యాంక్ రోడ్డు, శిఖామణి సెంటర్, మధుగార్డెన్ ఏరియా, జయరాజ్ స్ట్రీట్, నైస్ బార్ రోడ్డు, రామశాస్త్రి వీధి, గిరిపురం, రెడ్ సర్కిల్, అంబేడ్కర్ కాలనీ, కస్తురిబాయి పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

చరిత్రలో చిరస్థాయిగా ప్రజా సంకల్పయాత్ర

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజా నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కృష్ణలంక, 22వ డివిజన్‌లోని మలేరియా హాస్పిటల్ వద్ద మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జనరంజక పాలన చూస్తుంటే సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి ఉండే తీరు మడమ తిప్పని నైజం కళ్లకు కనిపిస్తుందని చెప్పారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతూ ఒక భరోసా కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి వారి కష్టాలను కళ్లారా చూసి అండగా ఉంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎండనక వాననక లెక్కచేయకుండా తమ వద్దకు వచ్చిన జగనన్నను ప్రజలు అక్కున చేర్చుకొని భారీ విజయాన్ని అందించడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఏ నమ్మకంతో ప్రజలు గెలిపించారో ఆ నమ్మకం నిలబెట్టుకునేలా పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు అమలు చేశారన్నారు. అదే దీమాతో రాబోయే ఎన్నికల్లో 175కి 175 సీట్లలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, గాంధీ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జోగారాజు, వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ షేక్ మెహబూబ్ వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఫజులుద్దీన్, అంజిరెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని 111 వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనలు చేస్తూ అనేక విప్లవాత్మకమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అందరి అదృష్టమన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు తనకు చాలా గర్వంగా ఉందన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే 55 వార్డు సచివాలయాల పరిధిలో క్యాంప్‌లు పూర్తయ్యాయని తెలిపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రతి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రజలందరి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ క్యాంప్‌లు కేవలం ఒక్కరోజు నిర్వహించి తీసేవి కావని, రోగం పూర్తిగా నయమయ్యే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, గాంధీ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జోగారాజు, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ షేక్ మెహబూబ్, జోనల్ కమిషనర్ కృష్ణ, డాక్టర్ సృజన, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఫజులుద్దీన్, నాగిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనలో 84 ఫిర్యాదులు స్వీకరణ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ పి.వెంకటరత్నం సోమవారం కార్యాలయంలో పోలీసు స్పందన నిర్వహించారు. బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 12, సివిల్ వివాదాలపై 15, వివిధ మోసాలపై 10, ఈవ్ టీజింగ్‌పై 1, త్వరితగతిన పరిష్కరించాల్సిన కేసులపై 3, ఇతర చిన్న చిన్న వివాదాలు, సమస్యలు, సంఘటనలకు సంబంధించినవి 18 ఫిర్యాదులు స్వీకరించారు.

బస్సు ప్రమాదం బాధాకరం

గుణదల(విజయవాడ తూర్పు): విజయవాడ బస్టాండ్‌లో బస్సు ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెషిన్లతో పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫుట్‌పాత్, డివైడర్‌కు ఇరువైపుల రోడ్డు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఏలూరు రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికారిక ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సబ్ కలెక్టరేట్ సర్వీస్ స్టేషన్‌ను సందర్శించి వాహనాల డీజిల్ ఫిల్లింగ్ విధానాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందిని అడిగి ఫ్యూయల్ డిస్ట్రిబ్యూషన్ రికార్డును పరిశీలించారు. వాహనాలు ఏ సమయంలో డీజిల్ ఫిల్లింగ్ కోసం వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ కమిషనర్ అరుణ్‌కుమార్

పటమట(విజయవాడతూర్పు): వినియోగదారుల రక్షణ చట్టాలపై పాఠశాల స్థాయిలో కన్స్యూమర్ క్లబ్‌ల ద్వారా తెలుసుకోవాలని సివిల్ సప్లైస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. పటమటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8,9 తరగతి విద్యార్థులకు సోమవారం వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తూనికలు, కొలతలు, పదార్థం/వస్తువు ముగింపు కాలపరిమితి, ఎంఆర్‌పీ,(గరిష్ట ధర), ఐఎస్ఐ మార్కు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మరో అతిథిగా పాల్గొన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) ప్రొఫెసర్ సురేష్ మిశ్రా వినియోగదారులుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి కుటుంబంలో వినియోగదారుల హక్కులపై అవగాహన ఏర్పడాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా విద్యార్థులను చైతన్య పరచి మెరుగైన సమాజాన్ని పొందగలమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు అధికారి పీవీవీ సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహనబాబు, జిల్లా ఆహార భద్రత అధికారి గౌస్‌మొహిద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమసాగర్, కన్స్యూమర్ క్లబ్ టీచర్ సునీత, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు టీడీఆర్ బాండ్ల సమస్య పరిష్కరించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన టీడీఆర్ బాండ్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచిన వాటిని పలువురు బిల్డర్లు కొనుగోలు చేయగా, ఆ బాండ్లు సమర్పించిన అప్లికేషన్‌లను ప్రభుత్వం నిలిపివేసిందని క్రెడాయ్ ప్రతినిధులు రాష్ట్ర మున్సిపల్ , అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఆ బాండ్లతో నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లకు అక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని క్రెడాయ్ ప్రతినిధులు ఆమెను కోరారు. కాగా శ్రీలక్ష్మిని కలిసిన వారిలో క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణారావు, విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు డి.రాంబాబు, ప్రధాన కార్యదర్శి వరదా శ్రీధర్ తదతరులు ఉన్నారు.

17 మందికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే 17 మందిని అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి కె.సురేష్ బాబు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

స్పందన సమస్యలకు త్వరగా పరిష్కారం



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి అధికారులు దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 23 అర్జీలు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై –7, టౌన్ ప్లానింగ్ –11, రెవెన్యూ ఒకటి, ప్రజారోగ్యం–3, ఎస్టేట్ విభాగంపై ఒకటి వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన ప్రత్యేక డివిజన్లలో నిరంతర పర్యవేక్షణ చేస్తుండాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన నలంద విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని గుంటుపల్లి రైల్వే ఇనిస్టిట్యూట్ కాలనీలో ఈ నెల 5న జరిగిన నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పాల్గొనగా, నలంద విద్యార్థులు పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో 3వ తరగతి విద్యార్థి ఉద్భవ్ తేజ్, 4వ తగరతి విద్యార్థి లిఖిత్, దావన్ రిషి, 5వ తరగతి విద్యార్థి హిమశ్రీలు ప్రథమ బహుమతులు పొందినట్లు తెలిపారు. కాగా 3వ తరగతి విద్యార్థిని నిత్యశ్రీ, 4వ తరగతి విద్యార్థి సిద్ధార్థ్ జైన్, శశి శ్రీరామ్‌చరణ్‌లు తృతీయ బహుమతులు పొందారని పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో వెన్నెల, రేవంత్, పునర్విక, తమన్న, రాజపురోహిత్‌లు ప్రథమ బహుమతులు పొందగా, సౌర్య రాజపురోహిత్, చరిష్‌లు ద్వితీయ బహుమతి, జ్యోషిక, గణేష్‌లు తృతీయ బహుమతులు పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బహుమతులు పొందిన విద్యార్థులతో పాటు, కోచ్ పివికెయస్ హర్ష గ్రాండ్ ఛాంపియన్ షిప్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్ పద్మజ అభినందనలు తెలిపారు.

19న ఛత్రపతి శివాజీ చారిత్రక నాటక ప్రదర్శన



విజయవాడ కల్చరల్: సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో 19వ తేది ఆదివారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సంచాలక్ కోనేరు దుర్గాప్రసాద్ తెలిపారు. సంస్కార భారతి ఆధ్వర్యాన అయోధ్యనగర్‌లోని హైందవి కార్యాలయంలో విలేకరుల సమావేశం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ 350 జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా శివాజీ జీవితంలోని ముఖ్య ఘట్టాల ఆధారంగా చేసిన నాటకం తొలి ప్రదర్శన నగరంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రచయిత, దర్శకుడు పీవీఎస్ కృష్ణ, అతిథులు బ్రోచర్ ఆడియోను ఆవిష్కరించారు. సమావేశంలో సంస్కార భారతి ఏపీ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ కృష్ణప్రసాద్, బీ పవన్‌కుమార్, సంస్కార భారతి సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి హోం గార్డెన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోజ్ సొసైటీ సభ్యులు

పటమట(విజయవాతూర్పు): రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు హోంగార్డెన్ కాంపిటీషన్స్, జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో హార్టికల్చర్ షో నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు జీ ఎస్ఆర్ మోహన్‌రావు తెలిపారు. ఫన్ టైం క్లబ్ వెనక సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరాల్లో పెరిగిపోయిన కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ ఇంట్లో తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హోం గార్డెన్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు నాలుగు కేటగిరీలలో జరుగుతుందని పేర్కొన్నారు. చిన్నా – పెద్ద తోటలు, పండ్లు, కూరగాయ మొక్కలు, టెర్రస్ గార్డెన్లు పెంచే ఔత్సాహిక మొక్కల ప్రేమికులు పాల్గొనవచ్చన్నారు. సొసైటీ కార్యదర్శి పద్మప్రియ మాట్లాడుతూ జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే హార్టికల్చరల్ షోలో అనేక జిల్లాల నుంచి మొక్కల ప్రేమికులు, నర్సరీల నిర్వాహకులు పాల్గొంటున్నారని వెల్లడించారు. మొక్కల ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా ఉంటాయని వివరించారు. మొక్కలకు సంబంధించిన కుండీలు, ఎరువులు, ఆర్గానిక్ క్రిమిసంహారక మందులు తదితర స్టాల్స్ ను నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. కాంపిటీషన్లో పాల్గొనదలుచుకున్న వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోలని సూచించారు. సొసైటీ సభ్యులు హోం గార్డెన్ కాంపిటీషన్స్ బ్రోచర్ రిలీజ్ చేశారు. సొసైటీ సభ్యులు డాక్టర్ సీత మహాలక్ష్మి ఛాయాదేవి, ఉషారాణి, రత్నలక్ష్మి, ఎ. లక్ష్మి, విశాల, సుమబింధు, జ్యోత్స్న, రాఘవేంద్రరావు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

14న చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):విద్యార్థులకు చిత్రలేఖనంపై ఆసక్తి కలిగించడానికి బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 తేదీ డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రమేష్ ఆసుపత్రి రోడ్డులోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ఏలాంటి ప్రవేశ రుసుం లేదని, పాఠశాల, కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులు అయినా పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీల్లో డ్రాయింగ్ షీట్ అందచేస్తామని, కలర్స్ విద్యార్థుల వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్ అందచేస్తామని చెప్పారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏదైనా అంశంపై బొమ్మలు గీయవచ్చునని, 6, 7వ తరగతుల వారికి ల్యాండ్‌స్కేప్ అనే అంశంపై, 8, 9, 10వ తరగతుల వారికి పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై, ఇంటర్ విద్యార్థులకు పిక్నిక్ అనే అంశం, డిగ్రీ విద్యార్థులు జాతీయ సమగ్రత అనే అంశంపై బొమ్మలు గీయాలని వివరించారు. పోటీలు జరిగే రోజు ఉదయం స్పా కళాశాల ఆవరణలో పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొత్తపేట పోలీసులు సోమవారం దాడి చేశారు. బూరాడ వారి వీధిలో ఓ ఇంట్లో పేకాటాడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో సీఐ సుబ్రహ్మణ్యం పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు నిందితుల వద్ద నుంచి రూ. 15,210 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అద్భుతంగా సాగిన కచేరి



విజయవాడ కల్చరల్: ఒక పక్క మృదంగ విద్వాంసుడు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు లయ విన్యాసం, మరో పక్క కేవీ కృష్ణ వయోలిన్ వీటికి వంతపాడుతూ అంతర్జాతీయ ఘట విద్వాంసుడు సహకారంతో అద్భుతమైన రసస్పష్టికి సంగీత కళాశాల వేదికైంది. శ్రీ సద్గురు సంగీత సభ 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. మాండలిన్ మాస్ట్రో యూ రాజేష్ మూడు గంటలపాటు నిర్వహించిన కచేరి ఆద్యంతం సంగీత వైభవాన్ని చాటింది. కార్యక్రమాలను ప్రారంభించిన శ్రీ సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ తెలుగు వారైన యూ శ్రీనివాస్ పాలకొల్లులో జన్మించి కర్నాటక సంగీత వైభవాన్ని ప్రపంచానికి తన మాండలిన్‌తో చాటి చెప్పారని, తన సోదరుడు మాండలిన్ శ్రీనివాస్‌తో కలసి దేశ విదేశాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీపీ సత్తిబాబు



నారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖలో విశిష్ట సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు సేవా, ఉత్తమ సేవా పతకాలు పొందారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్‌ను టీకే రాణాను ఆయన కార్యాలయంలో మోకా సత్తిబాబు పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోతిన వారి వీధికి చెందిన నాగహారికకు 2015లో తులసీరామ్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. మద్యం తాగి భార్యను వేధించడంతో గత ఏడాది మే నెలలో పుట్టింటికి వచ్చేసింది. వేధింపులపై నాగహారిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికే అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

"కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు" అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. "ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

\- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - "'జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా" అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- "దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది" అని చెప్పుకొచ్చారు.


బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

\- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- "పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి" అన్నారు. "ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అన్నారు అనిల్ రావిపూడి. "తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు" అన్నారు 'బన్నీ' వాసు. "నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్" అన్నారు తేజా మార్ని. "ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు" అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

\- నిర్మాత గౌరీకృష్ణ

"నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- "'మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి" అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- "అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

\- దర్శకుడు మారేష్ శివన్

"ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది" అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-"ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు" అన్నారు.

